ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం


ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

ముష్కిన్ చెరువు కబ్జాలకు 'హైడ్రా' ముకుతాడు

ఎంతో మంది త్యాగధనులను అందించిన ఘనచరిత్ర ఎఐఎస్‌ఎఫ్ ది 10

సంపుటి 28, సంచిక: 336 | ఆదివారం | 31-05-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



ఉచిత విద్యుత్ రద్దుచేసినా.. మోటార్లకు మీటర్లు పెట్టినా..

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయం

ఉచిత విద్యుత్ రద్దుచేయకపోతే, మీటర్లు పెట్టకపోతే బిఆర్‌ఎస్ పోటీనుంచి తప్పుకుంటుందా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్

- రాజకీయ లబ్ధికోసమే కెసిఆర్, బిఆర్‌ఎస్ రైతుల ముసుగులో లైఫ్‌లైన్ కోసం యత్నిస్తున్నారు
- రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం
- కేంద్రం కేవలం ఎంఎస్‌పి ప్రకటించి వదిలివేసింది
- రాష్ట్రం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనాలి.. లేనిపక్షంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి నేతల ఇళ్లముందు పోస్తాం
- జర్నలిస్టులతో 'ఇష్టాగోష్ఠి'లో సిఎం

### తెలంగాణకు మహారాష్ట్ర నుంచి మోదీ వెయ్యి ఎకరాలు ఇప్పించలేరా?

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు ముంపు కోసం తెలంగాణకు చెందిన 5 మండలాలను మోదీ ఎపికి ఇప్పించారు. ఇప్పుడు తుమ్మిడి హట్టి కోసం మహారాష్ట్ర నుంచి వెయ్యి ఎకరాలు తెలంగాణకు ఇప్పించ లేరా? చర్చల ద్వారా జల వివాదాలను రాష్ట్రాలు పరిష్కరించుకోవాలని మోదీ చెబుతున్నారు. మరి తాము మహారాష్ట్ర సిఎం అపాయింట్‌మెంట్ కోరినా రావడం లేదు. అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మోదీపై వత్తిడి చేయవచ్చు కదా?

– సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేసినా, మోటర్‌లకు విద్యుత్ మీటర్లు పెట్టినా వచ్చే ఎన్నికల్లో తాము పోటీచేయబోమని, తాము ఉచిత విద్యుత్ రద్దు చేయకపోతే, మీటర్లు పెట్టక పోతే బిఆర్‌ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా? అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. రాజకీయ లబ్ధి కోసమే కెసిఆర్, బిఆర్‌ఎస్ రైతుల ముసుగులో లైఫ్‌లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతులు వాళ్ళను నమ్మరని, స్వయంగా బాల్క సుమనే తాము రైతుల కోసం ధర్నా చేస్తే పది మంది రైతులు కూడా లేరన్నారని చెప్పారు. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించేందుకు, పారదర్శక విధానంలో ప్రభుత్వం విభాగాలు జవాబుదారీతనంతో ఉండేందుకే రైతు డిస్కమ్ పేరుతో మూడవ డిస్కమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అసలు ఉచిత విద్యుత్ పేటెంటే కాంగ్రెస్ పార్టీదని, 1999 మ్యానిఫెస్టోలోనే ఈ అంశాన్ని పెట్టామని గుర్తు చేశారు. రైతుల నుంచి ప్రతి గింజా ధాన్యం కొనుగోలు తరువాయి 8లో

## ఉదయమే రాష్ట్ర అవతరణోత్సవాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

మండుటెండల కారణంగా ఈసారి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయం పూట నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలను ఉదయం 8.30 గంటలకే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జాతీయ పతాకావిష్కరణతో పాటు అవతరణ ఉత్సవ కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వేడుకలకు హాజరయ్యే అతిథులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

## హరీశ్‌రావు బిఆర్‌ఎస్‌లో ఉండరు

- కల్వకుంట్ల కుటుంబం అరెస్టు మోదీ చేతిలోనే ఉంది
- నేను, మహేశ్‌గౌడ్ కాంబిషన్‌లోనే 2029ఎన్నికలకు పోతాం
- సిబిఎస్‌ఇ ఫలితాలపై కెటిఆర్ ఎందుకు మాట్లాడడం లేదు
- గ్లోబరీనా కెటిఆర్ బినామీ కాబట్టే మౌనం
- ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

08

## సిపిఐ రాష్ట్ర కార్యాలయానికి మాజీ మావోయిస్టు అగ్రనేతలు



ప్రజాపక్షం/ హైదరాబాద్

అటవీబాట వీడి, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులను కమ్యూనిస్టులంతా మాతృ సంస్థ అయిన సిపిఐలో చేరాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు మరోసారి ఆహ్వానం పలికారు. మాజీ మావోయిస్టులు దేవ్‌జీ(టిప్పిరి తిరుపతి),మల్లా రాజిరెడ్డి(సంగ్రామ్), పుల్లూరి ప్రసాద్ రావు (చంద్రన్న) శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర నాయకత్వాన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సిపిఐ నేతలతో సమావేశమయ్యారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ కగార్ అపరేషన్‌కు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఐ(ఎం), తదితర వామపక్షపార్టీలతో పాటు ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు, మేధావులు అనేకమంది అనేక రూపాలలో ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు అడవుల్లో ఉన్న మావోయిస్టులు ప్రాణాలు కాపాడబడాలని కోరుకున్నారు. ఎన్‌కౌంటర్ పేరుతో ఏమి చేస్తారో తెలియని భయానక పరిస్థితుల్లో పాత్రికేయులు సహా అందరూ ఆందోళన వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే జన జీవన స్రవంతిలో కలిసి ఈ ముగ్గురు నేతలు కమ్యూనిస్టు పార్టీగా, కమ్యూనిజం పట్ల అభిమానం కలిగిన వారుగా సిపిఐ కార్యాలయానికీ రావాలనుకున్నారని, అయితే అప్పుడు సమయం కుదరకపోవడంతో ఇప్పుడు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా తమ కార్యాలయానికి వచ్చిన ఆ ముగ్గురికీ తరువాయి 8లో

## కర్నాటక సిఎల్‌పి నేతగా డికె

3వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం



**బెంగళూరు :** కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సిఎల్‌పి నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సిఎం సిద్ధరామయ్య డికె పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సిఎల్‌పి నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఐసిసి పరిశీలకులు కెసి వేణుగోపాల్, రణదీప్ సుర్జేవాలా ప్రకటించారు. అయితే కేవలం పది నిమిషాల్లోనే సిఎల్‌పి భేటీ ముగియడం గమనార్హం. సిఎల్‌పి నేతగా ఎన్నికైన తరువాత డికె శివకుమార్ గవర్నర్ గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. ఈ నేపథ్యంలో గవర్నర్ వారిని ఆహ్వానించారు. ఈ మేరకు శివకుమార్‌కు లేఖ రాశారు. జూన్ 3వ తేదీన సాయంత్రం 4.05 గంటలకు లోక్‌భవన్ ఆవరణలో డికె పమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, డికె శివకుమార్ శనివారం ఉదయం లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే, గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన శనివారమే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, తరువాయి 12లో



## పట్టపగలే చిమ్మచీకట్లు!

రాజస్థాన్‌లో ఇసుక తుఫాన్ బీభత్సం

**జైపూర్ :** రాజస్థాన్‌లో ఇసుక తుఫాను బీభత్సం సృష్టించింది. చురు, బికనేర్ ప్రాంతాలను ఇసుక తుపాను అతలాకుతలం చేసింది. సునామీ తరహాలో భారీ ఈదురు గాలులతో నివాస ప్రాంతాలను ఇసుక ముంచెత్తింది. ఇసుక తుఫానుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుఫాను ధాటికి పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. రాజస్థాన్‌లోని చురు, బికనేర్ ప్రాంతాల్లో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. ఆకాశాన్ని భారీ ధూళి మేఘాలు కమ్మేయడంతో పట్టపగలే రాత్రిని తలపించింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భయంకరమైన ఇసుక తుఫాను విరుచుకుపడింది. సుడిగాలిలా చెలరేగిన భారీ ధూళి మేఘాలు ఆకాశాన్ని పూర్తిగా కప్పేశాయి. విపరీతమైన వేగంతో గాలులు వీయడంతో వాహనాల తరువాయి 8లో

## బిఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్

- సింగరేణిపై వివాదాస్పద వ్యాఖ్యలు : కేసు నమోదు
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

ప్రజాపక్షం/హైదరాబాద్



బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్‌ను హైదరాబాద్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తెలంగాణ భవన్ వద్ద సుమన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచి హైడ్రామా తరవాత ఎట్టకేలకు పోలీసులు సుమన్‌ను ఉద్రిక్త వాతావరణంలో అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇటీవల సింగరేణిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తనను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయించారని ఎంఎల్‌ఎ బాల్క సుమన్ అన్నారు. అరెస్ట్‌కు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కి పైగా కేసులు పెట్టారని, తరువాయి 8లో

## ట్రంప్ ఊగిసలాట



- ఇరాన్‌తో ప్రాథమికంగా కుదిరిన అవగాహనా ఒప్పందంపై రెండు గంటలు చర్చలు.. నిర్ణయం శూన్యం
- అణ్వాయుధం ఉండకూడదు, మందుపాతరలు తీసేయాలని డిమాండ్
- ట్రంప్ వ్యాఖ్యలు సత్యాసత్యాల సమ్మేళనం
- హామీలపై నమ్మకం లేదు, కార్యాచరణ కావాలి : ఘాలిబాఫ్

**వాషింగ్టన్/టెహ్రాన్ :** ఇరాన్‌తో ప్రాథమికంగా కుదిరిన అవగాహనా ఒప్పంద పత్రం (ఎంఓయు) ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండు గంటలసేపు సిత్యుయేషన్ రూమ్‌లో ముఖ్య సహాయకులతో సంభాషణలు జరిపారు. కానీ ఎలాంటి నిర్ణయం లేకుండానే ఈ సమావేశం ముగిసిందని వైట్‌హౌస్ వర్గాలు శనివారం మధ్యాహ్నం ప్రకటించాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించి ఇరాన్‌ను విశ్వసించి ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేయాలా? వద్దా? ఎంఓయు ముసాయిదాపై ముందుకు వెళ్ళాలా? వద్దా? అని ట్రంప్ ఎటూ పాలుపోని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ చర్చల్లో నిలబడలేక ట్రంప్ క్రమంగా పట్టు సడలి దిగజారిపోతున్నారని మీడియాలో ఒక వర్గం వ్యాఖ్యానించింది. చిట్టచివరగా ఒక కృతనిశ్చయం తీసుకోవడంపై ట్రంప్ ఆలోచిస్తున్నారని ఈ విషయాలపై వ్యాఖ్యానించడానికి ఎలాంటి అధికారాలు లేని వైట్ హౌస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది. ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకోవడానికి ట్రంప్ గీసుకున్న రెడ్‌లైన్స్‌కు అనుగుణంగా సంతృప్తి చెందితేనే ఒప్పందాన్ని ఆయన ఖరారు చేస్తారన్నారు. తాత్కాలిక ఒప్పందంపై అమెరికా–ఇరాన్ సంప్రదింపుకర్తలు కొన్ని నిబంధనలకు కట్టుబడ్డారని అసోసియేటెడ్ ప్రెస్ సహా కొన్ని ఇతర అంతర్జాతీయ మీడియా సంస్థలు ప్రచారం చేసిన మరునాడు ఉన్నతస్థాయి సంభాషణలను ట్రంప్ ధృవీకరించారు. ''హోర్ముజ్ జలసంధిలో ఇరువైపులా నౌకల రాకపోకలకు ఎలాంటి సుంకాలు వసూలు చేయకూడదు, ఇది అంతర్జాతీయస్వేచ్ఛావాణిజ్య ప్రాంతంగా ఉండాలి,ఎప్పటికీ అణ్వాయుధాన్ని లేదా అణుబాంబును కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించాలి,అంతర్జాతీయంగా నౌకల రాకపోకల నిమిత్తం జలసంధిని తప్పనిసరిగా తెరవాలి,జలసంధిలో పెట్టిన మందుపాతరలు తొలగించాలి'' అని సోషల్ మీడియాలో ట్రంప్ కోరారు. శుద్ధిచేసిన యురేనియంను నాశనం చేసేందుకు అమెరికాను ఇరాన్ అనుమతించాలని అప్పటివరకూ విదేశీ బ్యాంకుల నుండి తరువాయి 12లో

## సియుఇటి(యుజి) పరీక్షలో సాంకేతిక లోపం

కొన్ని కేంద్రాల్లో పరీక్ష ఆలస్యం : ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ :** దేశంలో నిర్వహించిన మరో పరీక్ష వివాదాస్పదమైంది. ఇప్పటికే నీట్ పరీక్ష పేపర్ లీక్, 12వ తరగతి బోర్డు పరీక్షకు ఆన్‌స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్ (ఒఎస్‌ఎం)ను ప్రవేశపెట్టడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటుండడంపై ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని నిలదీస్తున్నాయి. ఈ తరుణంలో శనివారం భారతదేశ వ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే సియుఇటి(యుజి)– 2026 పరీక్ష సాంకేతిక లోపం కారణంగా కొన్ని కేంద్రాలలో ఆలస్యమైందని జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) తెలిపింది. ఈ సమస్యను పరిష్కరించామని, ఏ అభ్యర్థికీ నష్టం జరగకుండా ఉండేందుకు పూర్తి అదనపు సమయంతో పరీక్ష తరువాయి 8లో

## భారీ ఉగ్రకుట్ర భగ్నం

- దావూద్ నెట్‌వర్క్, ఐఎస్‌ఐ ముఠాకు చెందిన 9 మంది అరెస్ట్
- ముష్కరుల నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, హ్యాండ్ గ్రెనేట్లు, పేలుడు పదార్థాల స్వాధీనం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ పోలీసులు శనివారం భారీ ఉగ్రకుట్నను భగ్నం చేశారు. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంం నెట్‌వర్క్, పాక్ గూఢచార సంస్థ ఐఎస్‌ఐతో సంబంధమున్న 9 మందిని అరెస్టు చేశారు. ఆ ముష్కరుల నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, హ్యాండ్ గ్రెనేడ్లు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీరు దేశ రాజధానిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, రక్షణ స్థావరాలతో సహా ప్రముఖ మతపరమైన ప్రదేశాలపై ఉగ్రదాడులు చేయడానికి కుట్ర పన్నినట్లు గుర్తించారు.

**దేశ రాజధానిలో ఉగ్రదాడులకు ప్లాన్**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడులు చేయాలనే లక్ష్యంలో ఐఎస్‌ఐ ఇదంతా చేసింది. ఈ ఉగ్రవాదుల ముఠా తరువాయి 12లో



ప్రధాని మోదీతో మార్కో రుబియో (ఫైల్)

రూ. 47,75,000 కోట్ల దిగుమతులకు

# రహస్య డీల్..!

- మోదీ దాచిన నిజాన్ని బయటపెట్టిన అమెరికా
- భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం
- ఐదేండ్లలో అగ్రికల్చర్, పాడి, పౌల్ట్రీ,ఐటీ రంగాలు కుదేలు
- రోడ్డున పడనున్న కోట్లాది మంది రైతులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న ఐదేళ్లలో రైతుల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అనే పదమే మనకు వినిపించదు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఖరీదు చేసే అవసరమే లేదు. మా పంట ఉత్పత్తులు కొనండి అనే రైతుల నుంచి ఎలాంటి డిమాండ్ రానేరాదు..అవును ఇదంతా నిజమే! అసలు రైతు అనే వాడే ఉండడు. రైతే కాదు ఐటి ఉత్పత్తుల తయారీదారులు, హార్డ్‌వేర్ తయారీ దారులు, పౌల్ట్రీ పరిశ్రమలు, పాడి పరిశ్రమలు కూడ దాదాపు కనుమరుగవుతాయి. దీని కంతటికి కారణం ఇటీవల దేశ ప్రధాని నరేంద్రమోదీ అమెరికాతో అవగాహన కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందమే కారణం. దీని కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మొక్కజొన్నలను దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో కూడా కొనుగోలు చేయలేదు. మన తెలంగాణ రాష్ట్రంలో కూడా పత్తి పరిస్థితి ఇలాగే ఉంది. ఐదేళ్లలో అమెరికా నుంచి రూ.47,75,000 కోట్ల విలువైన గూడ్స్‌ను భారత్ ఖరీదు చేయాలని వాణిజ్య ఒప్పంద సారాంశం. ఈ విషయం అమెరికా స్వయంగా ప్రకటించింది. ఇటీవల అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో మోదీని కలిశాడు. కలిసిన తర్వాత ట్విట్టర్‌లో ఒక పోస్ట్ చేశాడు. ఇందులో కొన్ని ఫోటోలు కూడా పెట్టాడు. ఈ వాణిజ్య ఒప్పందం కోసం అమెరికన్ అధికారులు ఎంత కష్ట పడ్డారు, అవన్నీ చెప్తూ వాళ్లని తరువాయి 8లో

మున్సిపల్ శాఖలో

## భారీగా బదిలీలు

91 మంది అధికారుల స్థానచలనం !


ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. వివిధ గ్రేడ్‌లకు చెందిన మొత్తం 91 మంది మున్సిపల్ కమిషనర్లు, అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ సెక్రటరీ డాక్టర్ టి.కె. శ్రీదేవి జి.ఓ.ఆర్.టి నెంబర్ 574 ద్వారా బదిలీల ఉత్తర్వులను విడుదల చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. బదిలీ అయిన వారిలో సుదీర్ఘ కాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వారితో పాటు పలువురు సీనియర్ గ్రేడ్ అధికారులు కూడా ఉన్నారు.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు : స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎ. స్వామి, గ్రేడ్ II కమిషనర్ జి. వెంకట్ రామ్ రెడ్డి, కె. చంద్ర శేఖర్ (గ్రేడ్ III), పి. శ్రావణి, ఎస్. శాంతి ప్రియ, ఎస్. స్వప్న, సెలెక్షన్ గ్రేడ్ కమిషనర్ తరువాయి 12లో




## చరిత్రను మోసిన శ్రమజీవులు..




ప్రాచీన నాగరికతలను గుర్తుచేసే తొలి దృశ్యం మన కళ్లముందు నిలిచేది వారి భవ్య నిర్మాణాలే. ఆకాశాన్ని తాకే పిరమిడ్లు, సుశ్రుతమైన నగర ప్రణాళికలు, నదులను నియంత్రించిన కాలువలు, శతాబ్దాలుగా నిలిచిన దేవాలయాలు. కానీ ఈ గొప్ప నిర్మాణాల వెనుక ఉన్న నిజమైన శక్తి ఎవరు? రాజుల ఆజ్ఞలా? దేవతల కృపలా? కాదు. వాటి వెనుక నిలిచింది సాధారణ కార్మికుడి శ్రమ. చరిత్ర పుస్తకాలు తరచూ పాలకుల పేర్లను మాత్రమే గుర్తుపెడతాయి. కానీ, నిజానికి నగరాలను నిర్మించింది, నీటిని మళ్లించింది, రాళ్లను మోసింది సామాన్య ప్రజలే. వారి చేతులే ప్రాచీన ప్రపంచానికి శరీరాన్ని ఇచ్చాయి. ఈజిప్టు నాగరికతను తీసుకుంటే, పిరమిడ్లు ఇప్పటికీ మానవ మేధస్సుకు సవాలుగా నిలుస్తున్నాయి. అయితే ఇవి వేలాది బానిసల చేత నిర్మాణమైందనేది అపోహ. వాస్తవానికి, ఈ నిర్మాణాలలో పాల్గొన్నవారు శిక్షణ పొందిన ఈజిప్టియన్ కార్మికులే. వారు సమాజ సేవగా లేదా కాలానుగుణంగా పని చేశారు. వారికి ఆహారం, వేతనం, నివాస సౌకర్యాలు ఉండేవి. రాయి ముక్కలను కొట్టి, తరలించి, అమర్చిన ప్రతీ క్షణం వారి శారీరక శ్రమతో పాటు గణిత, ఇంజనీరింగ్ అవగాహన కూడా దాగి ఉంది. పిరమిడ్లు ఫరోల సమాధులే కావచ్చు, కానీ అవి కార్మికుల నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యాలు.

మెసపోటేమియా నాగరికతలో నదీ నియంత్రణే జీవనాధారం. టైగ్రిస్–యూఫ్రేటిస్ నదులు వరదలతో పాటు సంపదను కూడా తెచ్చేవి. కానీ ఆ సంపదను ఉపయోగపడేలా చేయడం కార్మికుల పని. కాలువలు తవ్వడం, డైక్స్ నిర్మించడం, నీటిపారుదల వ్యవస్థలను శుభ్రపరచడం వంటి పనులన్నిటికీ నిరంతర శ్రమ అవసరం. ఒక కాలువ పనిచేయకపోతే పంటలు నాశనం, నగరాలు ఆకలితో అలమటించేవి. కాబట్టి మెసపోటేమియా నాగరికత నిలబడిందంటే, అది కార్మికుల చెమటతోనే.

సింధు లోయ నాగరికత అయితే శ్రమకు మరో రూపాన్ని చూపిస్తుంది. వ్యవస్థబద్ధత. మోహెంజోదారో, హరప్పా వంటి నగరాలు ఫైర్‌బేక్డ్ ఇటుకలతో నిర్మించబడ్డాయి. ఒకే కొలతల ఇటుకలు, సూటిగా వెళ్లే వీధులు, అత్యాధునిక మురుగునీటి కాలువలు, ప్రజా స్నానాల గృహాలు వంటివన్నీ యాదృచ్ఛికంగా ఏర్పడలేదు. ఇటుకలు తయారు చేసిన కార్మికులు, వాటిని అమర్చిన నిర్మాణ కార్మికులు, నగర ప్రణాళికను అమలు చేసిన శ్రమజీవుల సమన్వయం వల్లే ఇది సాధ్యమైంది. ఇక్కడ రాజభవనాల కన్నా ప్రజా మౌలిక వసతులకే ప్రాధాన్యం ఇవ్వడం, కార్మిక శ్రమ విలువను స్పష్టంగా చూపిస్తుంది.

ఈ మూడు నాగరికతల్లో ఒక సత్యం స్పష్టంగా కనిపిస్తుంది. అదేమిటంటే, భవనాలు రాళ్లతో కట్టబడ్డా, వాటిని నిలబెట్టింది మనుషుల శ్రమే. చరిత్రలో శ్రమజీవుల పేర్లు మిగలకపోయినా, వారి పని మిగిలింది. ప్రతి దేవాలయంలో, ప్రతి కాలువలో, ప్రతి నగర వీధిలో.. వారి అడుగుల ముద్ర ఉంది. అందుకే, ప్రాచీన చరిత్రను అర్థం చేసుకోవాలంటే రాజుల కిరీటాలకన్నా, కార్మికుల చేతుల్ని చూడాలి. ఎందుకంటే నాగరికతలను కలలు కన్నవారు పాలకులైతే, వాటిని నిజం చేసినవారు శ్రమజీవులే.

## నాగరికతను నిలబెట్టిన సామాన్యుల జీవనశ్రమ



ప్రాచీన నాగరికతలను మనం సాధారణంగా రాజభవనాలు, దేవాలయాలు, యుద్ధాలు, శిలాశాసనాల ద్వారానే గుర్తిస్తాం. కానీ ఈ భవ్య రూపాల వెనుక ఒక నిశ్శబ్దమైన, నిరంతర ప్రవాహం ఉంది.అదే సామాన్యుల దైనందిన జీవితం. వ్యవసాయం, మత్స్యకార్యం, పశుపోషణ వంటి సాధారణంగా కనిపించే వృత్తులే నాగరికతల సాంస్కృతిక కొనసాగింపుకు మూలస్తంభాలయ్యాయి. ప్రతి సమాజంలోనూ రైతు ఉదయం భూమిని దున్నడం, విత్తనాలు చల్లడం, పంట కోయడం వంటి చర్యల్లో నిమగ్నమవుతాడు. అవి ఆహార ఉత్పత్తి చర్యలు. అదే సమయంలో, కాలచక్రానికి అనుగుణంగా ఏర్పడిన సంస్కృతి చిహ్నాలు కూడా. పంటకాల్లాలు పండుగలయ్యాయి..వర్షాలు ప్రార్థనలయ్యాయి.. కోత ఉత్సవాలు సామూహిక ఆనందాలయ్యాయి... ఈ విధంగా వ్యవసాయం మతం, ఆచారం, కళ్లీ కలగలిసి, ఒక జీవన విధానంగా మారింది. అదే విధంగా, నదులు, సముద్రాల ఒడ్డున నివసించిన ప్రజల జీవితం మత్స్యకారంతో ముడిపడి ఉండేది. చేపల వేటకు వెళ్లడం, పడవలు తయారు చేయడం, వలలు నేయడం వంటి పనులు తరతరాలుగా సంక్రమించిన నైపుణ్యాలు. ఈ వృత్తుల ద్వారా ఆహారం మాత్రమే కాదు, కథలు, పాటలు, విశ్వాసాలు కూడా తరలాయి. నదులు ప్రవహించినట్లే, సంస్కృతి కూడా ఒక తరం నుంచి మరో తరానికి ప్రవహించింది. పశుపోషణ మరో కీలక ఆధారం. గోవులు, గొర్రెలు, మేకలు కేవలం ఆహారానికి మాత్రమే గాక, వస్త్రాలకు, వ్యవసాయానికి, మారక వాణిజ్యానికి కూడా అవసరమయ్యాయి. పశువులతో ముడిపడిన పూజలు, ప్రతీకలు, కథలు అనేక నాగరికతల్లో కనిపిస్తాయి. ఇవి మనిషి–ప్రకృతి మధ్య ఉన్న సన్నిహిత సంబంధానికి నిదర్శనాలు. ఈ సాధారణ జీవన కార్యకలాపాలే సమాజాన్ని నిలబెట్టాయి. యుద్ధాలు వచ్చినా, రాజులు మారినా.. పొలం దున్నడం ఆగలేదు, చేపల వేట నిలవలేదు, పశుపోషణ కొనసాగింది. అందుకే నాగరికతలు పూర్తిగా కూలిపోకుండా, రూపం మార్చుకుని ముందుకు సాగగలిగాయి. చరిత్రలో సామాన్యుల పేర్లు అరుదుగా నమోదయ్యాయి. కానీ వారి జీవన విధానం, వారి ఆచారాలు, వారి శ్రమే సంస్కృతిని నిలిపాయి. వారు లేకపోతే దేవాలయాల్లో పూజలు ఉండేవి కావు, నగరాల్లో జీవం ఉండేది కాదు. అందుకే, సాంస్కృతిక నిరంతరత్వం అనేది రాజుల నిర్ణయాల వల్ల కాదు.. సామాన్యుల దైనందిన శ్రమ వల్ల సాధ్యమైంది. నాగరికతకు ప్రాణం పోసింది వారు. ఇది చరిత్రలో తరచూ కనిపించని సత్యం, కానీ మారని నిజం.

## 'ఇయర్‌లోబ్' ప్రయోజనం ఏమిటి?



మన చెవిలో కనిపించే మృదువైన దిగువ భాగాన్ని శాస్త్రీయ భాషలో 'ఇయర్‌లోబ్' అంటారు. ఇది చెవిలోని కార్టిలేజ్ భాగంలా గట్టిగా కాకుండా, మృదువైన కొవ్వు, చర్మంతో ఏర్పడిన నిర్మాణం. కాగా, ఈ ఇయర్‌లోబ్‌కు నిజంగా ప్రత్యేకమైన జీవశాస్త్ర ప్రయోజనం ఉందా? లేదా అనే ప్రశ్న చాలాకాలంగా శాస్త్రవేత్తలను వేధిస్తున్నది. కొంతమంది శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఇయర్‌లోబ్‌కు స్పష్టమైన లేదా అవసరమైన జీవశాస్త్ర కార్యం లేదు. చెవి పైభాగంలో ఉన్న పిన్నా, చెవి రంధ్రం, లోపలి శ్రవణ వ్యవస్థ అనేవే చెవిలో ప్రధానంగా శబ్దాన్ని స్వీకరించే భాగాలు. ఇవే శబ్ద తరంగాలను మెదడుకు పంపుతాయి. ఈ ప్రక్రియలో ఇయర్‌లోబ్‌కు ప్రత్యక్ష పాత్ర దాదాపుగా ఏమీ ఉండదు. అయితే ఇయర్‌లోబ్ పూర్తిగా పనిలేనిదని చెప్పడం కూడా కష్టమే. ఈ భాగంలో రక్తనాళాలు, నాడి ముగింపులు (నెర్వ్ ఎండింగ్స్) ఎక్కువగా ఉంటాయి. అందువల్ల స్పర్శకు ఇది చాలా సున్నితంగా స్పందిస్తుంది. కొన్ని పరిశోధకులు దీనిని సామాజిక లేదా భావోద్వేగ పరమైన పరస్పర చర్యల్లో చిన్న పాత్ర పోషించే నిర్మాణంగా చూస్తారు. ఉదాహరణకు, మానవ సంబంధాలలో స్పర్శ లేదా సన్నిహిత సమయంలో ఈ భాగం స్పందించవచ్చు. మరొక కోణం కూడా ఉంది. జీవ పరిణామ శాస్త్రం ప్రకారం మన శరీరంలోని కొన్ని నిర్మాణాలు గతంలో ఉపయోగకరంగా ఉండి, ఇప్పుడు పెద్దగా అవసరం లేకపోయినా ఇంకా కొనసాగుతుంటాయి. ఇలాంటి నిర్మాణాలను కొన్నిసార్లు 'వెస్టిజియల్ స్ట్రక్చర్స్' అని పిలుస్తారు. కొంతమంది శాస్త్రవేత్తలు ఇయర్‌లోబ్‌ను కూడా ఈ వర్గానికి చెందినదిగా భావించే అవకాశం ఉందని సూచిస్తారు, అయితే దీనిపై పూర్తిగా ఏకాభిప్రాయం లేదు. ఇది పూర్తిగా పనిలేని భాగం అని ఖచ్చితంగా ఎవరూ నిర్ధారించలేదు. మన శరీర నిర్మాణం ఎలా పరిణామం చెందిందో అర్థం చేసుకోవడానికి ఇది ఆసక్తికరమైన ఉదాహరణగా నిలుస్తుంది.

– బిఎస్ఎస్ మైత్రేయి

## ఈ ఏడాది దేశానికి గడ్డుకాలం

కష్టాలు కలిసికట్టుగా వస్తాయన్నది నానుడి. వ్యక్తుల జీవితాల్లో అయినా, దేశ ప్రస్థానంలో అయినా ఇది యదార్థం అన్నట్లుంది ఈ ఏడాది మన దేశం పరిస్థితి. జిడిపి వృద్ధిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నాల్గవ స్థానానికి చేరాం. మరికొద్ది సంవత్సరాల్లో మూడోస్థానానికి చేరతాం అని ఊకదంపుడు ఉపన్యాసాలతో, ప్రపంచంలో కేంద్రస్థానానికి చేరుతున్నాం – అదే 2047 వికసిత్ భారత్ గమ్యం అని – నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ వైఫల్యాలను ఆకర్షణీయ నినాదాలతో కప్పిపుచ్చుకుంటూ ప్రజలను భ్రమల్లో ముంచుతున్నది. 12 సంవత్సరాల బిజెపి పరిపాలన దేశాన్ని ముందుకు తీసుకుపోకపోగా – ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నట్లుగా సాగుతోంది. దేశ జనాభాలో మెజారిటీ, సంపద సృష్టించే కార్మిక–కర్షకులు ఇతర శ్రమజీవులు తమ హక్కులు, న్యాయమైన కోర్కెలకోసం ఎన్ని ఆందోళనలు చేసినా చెవికెక్కించుకోని ప్రభుత్వం వ్రేళ్లపై లెక్కించదగిన కార్పొరేట్లకు ఎర్రతివాచీ స్వాగతాలతో – పన్నుల తగ్గింపు, బ్యాంకులకు ఎగవేసిన లక్షల కోట్ల రుణా లు రద్దు, ప్రభుత్వరంగం ధ్వంసం, మౌలిక వసతుల కాంట్రాక్టులు అప్పగింత వగైరా బహుమానాలతో దేశాభివృద్ధిని మహా కోటీశ్వరుల సృష్టిలో పరుగులు పెట్టిస్తున్నది. ప్రజాస్వామ్యం, పౌరస్వేచ్ఛల విషయంలో ప్రజలపై ఉక్కుపాదం మోపుతోంది. మతం పేరుతో సమాజాన్ని విభజిస్తున్నది. ప్రతిదానికీ 'దేశభక్తి' అద్ది విమర్శకుల గొంతు నొక్కుతున్నది. మరోవైపున, అమెరికా, ఇజ్రాయెల్ అనుకూల విధానం వల్ల వాటి దుందుడుకు, యుద్ధోన్మాద చర్యల ను కనీసం తప్పుపట్టలేని దుస్థితిలో దేశాన్ని పడేసింది మోదీ ప్రభుత్వం. ఇంధన సంక్షోభం, ఆర్థిక వ్యవస్థపై ద్రవ్యోల్బణ ఒత్తిడి గత మూడు మాసాల్లో ఈ ప్రభుత్వ డొల్లతనాన్ని బట్టబయలు చేసింది. కష్టాల్లో ఉన్న దేశాన్ని ఈ సంవత్సరం వర్షపాతం లోటుతో కరువు వెన్నంటే ప్రమాదం పొంచి ఉన్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) తాజా నివేదిక వెల్లడించింది.

ఇరాన్‌పై అమెరికా దురహంకార యుద్ధం తెచ్చిపెట్టిన ఇంధన సంక్షోభం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ గత మూడు మాసాలుగా తీవ్రమైన ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు చవిచూస్తున్నది. అన్ని రంగాలు ఒత్తిడిలో ఉన్నాయి. నిరుద్యోగం పెరుగుతున్నది, ధరలు పెరిగి నిజవేతనాలు క్షీణించాయి. జీవన వ్యయం రోజురోజుకీ పెరుగుతున్నది. ఇప్పుడు మూడేళ్ల విరామం తర్వాత వర్షలోటు హెచ్చరిక అదనపు ఆందోళన కలిగిస్తోంది. మన దేశ వ్యవసాయంలో 70 శాతం వర్షాధారమే అయినందున ఇది మరింత ఆందోళనకరం. భూగర్భ జలాలు, ఉపరితల జలవనరులకు కూడా వర్షమే ఆధారం. ప్రస్తుతం తటస్థ ఎల్‌నినో – దక్షిణ ప్రాంత పరిస్థితులు ఈక్వటోరియల్ పసిఫిక్ ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితుల దిశగా పరివర్తన చెందుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఐఎండి తాజా వాతావరణ జోశ్యాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 13 నాటి అంచనాలో ఐఎండి వర్షపాతం దీర్ఘకాల సగటులో 92 శాతంగా – అంటే దాదాపు సాధారణంగా అంచనా వేసింది. అయితే మారిన పరిస్థితుల ప్రకారం ఇప్పుడు దేశం మొత్తంమీద 2శాతం తక్కువ వర్షపాతాన్ని అంచనా వేసింది. అంటే దేశం దుర్భిక్షం బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మోదీ జమానాలో ఐఎండి 2016 నుంచి తన నివేదికల్లో "దుర్భిక్షం" అనే మాటను వాడటం విర మించుకుంది. "లోటు, ఎక్కువ లోటు వర్షపాతం" అనే పదాలు వాడుతోంది. పదాలు మార్చినంతమాత్రాన ప్రభావం, ప్రభుత్వ బాధ్యత తగ్గదు కదా? లోటువర్షపాతం ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుంది, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూలత చూపుతుంది కాబట్టి ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవటం అవసరం.

మే 26వ తేదీకి దేశంలోకి ప్రవేశిస్తాయని భావించిన రుతుపవనాలు ఇంకా సముద్రంలోనే ఉన్నాయి – మరో వారం రోజులు పడుతుందని అంచనా. ఎల్‌నినో కొత్త కాదు అనేక పర్యాయాలు ఆ స్థితిని, దుర్భిక్షాన్ని దేశం చూసింది. అందువల్ల ప్రభుత్వం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవటం ప్రారంభించాలి – ఎందుకంటే రుతుపవనాల కదలిక, లోటు వర్షపాతం ఈ జూన్ నుంచే మొదలవుతోంది.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి, వాతావరణంలో తీవ్రమైన వ్యత్యాసాలను వాతావరణ శాఖ అంచనా వేసింది. జూన్‌లో తక్కువ వర్షాలతోపాటు కొన్ని ప్రాంతాల్లో ఎండవేడిమి, వడగాడ్పులు కొనసాగనున్నాయి. ఐఎండి నివేదిక ప్రకారం, "రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్‌సహా మధ్య తెలంగాణ, పరిసర జిల్లాలు సాధారణంకన్నా 30 శాతం అదనంగా వర్షం పొందుతాయి. కాగా ఉత్తర చివర, దక్షిణ చివర జిల్లాలు చాలావాటిలో 20–30 శాతం మధ్య వర్షపాతం లోటు ఉంటుంది. ఈ అసమ వర్షపాతంవల్ల వ్యవసాయం, జలయాజమాన్యం, రిజర్వాయర్‌ల నిర్వహణ తదితర విషయాల్లో తీవ్రమైన సవాళ్లు ఎదురవుతాయి. అందువల్ల కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రప్రభుత్వం కూడా అప్రమత్తమై ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సత్వర చర్యలు చేపట్టాలి. ●

# మోదీ పుష్కరకాల పాలనలో దేశం తీసికట్టు



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీఏ తొలి ప్రభుత్వం 2014 మే 26న బాధ్యతలను చేపట్టింది. వరుస విజయాలతో 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకుంది. 2014లోమోదీ అధికారంలోనికి వచ్చినప్పుడు ఐదేళ్లలో ప్రజలకు ప్రశాంతమైన, పారదర్శకమైన జీవితాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అయితే తొలిసారి కేంద్రంలో అధికారంలోనికి రావడానికి ముందు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు పర్చలేకపోయారు.

**పెరుగుతున్న నిరుద్యోగం..**

అధికారంలోనికి వచ్చిన వెంటనే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ చేపడతామని ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లారు. దేశంలో నిరుద్యోగిత రేటు కనీవినీ ఎరగని స్థాయికి చేరింది. యువతలో నిరుద్యోగిత రేటు 15 శాతానికి చేరినట్లు ఎంఒ ఎస్పిఐ తాజా రిపోర్టు తెలిపింది. డిగ్రీ పూర్తయిన 84 శాతం మందికి ఉద్యోగాలు లేవని, ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో ప్రతి 10 మందిలో 8 మంది కొలువులు రావట్లేదని, 'అన్ స్టాప్ టాలెంట్ రిపోర్ట్ 2026' లో వెల్లడైంది. గత 12 ఏళ్లలో 24 కోట్లు ఉద్యోగ ఖాళీలను నింపాలి. అయితే 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మాత్రమే జరిగినట్లు నివేదిక చెప్తున్నది. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏమిటని ఇండియా టుడే సి ఓటర్ సంస్థ ఇటీవల సర్వే నిర్వహిస్తే.. నిరుద్యోగమే తొలి సమస్యని 76 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఉద్యోగం రాకపోవడంతో 2024 ఒక ఏడాదిలోనే 14,778 నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్న ట్లు ఎన్సిఆర్బి తాజా నివేదిక పేర్కొంది(రోజుకు 40 మంది). మరో వైపు నీట్ లాం టి ఎగ్జామ్స్ కూడా లీకేజీలు లేకుండా నిర్వహించలేని దుస్థితి చూస్తున్నాం.

**నోట్ల రద్దు ఫలితమేది?**

దేశ సంపద కొంతమంది చేతుల్లో బందీ అయింది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. లక్షలాది కోట్ల రూపాయలు విదేశీ బ్యాంకులలో దాచుకుంటున్నారు. అట్టి డబ్బులు అన్ని వెలికి తీసి ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షల చొప్పున వారి ఖాతాలో జమ చేస్తామని, నల్లధనాన్ని అరికడతామని గొప్పలు చెప్పిన నరేంద్ర మోదీ..2016లో అర్థరాత్రి ఆగమేఘాలపై పెద్ద నోట్లను రద్దును చేసినప్పుడు 50 రోజులు గడువు కోరారు. అప్పుడు ప్రారంభమైన దేశ ఆర్థిక వ్యవస్థ పతనం, కోవిడ్ కాలంలో మరింత క్షీణించింది. మన దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు పట్టడం తోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి దాపురించింది. నిన్న మొన్నటి వరకు దేశం మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతున్నదని, జిడిపి, బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నదని గొప్పలు చెప్పుకొని జబ్బలు చరుచుకున్న కేంద్ర పాలకులు యూటర్న్ తీసుకున్నా రు.

**అథః పాతాళానికి రూపాయి...**

2014లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 58.66 కాగా, ఇప్పుడు 96.95కు చేరుకుంది. అంటే 12 ఏళ్లలో డాలర్‌తో రూపాయి విలువ65.27 శాతం మేర క్షీణించింది. దేశం నుంచి విదేశాలకు వెళ్లే వస్తు ఉత్పత్తుల(ఎగుమతులు)కంటే విదేశాల నుంచి దేశంలోనికి వస్తున్న వస్తూత్పత్తులే( దిగుమతులు) ఎక్కువగా ఉండటంతో వాణిజ్య లోటు పెరిగిపోతున్నది. అంతేగాక దేశంలోని ఫారెక్స్ నిలువలు(విదేశీ మారకం లేదా డాలర్లు) తరిగిపోతున్నాయి. ముఖ్యంగా అమెరికా ఇరాన్‌పై యుద్ధం మొదలైన దగ్గర్నుంచి వేగంగా క్షీణిస్తున్నాయి. యుద్ధం మొదలవకముందు 728.494 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలు..ఇప్పుడు 688.894బిలియన్ డాలర్లకు పడిపోయాయి. దాదాపు గడచిన 3నెలల కాలంలో 39.6 బిలియన్ డాలర్లు హరించుకపోయా యి.

**దేశంలో పెట్రో మంటలు..**

నరేంద్ర మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పెట్రోలు, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. 12 ఏండ్ల వ్యవధిలో లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా 47.33 శాతం, 86.98శాతం మేర పెరిగాయి. 2014లో లీటర్ పెట్రోల్ రూ.73.5 ఉంటే ప్రస్తుతం రూ.115.58కు చేరింది.అప్పుడు లీటర్ డీజిల్ రూ.55.48గా ఉంటే ఇప్పుడు రూ.103.74 కు పెరిగింది. పెట్రో ధర పెంపుతో రవాణా చార్జీలు 30 శాతం మేర పెరిగినట్లు ట్రావెల్ ఏజెన్సీలు చెప్తున్నాయి. ఇక గ్యాస్ సిలిండర్ ధరలు కూడా భారీగా పెరిగాయి. 14 కిలోల గృహ వినియోగదారు సిలిండర్ 2014లో రూ.414 లుండగా, 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ రూ.1,692గా ఉంటే ప్రస్తుతం వాటి ధరలు వరుసగా రూ.965కు (పెరుగుదల 133.09%), రూ.3,315కు (పెరుగుదల 95.92%) ఎగబాకాయి.

**ప్రజలపై పన్నుల మోత..**

గత యుపిఎ ప్రభుత్వం ప్రజలపై విపరీత పన్నుల భారం మోపిందని పదేపదే విమర్శిస్తున్న మోదీ ప్రభుత్వం.. ఈ 12 ఏండ్ల ఎన్డీఏ సర్కార్ పాలనలో సామాన్యుడి జీవితార్జనలోని సింహ భాగం పన్నులకే పోతున్నట్టు అర్థమవుతున్నది. రోజువారీగా ప్రజలు వినియోగించే ప్రతి వస్తువుకు పన్ను కడుతున్నాం. 2014 లో నరేంద్ర మోదీ తొలిసారిగా ప్రధానమంత్రి పగ్గాలు చేపట్టినప్పుడు కేంద్రానికి పన్నుల రూపంలో రూ.17.94 లక్షల కోట్ల ఆదాయం వస్తే, 2026 నాటికి అది రూ. 35 లక్షల కోట్లు దాటింది.

**పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు..**

నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించి ధరల పెరుగుదలను అరికడతామని చెప్పిన మోదీ..ఎన్డీఏ 12 ఏళ్ల పాలనలో నిత్యావసరాల ధరలు 30 శాతం నుంచి 300 శాతం వరకు పెరిగాయని లోకల్ సర్కిల్స్ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడించింది. బియ్యం, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చెక్కర, పాలు, చింతపండు తదితర నిత్యావసరల ధరలు ఆకాశనంటుతున్నాయి. పెరిగిన ఖర్చులతో రోజువారీ ఖర్చులను భరించలేక పోతున్నామంటూ 64 ఒశాతం మంది ప్రజలు 'సి ఓటర్ నిర్వహించిన ఓ సర్వేలో వాపోయారు'. ఒకవైపు చాలీచాలని జీతం..మరోవైపు నిత్యావసరాలు ధరలు పెరిగిపోవడంతో ప్రతినెల కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

ఇదేనా మోదీ 12 ఏండ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన అచ్చేదిన్? ఏమి కొనాలి, ఏం తినాలి అనే స్థాయికి దేశం దిగజారింది. నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, ఉపాధి లేమితో లక్షలాది కుటుంబాలు కునారిల్లుతున్నాయి. పుండు మీద కారం చల్లినట్లు మోదీ పొదుపు సూత్రాలు ప్రజల్లో మరిన్ని భయాలు సృష్టిస్తున్నాయి.2014లో కేంద్రంలో గద్దె ఎక్కిన మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ 12 ఏళ్ల పాలనలో ఏమి సాధించిందో ఇకనైనా తెలపాలి.

**అప్పుల భారత్:**

మోదీ అధికారం చేపట్టిన నాటికి విదేశీ రుణం 446 బిలియన్ డాలర్లు ఉంటే.. ఇప్పటివరకు ఎన్డీఏ ప్రభుత్వం 191లక్షల కోట్లు అప్పు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 17.20 లక్షల కోట్లు అప్పులు చేస్తామని ప్రకటించింది. 2014–15లో 62,78,553 కోట్ల రూపాయల అప్పు ఉంటే, నేడు 2026–27 కు 2,08,72,510 లక్షల కోట్లకు చేరడం అప్పుల భారతిగా మారడం ఎన్డీఏ అచ్చే దినిలో భాగమే. నాడు ప్రతి భారతీయుడుపై రూ.48,296 అప్పు ఉంటే ఇప్పుడు రూ. 1,48,000 ఉన్నది.

**అప్పుల ఊబిలో అన్నదాతలు..**

లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ దిగ్గజాలకు రాయితీలు కల్పిస్తూ.. దేశానికి వెన్నెముకైనా రైతాంగాన్ని ఆదుకొనుటలో ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పంటలకు ఎంఎస్పి ప్రకటనే తప్ప.. రైతాంగం పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. అమ్మ బోతే అడవి.. కొనబోతే కొరివి అన్నట్లుగా రైతాంగ పరిస్థితి ఉన్నది. రైతాన్ని ఆదుకునే చర్యలు లేవనే చెప్పాలి. 12 ఏళ్ల ఎన్డీఏ పాలనలో దేశంలో ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, నిరుద్యోగం తదితర సమస్యలతో ఆత్మహత్యలు పెరిగినట్టు నివేదిక తెలుపుతుంది. ఆత్మహత్య చేసుకున్న అన్నదాతలు 1.42 లక్షల మంది.. ఒక్క 2024లోనే 1,70,746 మంది ఆత్మహత్యకు పాల్పడినట్టు నివేదిక వెల్లడించింది.

**ప్రగతి సూచికలో వెనుకబడి ఉన్నాం..**

ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యము, పారిశ్రామిక తదితర రంగాల్లో . .ద్రవ్యోల్బణము, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ, లింగ సమానత్వం, పత్రికా స్వేచ్ఛ, పాస్ పోర్టు, భద్రత వంటి 50కి పైగా సూచికల్లో మోడీ హయాంలో ఇండియా అట్టడుగు స్థానంలో నిలిచినట్టు ఆయా నివేదికలు ఇచ్చిన ర్యాంకులను బట్టి అర్థమవుతుంది. ఆకలి సూచీలో అతిపేద దేశాల కంటే అడుగుస్థానంలో భారత్ నిలిచింది. ప్రజాస్వామ్య సూచీలో 46వ ర్యాంకుకు దిగజారింది. హెల్త్ అండ్ సర్వైవల్ ఇండెక్స్ లో 2014లో 114 నుండి ప్రస్తుతం 143వ స్థానానికి పడిపోయింది. ఆనందమయ దేశాలలో 116వ ర్యాంకుకు పతనమైంది. పత్రికా స్వేచ్ఛలో 151 వ స్థానం నుంచి 157 వ ర్యాంకు పడిపోయింది.

**మోదీ మాటలకు, చేతలకు పట్టింపు ఏదీ**

దేశాన్ని మరిన్ని కష్టాల గోతిలోకి నెట్టారు. కానీ ఇంకా సమయం అడుగుతూనే ఉన్నారు. తీరా ఇప్పుడు దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు వికసిత్ భారత్ 2047 వరకు గడువు కోరుతున్నారు. ప్రధాని మోదీ స్వభావాన్ని 12ఏండ్లుగా గమనిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. విజయం ఆయన ఖాతాలో, వైఫల్యాలను ఇతరుల ఖాతాలో జమ చేయడం ఆయన థియరీ. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా, యుద్ధంతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు మోదీ సరియైన చర్యలు తీసుకోలేదు.

దేశంలో ఏదైనా సంక్షోభం వస్తే చేతులెత్తేయడం, నీటుగా దేశభక్తి ముసుగు తొడిగి మోదీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఆత్మ నిర్బర్ భారత్, గతి శక్తి, స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ వంటి నినాదాలతో దేశం పరుగులు పెడుతున్నదని లేని గొప్పలు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. సమస్యలు, సంక్షోభాలు ఏర్పడితే చాకచక్యంగా వ్యవహరించి తప్పించుకుంటారు.

మోదీ పాలన లో కార్పొరేట్ దిగ్గజాలు భారీ సంపదను పోగేసుకుంటున్నాయి. కానీ దేశంలో సుమారు 80 శాతం ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఏమీ మెరుగుపడలేదని పలు గణాంకా లు స్పష్టం చేస్తున్నాయి. బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు ఛిద్రం. అందువల్లనే మన దేశాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ గాలి బుడగలా తయారయింది.

## విద్యా, వైద్య రంగాలు మౌలికం

ఏ దేశ పురోగతి అయినా ఆ దేశ పౌరులకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాల నాణ్యతపైనే ఆధారపడి ఉంటుంది. రాజ్యాం గం నిర్దేశించిన సంక్షేమ రాజ్య స్థాపనలో ఈ రెండు రంగాలు అత్యంత ప్రాధాన్యమైన సేవా రంగాలుగా గుర్తించబడ్డాయి. అయితే, మారుతున్న సామాజిక, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో నేడు విద్యా రంగం తీవ్ర వ్యాపారీకరణ వైపు అడుగులు వేస్తోంది. మరోవైపు కార్పొరేట్ వైద్యం సామాన్యుడికి అందుబాటులోలేని భారంగా మారుతోంది. ఈ తరుణంలో, సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ విద్యా,వైద్య రంగాలలో రావలసిన మౌలిక మార్పులపై ఒక నిష్పాక్షిక విశ్లేషణ చూద్దాం.

**1. విద్యలో వ్యాపారీకరణ: సేవ నుండి వ్యాపారంగా మారుతున్న తీరు**

భారతీయ సంస్కృతిలో విద్యను ఒక పవిత్రమైన సేవగా, జ్ఞాన దానంగా భావిస్తారు. కానీ, గత కొన్ని దశాబ్దాలుగా విద్యా రంగంలో వచ్చిన ప్రైవేటీకరణ క్రమంగా వ్యాపారీకరణకు దారితీసిందనేది నిపుణుల వాదన. నేడు నాణ్యమైన చదువు అనేది ఒక హక్కుగా కాకుండా, కొనుగోలు చేయగల శక్తి ఉన్నవారికి మాత్రమే దక్కే ఒక వస్తువుగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రైవేట్ విద్యాసంస్థలు మౌలిక వసతులు, ఆధునిక సాంకేతికతను అందిస్తున్నప్పటికీ, వాటి ఫీజుల భారం మధ్యతరగతి, పేద కుటుంబాలకు పెద్ద సవాలుగా మారింది. ర్యాంకులు, మార్కుల వేటలో విద్యార్థుల మానసిక వికాసం, నైతిక విలువలు వెనుకబడిపోతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే నియంత్రణ చట్టాలు సరిపోవు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పొరేట్ స్థాయికి దీటుగా బలోపేతం చేయాలి. పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, నాణ్యమైన ఉపాధ్యాయ శిక్షణ, మౌలిక వసతులను పెంపొందించినప్పుడే సామాన్యుడికి ఉచిత, నాణ్యమైన విద్య అందుతుంది.

**2. ప్రభుత్వ వైద్యం – నమ్మకం:**

ఆరోగ్యకరమైన సమాజమే దేశానికి అసలైన సంపద. ప్రస్తుత తరుణంలో వైద్య రంగం ఎంతో సాంకేతిక పురోగతిని సాధించినప్పటికీ, పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఒక పెద్ద ఆర్థిక భారంగా మారింది. చిన్నపాటి అనారోగ్యానికి కూడా ప్రైవేట్ ఆసుపత్రులలో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి రావడం, కొన్ని సందర్భాల్లో కుటుంబాలు అప్పులపాలు కావడం మనం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో, సామాన్యుడికి ఏకైక ఆశ్రయం ప్రభుత్వ వైద్య రంగమే. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరగడం అనేది నేటి అత్యవసర అవసరం.ఇందు కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) నుండి జిల్లా స్థాయి ఆసుపత్రుల వరకు మౌలిక వసతులను ఆధునీకరించాలి. ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల నాణ్యతను నిరంతరం పెంచుతూ, పారదర్శకమైన విధానాలను అమలుచేసినప్పుడే సమతుల్యమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. పౌరుల చైతన్యం, పాలకుల నిబద్ధతతోనే ఈ మార్పులు సాకారమవుతాయి.

కాళేశ్వరం కృష్ణమూర్తి,
9705196097.

## 12 ఏళ్ల రాష్ట్రం... నెరవేరని ఉద్యమ ఆకాంక్షలు

తెలంగాణ అంటే కేవలం భౌగోళికంగా ఏర్పడిన ఒక రాష్ట్రం కాదు. అది కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు, లక్షలాది కుటుంబాల పోరాటాలు, 1200 మంది అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న ఆత్మగౌరవ స్వరాష్ట్రం. మన నీళ్లు – మన నిధులు – మన నియామకాలు అనే నినాదంతో సాగిన ఉద్యమ ఫలితంగా ఏర్పడిన తెలంగాణకు జూన్ 2, 2026 నాటికి 12 సంవత్సరాలు పూర్తవుతున్నా, ఉద్యమ ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరాయా అనే ప్రశ్న ప్రజల మనసుల్లో మిగిలే ఉంది. రాష్ట్ర సరిహద్దులు మారాయి. జిల్లాల పునర్విభజన జరిగింది. పాలకులు మారా రు. కానీ సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో ఆశించిన స్థాయిలో మార్పు వచ్చిందా అనే ఆత్మపరిశీలన అవసరం. తెలంగాణ తెచ్చింది మేమే, ఇచ్చింది మేమే అని రాజకీయ పార్టీలు చెప్పుకున్నా, ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చి న హామీలు, యువతకు చూపిన భవిష్యత్తు, నిరుద్యోగులకు పెట్టి న ఆశలు ఎంతవరకు నిజమయ్యాయని సమాజం ప్రశ్నిస్తోంది.

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది నిరుద్యోగ యువతకు ఇంకా స్పష్టమైన భరోసా కనిపించడం లేదు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు అలాగే ఉండిపోవడం, నోటిఫికేషన్ల విడుదలలో ఆలస్యం, పరీక్షల నిర్వహణలో లోపాలు, పేపర్ లీకేజీలు యువతలో తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. రాష్ట్రం వచ్చాక విద్యా రంగం అభివృద్ధి చెందుతుంది అనుకున్నారు కానీ వచ్చిన స్వరాష్ట్రంలో కూడ విద్యకు అధిక ప్రాధాన్యత లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు, సంక్షేమ హాస్టళ్లు నిధుల కొరత, మౌలిక వసతుల సమస్యలు, అధ్యాపక పోస్టుల ఖాళీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏ ప్రభు త్వం వచ్చిన విద్యలో సంస్కరణలు తీసుకువస్తామని చెపుతూ కాలం వెళ్లదీస్తూ ప్రచారానికే పరిమితం అవుతున్నారు. ఉద్యమానికి కేంద్రాలుగా నిలిచిన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయనే భావన విద్యార్థుల్లో పెరుగుతోంది.

ఖాళీ పోస్టులు, నిధుల కొరత, మౌలిక సదుపాయాల లేమితో ఉన్నత విద్యా వ్యవస్థ బలహీనపడుతోంది. తెలంగాణ వస్తే సామాజిక న్యాయం, ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యం, రైతు సంక్షేమం, ఉద్యోగ అవకాశాలు ప్రతి ఇంటికీ చేరుతాయని ప్రజలు ఆశించారు. ఆ ఆశలు నెరవేరినప్పుడే ఉద్యమానికి నిజమైన అర్థం వస్తుంది. తెలంగాణ 12 ఏళ్ల వేడుకలు కేవలం సంబరాలకు మాత్రమే పరిమితం కాకుండా ఉద్యమ ఆశయాలు ఎంతవరకు అమలయ్యాయో సమాజం ఆలోచించాల్సిన సమయం ఇది అమరవీరుల త్యాగాలకు నిజమైన నివాళి అంటే ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే పాలన, యువతకు అవకాశాలు, రైతుకు భరోసా, విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికి సమాన అభివృద్ధి అందే తెలంగాణ నిర్మాణం. తమది 'ప్రజాపాలన' అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా మరింత వేగంగా ముందు కు సాగాలని ప్రతి తెలంగాణవాది కోరుకుంటున్నాడు.

కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, 7569548477

# ముఖ్యమంత్రి చొరవతోనే ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం

జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చొరవతోనే జలమండలి ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం అవుతాయని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి పేర్కొన్నారు. జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా టిజెఇయు అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి శనివారం సంజీవ రెడ్డినగర్ జలమండలి డివిజన్ కార్యాలయంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి, జూన్ 6 న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వందలాదిమందితో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల హక్కులను గౌరవిస్తూ తెలంగాణ జలమండలిలో గుర్తింపు సంఘం ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు. ఐఎన్‌టియుసి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు జలమండలి యాజమాన్యంతో చర్చించి అనేక సమస్యలు తన నేతృత్వంలోని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఈ సభలో ఐఎన్‌టియుసి జాతీయ ఉపాధ్యక్షులు జి. సత్యజిత్ రెడ్డి, టిజెఇయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవన్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ ఇ.చంద్రశేఖర్, మేవా అధ్యక్షులు సయ్యద్ అక్తర్ అలీ, ఎఐటియుసి నాయకులు రమేష్, యూనియన్ నాయకులు బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమం కోసం జలమండలి ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకే మన ఓటు

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజ్ బోర్డు ఎన్నికల్లో కార్మిక వర్గానికి అనుకూలంగా ఉంటున్నటువంటి ఎఐటియుసి మద్దతుతో పోటీ చేస్తున్న ఐఎన్‌టియుసి నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డి త్రిశూలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. జూన్ 6వ తేదీన జరిగే జలమండలి ఎన్నికలలో భాగంగా శనివారం రెడ్ హిల్స్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్నటువంటి సంఘం కార్మికుల సంక్షేమాన్ని మరిచి, వ్యక్తిగత వ్యాపారాల కోసం పనిచేయడం ద్వారా జలమండలి కార్మికులు అనేక నష్టాలకు గురికావడం జరిగిందన్నారు. హైదరాబాద్ నగరం విస్తీర్ణం చెంది మూడు కార్పొరేషన్లుగా ఏర్పడినందువలన కార్మికుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మొగుళ్ల రాజిరెడ్డి ఈ అంశంపై ఆలోచించి రాబోయే రోజుల్లో కార్మికుల కోసం నిలబడాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎఐటియుసి అనేక రంగాలలో బలంగా ఉన్నప్పటికీ కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా ఐఎన్‌టియుసికి మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు, జలమండలి వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, ఐఎన్‌టిసి నాయకులు ఆదిల్ షరీఫ్, ఎఐటియుసి అనుబంధ వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

# మార్కెట్‌కు తీసుకువచ్చే ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయండి

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** అన్నదాతలు మార్కెట్‌కు తీసుకువచ్చే ధాన్యంను పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్ సులోచన అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. మార్కెట్ పాలకవర్గం సభ్యులు నిత్యం ధాన్యం విక్రయాలపై దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధిపై కొంతమంది బురదజల్లేందుకు యత్నిస్తుంటారని, అలాంటి వారిని పట్టించుకోవద్దని పాలకవర్గం సభ్యులకు సూచించారు. మార్కెట్‌కు వచ్చే అన్నదాతలకు మౌళిక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఇబ్బందులు లేకుండా వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేశారు. మార్కెట్ అధికారులు, పాలకవర్గం సభ్యులు, కమీషన్ ఏజెంట్లు సమన్వయంతో ప్రతి గింజను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్లు కరుణాకర్, భరత్‌లోహూటి, రవి నాయక్, పి.నర్సింహులు, సందీప్‌కుమార్, వెంకట నర్సింహ్మారెడ్డి, తాగిశెట్టి నవీన్, కమీషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో కార్యదర్శి సేవలు వెలకట్టలేనివి : కంటే శ్రీశైలం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శి సేవలు వెలకట్టలేనివని బిఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంటే శ్రీశైలం అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిన్న చిల్కమర్రి గ్రామంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి విజయలని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంటే శ్రీశైలం మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి పాలవర్గం లేని సమయంలో సైతం ఎంతో సమర్థవంతంగా ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. ఏడు సంవత్సరాల పాటు పంచాయతీలో ఉంటూ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల్లో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రెండేళ్ల పాటు సర్పంచులు లేకున్నా గ్రామాన్ని అన్ని రంగాల్లో, అభివృద్ధి పథంలో నడిపించి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, నర్సింహ్మారెడ్డి, జర్నలిస్టు నరేష్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, రవి, నాయకులు శ్రీనివాస్, అడివయ్య, భ్యాగరి బీమయ్య, సూరారం శ్రీశైలం, గంగపురం నర్సింహ్మా, భ్యాగరి బాల్‌రాజ్, మల్లేష్ పాల్గొన్నారు.



# ఫీజులివ్వకుంటే తగిన గుణపాఠం చెబుదాం

**● బిసిలకు రూ.2,500 కోట్ల ప్రత్యేక నిధులివ్వాలి ● ప్రభుత్వానికి అఖిలపక్ష సమావేశం డిమాండ్**



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** బిసిల అభివృద్ధి, సంక్షేమం కొరకు బడ్జెట్‌లో రూ.2500 కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని అఖిలపక్ష నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేసి, పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ తరహాలో బిసి సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి నిధుల వినియోగానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల విద్యకు పెండింగ్ ఫీజులివ్వాలని కోరారు. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ బిసిలకు సముచిత ప్రాధాన్యం దక్కడంలేదన్నారు. బిసిల ఆర్థిక, విద్య, రాజకీయ సాధికారతకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. కాంగ్రెస్ ఒబిసి సెల్ జాతీయ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ బిసి యువతకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక విధానాలు రూపొందించాలని కోరారు. బిజెపి బిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ బిసి కార్పొరేషన్లను బలోపేతం చేసి యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ బిసి వృత్తిదారులకు వడ్డీ లేని రుణాలు, ఆధునిక పరికరాలు అందజేయాలని కోరారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ బిసిల హక్కులు, అవకాశాలు, అభివృద్ధికి ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వంశీ యాదవ్ నియమితులయ్యారు. సమావేశంలో జాతీయ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ విజిఆర్ నారగోని, వివిధ కుల సంఘాల నేతలు మేకల రాములు యాదవ్, శ్రీనివాస్, లాల్ కృష్ణ, గౌరిగే మల్లేశ్, నీలం వెంకటేశ్, అంజి, అనంతయ్య, పగిళ్ల సతీశ్, జక్కని సంజీవ్, భేరి రామచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మగ్ధూంభవన్‌లో.. డా||ఏటుకూరి ప్రసాద్ సంస్మరణ సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ సాహితీవేత్త, అరసం నాయకులు, నవచేతన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కు సుదీర్ఘ కాలం సంపాదకులుగా పనిచేసిన డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ సంస్మరణ సభ నేడు(ఆదివారం) ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని మగ్ధూంభవన్‌లో జరగనుంది. ఈనెల 23న వారి స్వగృహంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం, నవచేతన పబ్లిషింగ్ హౌస్, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంస్కరణ సభ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి అరసం ప్రముఖ నేతలతో పాటు, ప్రముఖ సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, ప్రజానాట్యమండలి పూర్వ అధ్యక్షులు కందిమల్ల ప్రతాపరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, అరసం అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, ఆర్వి రామారావు, వేల్పుల నారాయణ, ఆచార్య ఎస్.వి. సత్యనారాయణతో పాటు నవచేతన పబ్లిషింగ్ జనరల్ మేనేజర్ మధుకర్, విజ్ఞాన సమితి కార్యదర్శి మోహన్ రెడ్డి, పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ నారాయణ రెడ్డి తదితరులు హాజరవుతారు.

# మెట్రోకు ఎల్ అండ్ టి సేవలు

● మరో ఏడాది పాటు సహకారం తప్పదు
● 110 మంది నిపుణులు విధుల నిర్వహణ ● కియోలిస్, ఇతర సంస్థల ఒప్పందం పొడిగింపు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** ప్రజారవాణాలో కీలక భూమిక పోషిస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వం చేతికి వచ్చినప్పటికీ.. ఎల్ అండ్ టీతో పాటు ఇతర ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల సహకారం తప్పనిసరిగా మారింది. పిపిపి విధానంలో నిర్మించిన మెట్రోరైల్ ప్రాజెక్ట్ నుంచి ఎల్ అండ్ టీ తప్పుకున్నా ఏడాది పాటు ఆ సంస్థ లేకుంటే మెట్రో పరుగులు పెట్టే పరిస్థితి లేదు. అందుకే ఏడాది పాటు సంబంధిత సంస్థల నుంచి సేవలు పొందాల్సి వస్తుంది. ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన దాదాపు 110 మంది నిపుణులు మెట్రో రైల్‌లో సేవలు అందిస్తున్నారు. వారంతా ఏకంగా ఏడాది పాటు హైదరాబాద్ మెట్రోలో పనిచేయాల్సిందే. ఇక మెట్రో రైళ్ల రోజు వారి ఆపరేషన్లు, ట్రైన్ నడపటం, స్టేషన్ల నిర్వహణ, కంట్రోల్ రూం కార్యకలాపాలు, టికెటింగ్ తదితరాలను కియోలిస్ గ్రూపు బాధ్యతలు నిర్వహిస్తుండగా.. కోచ్‌లు, సిగ్నలింగ్ టెక్నాలజీ వంటి సేవల్లో ఆల్‌టోం, టాలెస్ సంస్థలు సహకరిస్తున్నాయి. స్టేషన్‌లలో వాణిజ్య కార్యకలాపాలను వివిధ ప్రైవేట్ కంపెనీలు, ఎంఎన్‌సీ కంపెనీలు నిర్వహిస్తున్నాయి. రోజుకు 5.30 లక్షల ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరుస్తున్న మెట్రో రైల్ నిర్వహణలో ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగాలంటే ఎంఎన్‌సీ, ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యం తప్పనిసరిగా మారింది. స్టేషన్ల నిర్వహణ, మెయిన్‌టెనెన్స్ బాధ్యతలు చేపట్టిన కియోలిస్ సంస్థ ఒప్పందం ఈ ఏడాది నవంబర్‌లో ముగియనుండగా.. మరో ఏడాది పాటు పొడిగించనున్నట్లు సమాచారం. రైళ్ల మరమ్మత్తులు, ఇతరత్రా కీలక ప్రక్రియల్లో ఎల్ అండ్ టి నిపుణుల సేవలు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థకు ఏడాది పాటు పనిచేసేలా ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిసింది. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం చేతికి మెట్రో రైల్ చిక్కినా.. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

# రైల్వే అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాలకు టి-సాట్ డిజిటల్ కంటెంట్

**జూన్1 నుండి సెప్టెంబర్ వరకు ప్రసారాలు : సిఇఒ వేణుగోపాల్ రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు త్వరలో భర్తీ చేసే అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు టిసాట్ డిజిటల్ కంటెంట్ అందించనుందని సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు 11,127 అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిందని, వాటిలో సికింద్రాబాద్, ఈస్ట్ కోస్టు రైల్వే డివిజన్ పరిధిలో 1,420 పోస్టులు భర్తీ చేయనున్నట్టు రైల్వే శాఖ స్పష్టం చేసిందన్నారు. మన రాష్ట్ర యువతకు ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా పరీక్షకు సంబంధించిన కంటెంట్ ను డిజిటల్ లెసెన్స్ ద్వార అందించాలని నిర్ణయించామన్నారు. మాథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ అండ్ జనరల్ సైన్స్ కు సంబంధించిన సబ్జెక్టులలో సుమారు 300 గంటల కంటెంట్ రోజుకు రెండు గంటల చొప్పున ప్రసారం చేయాలని నిర్ణయించామని తెలిపారు. టిసాట్ విద్య ఛానల్ లో ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు అవే పాఠ్యాంశాలు నిపుణ ఛానల్ లో రాత్రి 9 గంటల నుండి 11 గంటల వరకు రెండు గంటల పాటు ప్రసారమౌతాయని వేణుగోపాల్ రెడ్డి వివరించారు. పదవ తరగతి, ఐటిఐ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుండి 30 వయస్సు కలిగి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు డిజిటల్ కంటెంట్ ఉపయోగపడుతుందన్నారు. రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగాలకు అక్టోబర్ లో నిర్వహించే పరీక్ష కోసం సెప్టెంబర్ వరకు డిజిటల్ లెసెన్స్ ప్రసారమౌతాయన్నారు.

# హోప్ ఫౌండేషన్ అన్నదానం

**ప్రజాపక్షం/మియాపూర్:** హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు అభినందనీయం మని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పథంతో అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నారని వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 186వ వారం అన్న ప్రసాదం హోప్ చైర్మన్ కొండ విజయ కుమార్ ప్రజలకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేయడం చేయాలా అరుదుగా జరుగుతుంది అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొని వారికి ఏ లోటు లేకుండా చూసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఏకోటౌన్ చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే వినతులు

- టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌కు, మీనాక్షీ నటరాజన్‌కు వివరించిన ఎమ్మెల్యే
- ప్రజల మనోభావాలకు విరుద్ధంగా చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దు: వీరపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజల మనోభావాలకు విదద్ధంగా సిద్దాపూర్‌లో ఏకోటౌన్ చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయవద్దని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వ పెద్దలను కోరారు. శనివారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు సిద్దాపూర్ వ్యవహారంపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సిద్దాపూర్ చెత్త డంపింగ్ వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు వివరించారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు దృష్టికి సైతం తీసుకువెళ్ళినట్లు పేర్కొన్నారు. సిద్దాపూర్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలందరి అభిప్రాయాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్ళి వివరించానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాద్‌నగర్ నియోజకవర్గానికి తగిన న్యాయం చేస్తారని వివరించారు. చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకునే విధంగా ప్రభుత్వ పెద్దలపై తీవ్రంగా ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలపై మీనాక్షీ నటరాజన్ స్పందిస్తూ ఇప్పటికే సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు విషయం తన దృష్టికి తీసుకువచ్చిందని, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయాలను తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, ఏకోటౌన్ ఏర్పాటు కాకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జిహెచ్‌ఎంసికి సిద్దాపూర్ భూములు కేటాయించవద్దని నిర్మల జగ్గారెడ్డికి వినతి**

కొత్తూరు మండల పరిదిలోని సిద్దాపూర్ గ్రామంలో సర్వేనంబర్ 252,278,361గల సర్వేనంబర్లలో మొత్తం 330.34ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇక్కడ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసేందుకు అప్పట్లో టిజిఐఐసికి అప్పగించినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం టిజిఐఐసి చైర్ పర్సన్ టి.నిర్మల జగ్గారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఏకోటౌన్ ప్రాజెక్టుకు బదులుగా ఇండస్ట్రియల్ పార్కును ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఎట్టి పరిస్థితుల్లో జిహెచ్‌ఎంసికి కేటాయించరాదని, టిజిఐఐసి మొదటి ప్రతిపాదించిన విధంగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం భూమి కేటాయించాలని ప్రజలు అభ్యర్థిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.



# నాలా పనులకు అడ్డంగా ఉన్న 106 నిర్మాణాలపై చర్యలు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలాల వెంట జరిగిన భూఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. దేవేంద్ర నగర్, నల్ల చెరువు ఉప్పల్ ప్రాంతాల్లో శనివారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. దేవేంద్ర నగర్ నాలా వెంట జరిగిన ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలని టౌన్ ప్లానింగ్ ఏసిపిని ఆదేశించారు. నాలా పరిధిలో దోమల లార్వాను గుర్తించిన కమిషనర్ ఎంటమలాజి విభాగం ఆధ్వర్యంలో యాంటీ లార్వల్ ఆపరేషన్‌లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అనంతరం చర్చ్ కాలనీ రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, రాంకీ బృందం చెత్తను సకాలంలో తరలించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వ్యర్థాలు లేకుండా నిరంతరం చెత్తను సేకరించాలని సిబ్బందిని హెచ్చరించారు. ఉప్పల్ నల్లచెరువు వద్ద కొనసాగుతున్న ఎస్ఎన్‌డిపి నాలా అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్, పనులకు అడ్డంగా ఉన్న 106 నిర్మాణాలను గుర్తించి, వారికి తక్షణమే నోటీసులు జారీ చేసి, టిడిఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆక్రమణలను తొలగించి, ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేస్తాం

- ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి
- లేదంటే ఉద్యమాలకు శ్రీకారం
- నూతన జెఎసి కమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/కొత్తూరు:** చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, నాన్చుడు దోరణి అవలంభిస్తే ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని నేతలు హెచ్చరించారు. శనివారం కొత్తూరు మండలం జెపి దర్గాలో రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల నాయకులతో కలిసి అఖిలపక్ష జెఏసిని ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేశారు. గావ్ గావ్ బచావో.. డంపింగ్ యార్డ్ హటావో అనే నినాదంతో కొత్తూరు పరిసర గ్రామాల్లో ఉద్యమం తీవ్రరూపం దాల్చిందని, ప్రతిపాదిత చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు భారీ ఎత్తున అఖిల పక్ష జెఎసిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పచ్చని పల్లెసీమలను సర్వనాశనం చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని, దీన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సిద్దాపూర్ గ్రామంలో ఉన్న సుమారు 330ఎకరాల ప్రభుత్వ భూమిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు చేస్తామని టిజిఐఐసికి భూమిని అప్పగించారని, అందులో నుండి జిహెచ్ఎంసికి సుమారు 80ఎకరాలు కేటాయించినట్లు తెలుస్తుందని, దాంతో పెద్ద ఎత్తున చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుందని వివరించారు. ప్రశాంత వాతావరణంలో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రజలు అనేక రకాల వ్యాధులు వచ్చి మృత్యువాత పడే అస్కారం ఉంటుందని తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి అక్కడే చెత్త డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని, హైద్రాబాద్ చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. జిహెచ్‌ఎంసిని నాలుగు డివిజన్లుగా ఎలా ఏర్పాటు చేశారో అదే తరహాలో డివిజన్ల వారిగా చెత్త డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దాపూర్‌లో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే వ్యవసాయ భూములు దెబ్బతినడమే కాకుండా ప్రజలు అనేక రోగాల భారీన పడి మరణించే అస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే గ్రామస్తులందరం అమరణ దీక్ష చేస్తామని హెచ్చరించారు. లగచర్ల తరహాలో ఉద్యమాలు, పోరాటాలు చేసేందుకు సిద్దాపూర్‌తో పాటు అనేక గ్రామాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎంతో పవిత్రమై దర్గా ఉందని, 1500మందికి పైగా పిల్లలు చదువుతున్న ట్రైబల్ స్కూల్, గురుకుల పాఠశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. అధికారులు, ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తున్న ఈ చెత్త డంపింగ్ యార్డు వల్ల పచ్చని పంట పొలాలు, సారవంతమైన భూములు పూర్తిగా దెబ్బతింటాయని వివరించారు. ఒక పార్టీకో, వర్గానికి సంబంధించిన విషయం కాదని, మన ఊరి భవిష్యత్, ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్య అని పేర్కొన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పార్టీ జెండాను, కండువాలను పక్కన పెట్టి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగరానికి అన్నం పెట్టే ఈ పచ్చని పోలాలపై చెత్త కుప్పలు, కెమికల్స్, ప్లాస్టిక్ వ్యర్థాల వేయడం వల్ల భూగర్భ జలాలు విషతుల్యమై గ్రామాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి ఎంతటి త్యాగానికైన తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పష్టత ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

**అఖిలపక్ష జెఎసి చైర్మన్‌గా అంబటి ప్రభాకర్**

సిద్దాపూర్ భూవ్యవహారంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అఖిలపక్ష జెఎసి ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా అంబటి ప్రభాకర్, ట్రేజరర్‌గా ఎల్లారం శేఖర్‌రెడ్డి, కన్వీనర్లుగా గన్నేజు శ్రీధర్‌చారి, సయ్యద్ సిరాజ్, బీస సాయి బాబా, కో కన్వీనర్లుగా కోళ్ల రవినాయక్, రాంచందర్‌నాయక్, చెన్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పెంటపల్లి నర్సింహ్మా, ఎస్‌కె ఖాజా, జనరల్ సెక్రటరీలుగా పల్లావత్ శంకర్ నాయక్, పెంటపల్లి రవి, నేనావత్ గోపాల్‌నాయక్, కుమ్మరిగూడెం శ్రీశైలం, మామిడి అరవింద్‌రెడ్డి, ఎమ్మి ప్రవీణ్, దేసాల రమేష్, పత్లావత్ రాజేష్ నాయక్, జైపాల్ నాయక్‌చ బాలాజీ, హరికృష్ణచారి, లీగల్ అడ్వైజర్ ఎస్‌కె నాసర్‌పాషాలను ఎన్నుకున్నారు.



## కామ్రేడ్ వివిఎస్ మూర్తి అకాల మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడువిఎస్ బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రముఖ కార్మిక సంఘ నేత, ఏఐటి యుసి సీనియర్ నాయకుడు, కార్మిక వర్గ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ వివిఎస్ మూర్తి అకాల మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ అన్నారు. శని వారం ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలోనే కాకుండా పదవీ విరమణ అనంతరం సైతం కార్మిక ఉద్యమాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ కార్మికుల మేలు కోసం పాటు పడ్డారన్నారు. వేలాది కార్మికులకు ఆయన మార్గదర్శిగా నిలి చారన్నారు. కార్మిక బాట పత్రిక ద్వారా కార్మిక చైతన్యాన్ని పెంపొందించ టంలో ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, సిపిఐ నేతలు నారా నర్సింహ, నర్సింహరావు, మల్కయ్య, మూర్తి, సుదర్శన్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## తాపీ మేస్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** తాపీ మేస్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సెంట్రింగ్ కాంట్రాక్టు మేస్త్రీలు వెంటనే క్షమాపణలు చెప్పని పక్షంలో వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని భవన నిర్మాణ కార్మికుల సంఘం హెచ్చరిం చింది. జవహర్‌నగర్‌లో శనివారం 'తాపీ మేస్త్రీకి హటావో..సెంట్రింగ్ కాంట్రాక్టర్‌కు బచావో' అన్న నినాదంపై జరిగిన సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్, అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్‌లు మాట్లాడారు. ఇటీవల ఇళ్ల నిర్మా ణానికి సంబంధించి వ్యయ విషయంలో తలెత్తిన మనస్పర్థల కారణంగా కాంట్రాక్టు కార్మికులు తాపీ మేస్త్రీలను దూషించటం తగదన్నారు. భవన నిర్మాణ పనుల్లో ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాల్సి ఉంటుందన్న విషయా న్ని మరువరాదన్నారు. ఈ సమావేశంలో ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు వై మల్లేష్, రమణారెడ్డి, కోట్ల చెన్నారెడ్డి, మరాఠిబాబు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులను కష్టాలపాలు చేస్తున్న ప్రభుత్వం

### మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభు త్వానికి రైతుల గోస తగులుతుందని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఘట్‌కేసర్ సర్కిల్ 7వ డివిజన్ పరిధిలోని ఎదులాబాద్ గ్రామంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి,రైతులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసన తెలియజేశారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసేంతవరకు అండగా ఉంటానని వర్షాలతో మొలకెత్తిన వడ్లు వెంటనే తరలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత 45 రోజులుగా రైతు లు కొనుగోలు కేంద్రాల వద్దే వడ్లను ఎండబోసి అక్కడే భోజనం చేసి అక్కడే నిద్రిస్తూ హరిగోశ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఎండ ల్లో రైతులు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మరోవైపు అకాల వర్షాలతో వడ్లు తడిసి మొలకెతడం తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్ట ర్ వెంటనే కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని అత్యవసరంగా తరలించే చర్యలు చేపట్టాలని ఏనుగు సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయ కులు, రైతులు పాల్గొన్నారు.




## ఘనంగా వీడ్కోలు సమావేశం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్ఐగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుని ఎస్ఐ నరేందర్‌రెడ్డి ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశనికి జిల్లా ఎస్పి స్నేహమెహ్రా హజరై సత్కరించి జ్ఞపికను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ కానిస్టేబుల్ నుండి ఎస్ఐ స్థాయికి ఎదిగి ఎకంగా 42సంవత్సరాలు పాటు సుదీర్ఘ మైన,నిష్కళంకమైన సేవలు అందించిన నరేందర్‌రెడ్డిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. 42ఏళ్లు పూర్తిచేయడం అంటే సామాన్యమైన విషయం కాదని అది ఎంతో ఓర్పు ,క్రమశిక్షణ ,వృతిపట్ల నిబద్ధత ఉంటేనే సాధ్యమ వుతుందని కొనియడారు. తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ప్రశాతంగా ,అయురారోగ్యలతో సంతోషంగా గడపాలని ఎస్పి ఈ సంద ర్భంగా ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో డిఎస్పి జానయ్య, శ్రీనివాస్, అశోక్ , కార్యాలయ సిబ్బంది, కుటంబసభ్యులు పాల్గోన్నారు.

### జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో

# 'ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడలు, ఫిట్ నె స్ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వా మ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడి యంలో 'ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యకర జీవన శైలి పై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్ర తాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకాను న్నారు. శాట్స్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరె



క్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి లోక్‌భవన్‌లో గవ ర్నర్‌ను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. గవర్నర్ ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమం విజయవం తం కావాలని ఆకాంక్షించారు. సైక్లింగ్ ర్యాలీ ఏర్పాట్లపై ఎల్‌బీ స్టేడియం లోని శాట్స్ కార్యాలయంలో వివిధ సైక్లింగ్ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్ల ను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో సుమా రు 2,000మంది సైక్లిస్టులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పాల్గొనే వారందరికీ తెలం గాణ క్రీడా ప్రాధికార సంస్థ తరఫున పత కాలను, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు నమోదు, ఇతర వివరాల కోసం గచ్చిబౌలి స్టేడి యం అడ్మి నిస్ట్రేటర్ కె.మధును 9000033 100 నంబ ర్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జీతాలివ్వాలి

### మైనార్టీ గురుకుల నాన్‌టీచింగ్ ధర్నాలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకులాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి పాత పద్ధతి తరహాలోనే ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జీతాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ కల్పిం చాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాంపల్లిలోని మైనార్టీ గురుకుల కార్యాలయం వద్ద వందలాది మంది మైనార్టీ గురుకుల బోధనే తర సిబ్బంది ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లా డారు. గత 2016 సంవత్సరం నుంచి మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీల్లో 4,500 మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తు న్నారన్నారు. ఇదే సిబ్బందికి ఇతర గురుకు



లాల్లో ఔట్ సోర్సింగ్ విధానం జీతాలు, ఇపి ఎఫ్, ఇఎస్ఐ అమలు చేశారన్నారు. కానీ, 2024 నుంచి వీరికి ఇఎస్ఐ, ఇపిఎఫ్ తొల గించి, రోజువారీ కూలీలుగా మార్చడం అన్యా యమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మైనార్టీ గురుకుల బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్క రించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశా రు. ముందుగా, మైనార్టీ గురుకుల కార్యదర్శి షఫీవు ల్లాకు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో బిసి యువ జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, తెలంగాణ మైనార్టీ గురుకుల నాన్ టీచింగ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మోహసిన్ షరీఫ్ తదితర నేతలు పాల్గొన్నారు.

## అమ్మ మాట... అంగన్‌వాడీ బాట

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అంగన్ వాడి కేంద్రాల ద్వారా బాలల నమోదు పెంపు, నాణ్యమైన ప్రీ స్కూల్ విద్య అందిస్తూ చిన్నారులు విద్య పొందేలా కృషి చేస్తున్నా మని జిల్లా సంక్షేమ శాఖాధికారి శారద తెలి పారు. ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నాగారం సెక్టార్ లోని నర్సంపల్లిలో శనివారం అమ్మ మాట అంగన్‌వాడి బాట పేరిట ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్య పూర్తి





చేసి ప్రథమ తరగతిలో చేరుతున్న 4 నుండి ఆరేళ్ల చిన్నారులకు విద్యారంభ్ సర్టిఫికెట్లను ఆమె అందచేసారు. అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భి ణీ లు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రత, మానసిక శారీ రక అభివృద్ధి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

## ఆరోగ్యం విషయంలో పూర్తి శ్రద్ధ వహించాలి

### మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పలు సవాళ్లు, ఒత్తి ళ్ల మధ్య బాధ్యతగా విధులు నిర్వహించిన పోలీసు శాఖ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం తమ ఆరోగ్య విషయంలో పూర్తి శ్రద్ధ వహించాలని మల్కాజిగిరి పోలీస్ కమి షనర్ బి.సుమతి సూచించారు. ప్రతి ఒక్క ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పనిసరన్నా రు. కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ చేస్తు న్న కరుణసాగర్ (ఎసిపి క్రైం), బాలరాజ్ (ఎ



స్ఐ కంట్రోల్ రూం), టి.ప్రభాకర్ (ఎస్ఐ ట్రాఫిక్), మహ్మద్ అలీ (ఏఎస్ఐ) సరూర్‌నగర్ ఉమెన్ పిఎస్), ఎం.అంజిరెడ్డి (ఏఆర్ఎస్ఐ), జి. నరేందర్‌రెడ్డి (ఏఆర్ హెచ్‌సి)లను కమిషనర్ కార్యాలయంలో ఆమె సన్మానం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఇప్పటి వరకు పోలీస్ శాఖలో సమర్థవంతంగా క్రమశిక్షణతో పని చేసిన వారిని అభినందించారు. శాఖాప రంగా పదవీ విరమణ చేసిన వారంద రికి రావల్సిన ప్రయోజనాలన్నిటిని త్వరగా అందే లా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి అడ్మిన్ ఇందిరా, అడిషనల్ డిసిపి శివకుమార్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, రవీం ద్రరెడ్డి, ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భారత తపాల శాఖ కార్యాలయంలోని పొదుపు పథకా లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టా పీస్ జి సంపత్‌రెడ్డి అన్నారు. శనివారం అలి యాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లిలోని పోస్టాఫీస్ కార్యాలయంలో డిసిడిపి డాక్ కమ్యూనిటి కార్యక్రమంపై ప్రజలకు అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో గల పొదుపు ఖాతాలైన సుకన్య సమృద్ధి యోజన, రిక రింగ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్ కమ్ స్కీం, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్ సర్టిఫి కెట్, తపాల జీవిత బీమా, టైమ్ డిపాజిట్స్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం, అటల్ పెన్షన్ యోజన, పిఎం




ఎస్‌బివై, పిఎంజెజెబివై, ఇన్సూరెన్స్ పథకాలు, హెల్త్ ఇన్సూరెన్స్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకింగ్ తది తర సేవలను గ్రామప్రజల కు వివరించారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు దాసరి రవి, దీప, వై దీపిక, సబ్ పోస్ట్ మాస్టర్ సుదీర్, తుర్కపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సీతామహా లక్ష్మి, వివిధ గ్రామాల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి నివాసానికి వెళ్లిన నాయకులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, డిసిసి కార్యదర్శి మామిళ్ల ముత్యాలు యాదవ్, మెట్టు గణేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, మాజీ సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.వేముల మహేష్ గౌడ్, పావనిజం గయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఐటి రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఆయన తీసుకుంటున్న చర్చలు యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆయురారో గ్యాలతో, సుఖసంతోషాలతో నిండి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించా లని ఆకాంక్షిస్తూ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ ప్రాంతంలో వెలసిన అక్రమ నిర్మా ణాలపై రెవెన్యూ అధికారులు శనివారం ఉక్కుపాదం మోపారు. కాప్రా తహసీ ల్దార్ రాజేష్ ఆదేశాలతో రెవెన్యూ ఇనస్పెక్టర్ సత్యనారాయణ జెసిబి వాహనా లతో అంబేద్కర్‌నగర్, వికలాంగుల కాలనీ, బిజెఆర్ నగర్ ప్రాంతాల్లో వెలసిన అక్రమ కట్టడాలన్నిటిని పూర్తిగా కూల్చి వేసారు. జవహర్‌నగర్ ప్రాంతంలో పూర్తిగా ప్రభుత్వ స్థలాలే ఉన్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసే వారిని నమ్మి ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచిం చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు తాము కృషి చేస్తున్నామని, కబ్జాదారు లపై పిడి యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## గంజాయి, మద్యం సీజ్

### తప్పిపోయిన బాలుడును తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అదేశాల మేరకు వికారా బాద్ పోలీసుస్టేషన్ పరిధిలో నేరాలనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా వికారాబాద్ డిఎస్పి అంజయ్య ఆధ్వర్యంలో భారీగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పట్టాణంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి సుమరు 2గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరి గిందన్నారు. ఇందిరానగర్ కాలనీలో కొందరు యువకులు ఇళ్లముందు గుమి గూడి మధ్యం సేవిస్తుండగా గమనించిన పోలీసులు సదరు ఇళ్లని తనిఖీ చేసిఅక్కడ నిల్వ ఉంచిన 55బీర్ బాటిళ్లు, 43 క్యాటర్ లను మధ్యం సీల్‌ను సీజ్ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వికారా బాద్ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అందుల భాగంగానే అనుమానా స్పదంగా తిరుగుతున్న 15సంవత్సరాల మైనర్ బాలుడు పోలీసులు గుర్తించి విచారించగా అతని పేరు శ్రీకాంత్, రూక్మపూర్ పేద్దముల్ మండలంలోని అతని తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది అని తెలిపారు. హైదరాబాద్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్ వద్ద వేచి ఉన్న నార్సింగ్ పోలీసు స్టేషన్‌లో వాహనం దొంగతనం చేసిన కేసులో పాత నేరస్తుడిని పోలీసులుగుర్తించి అదుపులోకి తీసు కున్నారు. పట్టుబడిన వ్యక్తులందరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంట మాని డిఎస్పి అంజయ్య స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వికారాబాద్ సిఐ రఘు కుమార్ , సిబ్బంది పాల్గోన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రై మరీ పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని సింగా యిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిడి వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 145 పాఠశా లల్లో ప్రీప్రైమరీ పాఠశాలలకు ఎంపిక చేయగా అందులో శామీర్‌పేట మండలం సింగాయిపల్లి పాఠశాల ఎంపికైం దన్నారు. సింగాయిపల్లి పాఠశాలను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ ప్రీప్రై మరీ స్కూల్స్ దోహదపడతాయని చెప్పారు. ఈ సంద ర్భంగా జిల్లా విద్యాధికారి విజయాకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలి

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** బాల్య వివాహాలను అరికట్టేం దుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. 99రోజుల ప్రజాపాలన ప్ర గతి ప్రణాళికలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోమ హిళ వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూ లన సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల సదస్సు కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హజరై మాట్లాడుతూ విద్యా ద్వారానే ఉన్నత శిఖరా లను అధికమంచవచ్చని దానికి విద్యార్థులు తమ నైపు ణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు వెళ్లాల న్నారు. విద్యార్థి దశ నుండే సమజంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అసెంబ్లీ ,పార్లమెంటరీ సమావే శల్లో చర్చించే విషయాలపై కూడా అవగాహన కల్పించు కోవాలన్నారు. నూతనంగా వచ్చిన ఏఐ విదానంపై అవ గాహన కల్పించుకుని సాంకేతికతను వినియోగించుకో వాలన్నారు. విద్యార్థులు ,భావిష్యత్తులో తమ లక్ష్యాన్ని ఎంచుకోవడంలోఉన్నత అధికారుల సలహాలు తీసుకో వాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో స్నేహ సంఘాల్లో సభ్యులుగా చేరాలని కలెక్టర్



సూచించారు. ఇప్పటికి జిల్లాలో 4500 స్నేహ సభ్యు లుగా నమోదు చేసుకున్నారని వాటిన బలోపేతం చేయ దానికి తమ సహకరం కచ్చితంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డీఓ శ్రీనివాస్ ,అద నపు డీఆర్‌డిఓ నర్సింలు ,పంచాయతీరాజ్ ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్‌కుమార్ ,వయోజన విద్యా జిల్లా ప్రాజె క్టుఅధికారి శ్రీనివాస తదితరులు పాల్గోన్నారు.

**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలి**

శనివారం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ వెంకటచారీతో కలిసి తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణపై సంబంధింత శాఖల అధికారులతో సన్నాహక సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జున్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భవ దినోత్సద వేడుకలకు పూర్తి ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అన్ని శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని తగు జగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అర్‌డిఓ వాసుచంద్ర , వివిధ శాఖల అధికారులు పాల్గో న్నారు.

**ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించు- కున్న కలెక్టర్ దీపక్‌తివారీ :** కలెక్టర్ కార్యాలయంలో శంకర కంటి ఆసుపత్రి నానక్‌రామ్ గూడ హైదరాబాద్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా శిబిరం నిర్వహణ ,రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. కంటి పరీక్ష చేయంచుకుని ,ప్రతి ఒక్కరు కంటి ఆరోగ్యం పై ప్రత్యే శ్రద్ధ వహించాలనిసూ చించారు. ముఖ్యంగా వృద్ధులు,విద్యార్థులు , మదు మోహం వంటి ఆరోగ్య సమస్యలతో బాదపడుతున్న




,నిర్ధిష్ట వ్యవధికంటి పరీక్షలు చేయించుకోవడం అవసర మని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా ప్రజ లకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నా యని,ఇటువంటి క్ర్యాక్రమాలను సద్వినియోగం చేసుకో వలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## నిమ్స్‌లో ఫైర్ మాక్ డ్రిల్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అగ్ని ప్రమాదాల పట్ల నిమ్స్ ఆసుపత్రిలో రోగులు, రోగి సహాయకులు, వైద్యులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా ప్రమాదం జరిగిన సందర్భంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం పురస్కరించుకొని శనివారం నిమ్స్‌లోని ట్రామా బ్లాక్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఫైర్ ఆఫీసర్ టి.వెంకట్, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి.భానుప్రసాద్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు ఎండి.షౌకత్, పి.సాయిరెడ్డిల మార్గదర్శకత్వంలో సిబ్బందికి అత్యవసర పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఈ వార్తకు ఫొటో 30

## 'సర్' పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓట్లు పోకుండా అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ బిఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. జూన్ 3న సికింద్రాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్న నేపథ్యంలో శనివారం తార్నాక మునిసిపల్ డివిజన్ బీఆర్ఎస్ పోలింగ్ బూత్ కమిటీలు, ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

## సిసిపిఎల్ క్లబ్ లీగ్ చాంపియన్‌గా వైకింగ్స్ పిసి



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** సిసిపిఎల్ క్లబ్ లీగ్ హైదరాబాద్ టోర్నిలో వైకింగ్స్ పిసి చాంపియన్‌గా నిలిచినట్టు సెంటర్ కోర్టు స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ వ్యవస్థాపకులు యశ్వంత్ బియ్యాల, విక్రాంత్ రావు తెలిపారు. నగరంలోని క్రాస్‌కోర్ట్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో పది వారాల పాటు జరిగిన ఫైనల్ వైకింగ్స్ పిసి 40 తేడాతో పెంగ్విన్ పిసిపై ఘన విజయం సాధించి, ట్రోఫీనిని కైవసం చేసుకొన్నదని తెలిపారు. కాన్ఫరెన్స్ –ఎ ఫైనల్‌లో పెంగ్విన్ పిసి 42తో డిఆర్‌సి స్పోర్ట్స్ ఫౌండేషన్‌ను ఓడించి ఫైనల్ చేరగా, కాన్ఫరెన్స్ – బి ఫైనల్‌లో వైకింగ్స్ పిసి 3–3తో బిల్డ్ క్రూతో సమంగా నిలిచి, గేమ్ బ్రేకర్‌లో 2522తో గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించిందని తెలిపారు. ఈ లీగ్‌లో 350 మందికిపైగా అటగాళ్లు పాల్గొనగా, 92 మంది మహిళలు ఉన్నట్టు తెలిపారు. 220కిపైగా మ్యాచ్‌లు నిర్వహించగా, 8వేల మందికిపైగా క్రీడాభిమానులు వీక్షించారని వివరించారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగర రమేష్, కొమ్ము శేఖర్ మాట్లాడారు. తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని ప్రవేశపెట్టి ఏడాది పూర్తవుతున్నా, తమకు ఇంకా పూర్తిస్థాయిలో విధులు కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 4 కోట్ల జనాభా భూ సమస్యలను పరిష్కరించేందుకు, రైతులకు, ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు బాలకృష్ణ, సతీష్, ట్రెజరర్ రాకేష్‌లతో పాటు 33 జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## గంజాయి ముఠా గుట్టురట్టు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్: సైఫాబాద్ పోలీసులు:** గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 21.251 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, సైఫాబాద్ ఎస్ఐ ఎం.స్వామికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌డిపిఎస్ బృందంతో కలిసి ఈనెల 29న లక్డీకాపూల్ రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో నిఘా ఉంచారు. సాయంత్రం 4:25 గంటల సమయంలో లక్డీకాపూల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రైవేట్ ట్రావెల్స్ పార్కింగ్ ప్రాంతం వద్ద మూడు లగేజీ బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలను విచారించి వారి బ్యాగులను తనిఖీ చేయగా బ్యాగులో దాచిన 19 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి.ఈ క్రమంలోనే నారాయణ్‌పేట్ జిల్లాకు చెందిన తిప్పిగిరి లక్ష్మి అలియాస్ బుగమ్మ ప్రస్తుతం ముంబాయిలో నివాసముంటుండగా.. ముంబాయి వాసి సందీప్కార్ మఖన్‌సింగ్‌లను విచారించగా.. విశాఖపట్నానికి చెందిన శ్రీను అనే సరఫరాదారు నుంచి గంజాయి కొనుగోలు చేశామని, దీనిని తదుపరి విక్రయాలు, పంపిణీ కోసం ముంబైకి తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

ఈ నెల 25 నాటికి పరిస్థితిని

# 24 గంటలో పునరుద్ధరించాలి

కూకట్‌పల్లి భూ వివాదంలో హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోర్టుల ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ కూకట్‌పల్లి భూవివాదంలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టుకు ఇచ్చిన హామీలను, ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను పక్కనపెట్టి రాత్రికి రాత్రే నిర్మాణాలను తొలగించడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు చెందిన స్థలంలో ఈ నెల 25వ తేదీ నాటికి ఉన్న పరిస్థితిని 24 గంటల్లో పునరుద్ధరించాలని హైడ్రా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, సంబంధిత తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేసింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని సర్వే నెంబర్లు 1003 నుంచి 1006 వరకు విస్తరించిన 13.17 ఎకరాల భూమికి సంబంధించి ఈ వివాదం తలెత్తింది. ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా అధికారులు కాంపౌండ్ గోడలు, ఫెన్సింగ్, భద్రతా సిబ్బంది గదులు, ప్రవేశ ద్వారాలను కూల్చివేశారని ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్స్ ఆరోపించింది. అంతేకాక అక్కడ ఉన్న యంత్రాలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారని పేర్కొంటూ మూడు వేర్వేరు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేసింది.ఈ పిటిషన్లను విచారించిన జస్టిస్ నగేశ్ భీమపాక, ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన అనంతరం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్న కేసుల్లోనూ, కోర్టుకు హామీలు ఇచ్చిన వ్యవహారాల్లోనూ హైడ్రా తన ఇష్టానుసారంగా వ్యవహరించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ముందుగా కూల్చివేతలు చేపట్టి, ఆ తరువాత వాటిని సమర్థించుకునే ప్రయత్నం చేయడం హైడ్రాకు అలవాటుగా మారినట్లు గా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.కోర్టు ముందు ఉన్న రికార్డులను పరిశీలిస్తే గత ఆదేశాలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని, ఇదే అంశంపై ధిక్కరణ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే చేపట్టిన చర్యలు సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. పిటిషనర్లు సమర్పించిన ఆధారాల ప్రకారం హైడ్రా స్వయంగా కోర్టుకు ఇచ్చిన హామీని కూడా పాటించలేదని గమనించారు. దీంతో వివాదాస్పద స్థలంలో ఈ నెల 25వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఫెన్సింగ్, భద్రతా సిబ్బంది గదులు, ప్రవేశ ద్వారం, విద్యుత్ లైన్లు, లైటింగ్‌తో పాటు ఇతర మౌలిక వసతులన్నింటినీ తిరిగి ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. స్థలం వద్ద హైడ్రా, రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించి, బోర్డులను కూడా తీసేయాలని ఆదేశించారు. అధికారులు ఆదేశాలను అమలు చేయకపోతే పునరుద్ధరణకు అయ్యే వ్యయాన్ని ప్రతివాదుల నుంచే వసూలు చేసుకునే హక్కు పిటిషనర్లకు పేర్కొన్నారు. తదుపరి విచారణను జూన్ 4కు వాయిదా వేశారు.

## ఎసిబి వలలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి)కు చెందిన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బత్తుల మహేందర్ ను ఎసిబి అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. సైబర్ ఫ్రాడ్ కేసులో ఫిర్యాదుదారుడి కుటుంబ సభ్యులు, స్నేహితులను కేసులోకి లాగకుండా ఉండేందుకు రూ.9 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఎసిబి వెల్లడించింది.ఇప్పటికే రూ.5 లక్షలు నగదు రూపంలో స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ మహేందర్.. మిగిలిన రూ.4 లక్షల కోసం మళ్లీ ఒత్తిడి చేయడంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. దీంతో ఎసిబి బృందం అతడిని కార్యాలయంలోనే పట్టుకుంది. తదుపరి ఇన్‌స్పెక్టర్ నివాసంలో నిర్వహించిన సోదాల్లో రూ.13 లక్షల అక్రమ నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అతని ఆస్తులపై మరింత విచారణ కొనసాగుతోంది.అరెస్టు చేసిన మహేందర్‌ను నాంపల్లి ప్రత్యేక ఎసిబి కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు.



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ – లండన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించినచెస్ గేమ్‌లో 3 ఏండ్ల వయస్సులో చెస్ గేమ్ లో 120 చెస్ ఫజిల్స్ ను 8 నిమిషాల 56 సెకండ్లలో పూర్తి చేసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'చెస్ మెట్ క్వీన్' సర్టిఫికెట్ సాధించిన అశ్విక హితర్థ గౌడ్ మద్దూరిని అభినందించిన మంత్రి దామోదర రాజనర్సింహ

## సైబరాబాద్‌లో కీలక అభివృద్ధి ప్రతిపాదనలకు ఆమోదం

- రూ.161 కోట్లతో శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణం
- రోడ్డు అభివృద్ధి, ప్రజారోగ్యం, క్రీడా సదుపాయాలపై దృష్టి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) 4వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు కీలక మౌలిక సదుపాయాలు, పరిపాలనా సంస్కరణలు, ప్రజా అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం లభించింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషనర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, చీఫ్ ఇంజనీర్, చీఫ్ సిటీ ప్లానర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మొత్తం 11 ఎజెండా అంశాలను పరిశీలించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన అంశాలను సిబ్బంది హేతుబద్ధీకరణతో ఆమోదించగా, ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సిఐ) సేవల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. మిగిలిన ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపింది. జె.జె.నగర్ నుంచి కొంపల్లి వరకు గ్రోమోర్ ఫుడ్ నర్సరీ (ఫాక్స్ సాగర్ సరస్సు) మీదుగా 30 మీటర్ల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి ప్రణాళికకు ఆమోదం లభించింది. అలాగే అమీన్‌పూర్ కమాన్– గాంధీ విగ్రహం– బండం కొమ్ము చెరువు మార్గంలో 45 మీటర్ల వెడల్పు రోడ్డు అభివృద్ధి ప్రణాళికను కూడా ఆమోదించారు. ఈ రెండు ప్రాజెక్టులు ప్రాంతీయ రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచనున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో దరఖాస్తుల పరిష్కారం, ఫీల్డ్ తనిఖీలు, అమలు చర్యలను వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బంది నియామకానికి అనుమతి లభించింది. ఇదే తరహాలో మౌలిక సదుపాయాల పనుల పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, ప్రాజెక్టుల అమలును బలోపేతం చేసేందుకు ఇంజనీరింగ్ విభాగంలో సాంకేతిక, సహాయక సిబ్బంది నియామకానికీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఖానామెట్ గ్రామ పరిధిలోని ముడికుంట సరస్సు సమీపంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి సుమారు రూ.161 కోట్ల అంచనా వ్యయంతో ఆమోదం లభించింది. జి+8 అంతస్తులతో నిర్మించే ఈ భవనాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జి+12 వరకు విస్తరించే అవకాశాన్ని కల్పించనున్నారు. దీనివల్ల కార్పొరేషన్ పరిపాలనా కార్యకలాపాలు ఒకే చోట కేంద్రీకృతమై ప్రజా సేవల అందజేత మరింత సమర్థవంతం కానుంది. కొత్తగా విలీనం చేసిన పట్టణ స్థానిక సంస్థల ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక ఎంటమాలజీ పైలట్ ప్రాజెక్టును ఆమోదించారు. ఫాగింగ్, పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకం, ప్రజారోగ్య కార్యక్రమాలను ఇందులో చేపట్టనున్నారు.

## పోరాట ఫలితమే 'ప్రశ్నించే గొంతుక'

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణలో మార్పు కోసం చేసిన పోరాట ఫలితంగా ఇప్పుడు మాట్లాడే అవకాశం వచ్చిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఉద్యమకారులను పట్టించుకోలేదని.. తెలంగాణ కోసం పోరాడిన వారిని అణచివేసే ప్రయత్నాలు జరిగాయని.. మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్‌బండ్‌కు అనుమతి ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన చర్చాగోష్టిలో కోదండరాం మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అందరికీ న్యాయం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మళ్లీ ఉద్యమ ఆశయాల సాధన కోసం అవసరమైతే పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారులందరినీ కలుపుకుని పనిచేస్తామని తెలిపారు. చర్చాగోష్టిలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా.కాచం సత్యనారాయణ మాట్లాడుతూ... ఉద్యమకారులకు తగిన గుర్తింపు, న్యాయం చేయాలని కోరారు. 2014లో ఉద్యమకారుల సంక్షేమ సంఘాన్ని స్థాపించామని, ఉద్యమకారుల సంక్షేమమే తమ సంఘం ఏకైక లక్ష్యమని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ, గుర్తింపు కమిటీలో అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 4న అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి సూచనలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో రాములు నాయక్, పాశం యాదగిరి, ముక్కాల సాంబశివరావు, కెవి.రంగా రెడ్డి, పల్లె వినయ్‌కుమార్, శ్రవణ్ కుమార్ గుప్తా, బిరెల్లి వెంకటరెడ్డి, కొత్త రవికుమార్, మహేందర్ యాదవ్, కూర రమేష్, వెంకటాచారి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1969, మలి,దశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కాంగ్రెస్ నిరుద్యోగ హామీల మోసంపై..

## రాహుల్ గాంధీని నిలదీయాలి : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ నిరుద్యోగ విద్యార్థి యువతకు 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసంపై రాహుల్ గాంధీని నిలదీయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు పిలుపునిచ్చారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో రేవంత్ రెడ్డి ముషీరాబాద్‌కు రాహుల్ గాంధీని తీసుకువచ్చి అడ్డగోలు హామీలిచ్చి, యువతను మోసం చేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల పేరిట విద్యావంతుల ఓట్లు దండుకొని, రాహుల్ గాంధీ ఇప్పుడు మొహం చాటేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్తగా ఇచ్చింది ఏమీ లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను చూపి చేతులు దులిపేసుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం నేపథ్యంలో ప్రతి ఒక్క బిఆర్ఎస్ కార్యకర్త జాగ్రత్తగా ఉండాలని కెటిఆర్ సూచించారు. కాంగ్రెస్, బిజెపిలు చేసే ఓటర్ల నమోదు అవకతవకలను అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అసిస్టెంట్‌లతో (బిఎల్ఎల) సమావేశమై ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారువచ్చే నెల నుంచి పార్టీ సభ్యత్వ న మోదు కార్యక్రమాన్ని పూర్తి డిజిటల్ రూపంలో చేపడుతున్నామని, బూత్‌ల వారీగా శిక్షణ ఇచ్చి కాంగ్రెస్ అరాచకాలను ఎండగడతామని కెటిఆర్ అన్నారు. పార్టీ నాయకులు ముఠా జయసింహ, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, నా గేష్ ముదిరాజ్, వి.శ్రీనివాస్ రెడ్డి, సోమన్, హరిబాబు యాదవ్, పెంటా రెడ్డి పాల్గొన్నారు.

## మైనింగ్ అక్రమాలపై సిఐడి కేసు నమోదు..!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైనింగ్ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. భారీ ఎత్తున అక్రమ తవ్వకాలు, అనుమతుల కంటే అధికంగా ఖనిజాల వెలికితీత, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిన అంశాలపై విజిలెన్స్ శాఖ సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించిన నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. విజిలెన్స్ దర్యాప్తులో పలు ప్రాంతాల్లో మైనింగ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు, అనుమతులకన్నా ఎక్కువ స్థాయిలో ఖనిజ సంపద తవ్వకాలు చేపట్టినట్లు, కొంతమంది అధికారుల సహకారంతో అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా పూర్తి స్థాయి దర్యాప్తు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిఐడికి కేసు అప్పగించింది. ఈ మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి కీలక పత్రాలు, లీజు అనుమతులు, రవాణా రికార్డులు, రాయల్టీ చెల్లింపులు, సంబంధిత శాఖల అధికారుల పాత్రపై విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. అక్రమ మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లి ఉండొచ్చన్న అనుమానాలతో అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో కొన్ని మైనింగ్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాయన్న ఆరోపణలు ఇప్పటికే రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడు విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ ఎంట్రీ ఇవ్వడంతో ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారింది. దర్యాప్తు పురోగతిని బట్టి మరికొంతమంది అధికారులు, మైనింగ్ సంస్థల ప్రతినిధులకు నోటీసులు జారీ చేసే అవకాశముందని సమాచారం. అవసరమైతే ఆర్థిక లావాదేవీలపై కూడా ప్రత్యేక విచారణ జరిపే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. వైఖరి అవలంబిస్తోందని, అక్రమాలకు పాల్పడిన వారెవ్వరినీ వదిలిపెట్టబోమని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

వరి కొనుగోళ్లలో రైతుల దోపిడీ...

## రైస్ మిల్లర్లకు అధికారుల వత్తాసు: శేర్ నర్సారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరి ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు రైతులను బహిరంగంగా దోచుకుంటున్నప్పటికీ అధికార యంత్రాంగం చూస్తూ ఊరుకుంటోందని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు పేరుతో క్వింటాలుకు 5 నుంచి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు.హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. అరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో రైస్ మిల్లర్లు, నిర్వాహకులు కుమ్మక్కై రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. రైతులకు అండగా ఉంటామని చెప్పే ప్రభుత్వం, అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమై చేతల్లో మాత్రం మిల్లర్ల దోపిడీని అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గన్నీ సంచులు, హమాలీలు, లారీలు సమకూర్చడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. వరి కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని శేర్ నర్సారెడ్డి కోరారు.

## పదోన్నతులపై దృష్టి సారించాలి



తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** పటిష్టమైన విద్యా వ్యవస్థకు సమర్థవంతమైన నాయకత్వం, పరిపాలన పర్యవేక్షణ అత్యంత కీలకమని... కానీ గత 20 సంవత్సరాలుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు, రెగ్యులర్ ఎంఈఓలకు పైస్థాయి పదోన్నతులు కల్పించకపోవడం వల్ల ఎంతో అనుభవం ఉన్న విద్యావేత్తలు తీవ్ర నిరాశా నిస్పృహలకు గురవుతున్నారని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రాజగంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పాల్గొన్న అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.గిరిధర్‌గౌడ్, కోశాధికారి బి.తుకారాం మాట్లాడుతూ.. 33 జిల్లాలకు గాను కేవలం 12 మంది మాత్రమే రెగ్యులర్ డిఈవోలు, 76 మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారని.. ఇంత పెద్ద మొత్తంలో పర్యవేక్షణ అంశాలను పూర్తిగా గాలికి వదిలేసి దశాబ్దాలుగా ఇన్చార్జిలతో కాలం గడిపేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నాటి చెల్లని ఇంటిగ్రేటెడ్ సర్వీసింగ్ పూర్తిగా రద్దు చేయాలని.. తెలంగాణకు ప్రత్యేక రూల్స్ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

## పోడు సాగుదారులపై అణచివేత నిలిపివేయాలి

గ్రామీణ పేదల సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** పోడు సాగుదారులపై ఫారెస్ట్, పోలీస్ అధికారులు దాడులు చేసి అక్రమ కేసులతో సాగిస్తున్న అణచివేతను వెంటనే నిలిపివేయాలని గ్రామీణ పేదల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాలో పాల్గొన్న డాక్టర్ జతిన్ కుమార్, ఓపిడిఆర్ స్టేట్ ప్రెసిడెంట్ జి.వెంకటాద్రి, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయేందర్‌రావు, ఓపిడిఆర్ స్టేట్ ప్రధాన కార్యదర్శి సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామీణ పేదల సంఘం భువనగిరి డాక్టర్ మోహన్ రెడ్డి, భారత చైనా మిత్ర మండలి పృథ్వీరాజ్ తదితరులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న వారికి పోడు భూములపై హక్కులను కట్టబెట్టాలన్నారు. పోడు సాగుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకుల దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రామీణ పేదల సంఘం నాయకత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వచ్చిన పోడు సాగుదారులు నిరసనలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిలేని గిరిజన, గిరిజనేతర ప్రజలకు ఆ భూమిపై పట్టాలని ఇచ్చి వారి సాగును చట్టబద్ధం చేయాలని.. వ్యవసాయానికి అవసరమైన వసతులను సమకూర్చి వారి జీవనానికి జీవనోపాధికి సుస్థిరతను కలిగించాలని, పోడు సాగు చేస్తున్న పేదలందరి పేర్లు రికార్డుల్లో నమోదు చేసి వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు. టైగర్ జోన్ల పేరుతో గిరిజన గ్రామాలను ఖాళీ చేయించవద్దని వారు కోరారు.

పోలీస్ ప్రధాన కార్యాలయంలో

## దివ్యాంగుల 'వీల్ చైర్ ర్యాంప్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లక్డికాపూల్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం (డిజిపి ఆఫీస్)కు వచ్చే దివ్యాంగుల సౌకర్యార్థం 'ఆల్ ఇండియా డిసేబుల్డ్ రైట్స్ ఫోరమ్' అధ్యక్షులు చేసిన విజ్ఞప్తి మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్ 'వీల్ చైర్ ర్యాంప్' ఏర్పాటు చేపించారు .ఫోరం అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు ఇటీవల డిజిపి సివి ఆనంద్ ను కలిసి కార్యాలయానికి వచ్చే దివ్యాంగుల కోసం వీల్ చైర్ ర్యాంప్ ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. డిజిపి కార్యాలయంలో ర్యాంప్ లేకపోవడం వల్ల వీల్ చైర్లపై వచ్చే దివ్యాంగులు ఉన్నతాధికారులను కలవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆయన డిజిపి దృష్టికి తీసుకెళ్లారు.దివ్యాంగుల సమస్యపై సానుకూలంగా స్పందించిన సివి ఆనంద్.. వెంటనే కార్యాలయంలో 'వీల్ చైర్ ర్యాంప్ నిర్మించాలని' సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.

# పెరుగుతున్న ఉద్రిక్తత : క్యూబా సైనిక విన్యాసాలు

## క్యూబా అధికారులతో అమెరికా కమాండర్ భేటీ



**హవానా:** క్యూబాపై అమెరికా రోజు రోజుకూ తన ఒత్తిడి పెంచడంతో కమ్యూనిస్టుదేశంలో తీవ్ర అభద్రత, దేశాన్ని సామ్రాజ్యవాదం నుండి రక్షించుకోవాలనే ఆకాంక్ష పెరుగుతోంది. ప్రజలు గడచిన రెండు నెలలుగా సైనిక విన్యాసాలకు అలవాటు పడుతున్నారు. వారంతా వివిధ రకాల శిక్షణలు పొందుతున్నారు. ముఖ్యంగా మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రోపై నేరాభియోగాలు చేసేందుకు అమెరికా సన్నద్ధం కావడంతో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. క్యూబా విప్లవ నాయకుడు రౌల్ కాస్ట్రోపై చేసిన ఆరోపణలకు ఎలాంటి చట్టబద్ధత లేదని, క్యూబా ప్రభుత్వం పేర్కొంది. 1996 ఫిబ్రవరి 24న జరిగిన పరిణామాలను తారుమారుచేసి రాజకీయంగా రెచ్చగొట్టి ఆయనను అపఖ్యాతిపాలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించింది. ఇది దేశ అధికార పరిధిని అతిక్రమించి అంతర్జాతీయ చట్టాలను అతి ఘోరంగా ఉల్లంఘించడమే అవుతుందని హెచ్చరించింది. రౌల్ కాస్ట్రోపై చేసిన ఆరోపణలను ఖండించడానికి హవానాలో సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక వద్ద 2.50 లక్షలమంది క్యూబన్లు ఇటీవల సమావేశమై అమెరికా నీచమైన కుట్రలను తీవ్రంగా ఖండించారు. ప్రపంచవ్యాప్తంగా మిత్రులు పంపిన సంఘీభావానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పరిణామాలను రష్యా, చైనా సహా అన్ని దేశాలు గమనిస్తున్నాయి. ఈ పరిస్థితులు దీర్ఘకాలిక విభేదాలకు దారితీయవచ్చునని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. క్యూబా విషయంలో తమకు అన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని అమెరికా ప్రకటించింది. ఈ దశలో లాటిన్ అమెరికాకు చెందిన అమెరికా ఉన్నత స్థాయి కమాండర్ ఒకరు క్యూబన్ సైనికాధికారులతో సమావేశం జరిపారు. భద్రతా విషయాలపై వారు చర్చించారు. అమెరికా సదరన్ కమాండ్ అధిపతి జనరల్ ఫ్రాన్సిస్ డోనోవన్ వెళ్ళి క్యూబన్ మిలిటరీ అధికారులు లెఫ్టినెంట్ జనరల్ రోబెర్టో లెగ్రో సోటోలోంగో, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం సానుకూలంగా జరిగిందని క్యూబా అధికారులు చెప్పారు. గ్యాంటనామో బే సమీపంలో ఉన్న అమెరికా నావికాదళం స్థావరం సమీపంలో ఈ చర్చలు జరిగాయి. వెనిజులా, ఇరాన్ తర్వాత తమ లక్ష్యం క్యూబా దేశమేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే హెచ్చరికలు చేస్తున్నారు. క్యూబాపై డ్రగ్ మాఫియా దేశంగా ఆయన ముద్రవేసి వేటాడేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. నికొలస్ మదురోను కూడా ఇదే పద్ధతులలో గడచిన జనవరి నెలలో అరెస్టుచేసి తీసుకువెళ్ళి అమెరికా జైలులో బంధించారు.

ఇంతకుముందు అమెరికా మంత్రి మార్కో రుబియో, సిఐఎ అధికారి జాన్ రాట్‌క్లిఫ్ కూడా క్యూబా అధికారులతో సమావేశం జరిపారు. గ్యాంటనామో బే లో అమెరికా నౌకాదళం రక్షణ గురించి వారు చర్చించారు. గడచిన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా మార్కో రుబియో క్యూబా గురించి చర్చించారు. అమెరికాకు 90 మైళ్ళ దూరంలో ఒక విఫలమైన దేశం ఉండటం ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించారు. అసమర్థులైన కమ్యూనిస్టు గుంపు క్యూబాను నడుపుతోందని అమర్యాదకర వ్యాఖ్యానాలు చేశారు.

# సముద్ర గర్భంలో కేబుళ్ళ రక్షణకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా 'ఆకస్' కూటమి



**సింగపూర్:** సముద్రగర్భంలో ఉన్న అంతర్జాతీయ అనుసంధాన ఇంటర్నెట్ కేబుళ్ళను రక్షించడానికి "ఆకస్" అనే పేరుతో ఒక కూటమి ఏర్పాటు చేసి, నీటి అడుగున కేబుళ్ళ రక్షణకు డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధి చేయాలని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలు నిర్ణయించాయి. సింగపూర్‌లో జరుగుతున్న "ఆకస్" దేశాల రక్షణ మంత్రుల వార్షిక భద్రతా సమావేశంలో ఈ దేశాల నాయకుడు శనివారం ఈ నిర్ణయం ప్రకటించారు. సముద్రగర్భంలో అంతర్జాతీయ ఇంటర్నెట్ కేబుళ్ళను కత్తిరిస్తామని, వాటిని ధ్వంసం చేస్తామని, వాటిపై కూడా సుంకాలు విధిస్తామని ఇరాన్ ఇటీవల హెచ్చరికలు చేసిన నేపథ్యంలో సింగపూర్ సమావేశంలో ఈ కొత్త ఆలోచన తెరమీదకు వచ్చింది. ఈ మానవ రహిత వాహనాల టెక్నాలజీ ద్వారా సముద్ర గర్భంలో కేబుళ్ళ రక్షణ వ్యవస్థ వచ్చే ఏడాది నాటికి సిద్ధం అవుతుందని భావిస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందనే విషయం వెల్లడి కానప్పటికీ బ్రిటన్ మాత్రం 150 మిలియన్ పౌండ్లు (201మిలియన్ డాలర్లు) సమకూరుస్తుందని ఆ దేశ రక్షణమంత్రి జాన్ హీలీ ముందస్తు ప్రకటన చేశారు. ఇన్నాళ్ళూ మనం ఆకస్ కోసం తక్కువ చేశామని, ఇప్పుడు ఎక్కువ ఆచరణలోకి దిగుతామని ఆయన అన్నారు. 2021లో ప్రారంభమైన ఈ ఆకస్ కూటమి అణ్వాయుధాలను తయారు చేయడంతోపాటు సైనిక నైపుణ్యాలను కూడా ఇచ్చిపుచ్చుకుంటాయి.

## డ్రగ్స్ బోటుపై దాడి: ముగ్గురు మృతి

### తొమ్మిది నెలలో 200 మంది మృతి


**వాషింగ్టన్:** లాటిన్ అమెరికాలో డ్రగ్స్‌బోట్స్‌పై దాడుల పేరుతో అమెరికా మరోసారి అరాచకానికి పాల్పడింది. అక్రమంగా మాదక ద్రవ్యాలను తరలిస్తున్నారని అనుమానించి తూర్పు పసిఫిక్ సముద్రంలో పడవలపై దాడులు చేయడంతో ముగ్గురు మరణించారు. ఈ చర్యను మానవహక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆపరేషన్ సదరన్ స్పియర్ పేరుతో గడచిన సెప్టెంబరు నుండి ఇప్పటివరకూ తొమ్మిది నెలల కాలంలో ఈ విధంగా పడవలపై అమెరికా దాడులుచేసి హతమార్చివారి సంఖ్య 200 దాటింది. ఒక ఉగ్రవాద సంస్థ ఈ డ్రగ్ బోటును నడుపుతోందని, ఈ బోటులో ప్రయాణిస్తున్న ముగ్గురు ఉగ్రవాదులు తాజా దాడుల్లోమరణించారని అమెరికా ప్రకటించింది.

## అఫ్గానిస్థాన్‌లో 22 మంది వలస ప్రజలు దుర్మరణం

**కాబూల్:** తూర్పు అఫ్గానిస్థాన్‌లో వలస ప్రజలను తీసుకువెళుతున్న ఒక లారీ ప్రమాదానికి గురికావడంతో అందులో ప్రయాణిస్తున్న 22 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 36 మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలు ఉన్నారని అధికారులు చెప్పారు. తూర్పు ఆఫ్గానిస్థాన్ జాతీయ రహదారిపై లారీ తలక్రిందులుగా పడిపోవడంతో ఈ మరణాలు సంభవించాయి. లాఘమన్ రాష్ట్రంలో కాబూల్ జాతీయ రాజధానితో అనుసంధానమైన జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిందని ప్రొవెన్సియల్ గవర్నర్ అబ్దుల్ మిఆలిక్ నైజై చెప్పారు. మరణించినవారిలో పదిమంది పిలలలు, ఐదుగురు మహిళలు ఉన్నారు. గాయపడినవారిని నాన్‌గర్హార్ ఆసుపత్రికి తరలించారు. ప్రొవెన్సియల్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ అమినుల్లాషరీఫ్ సమాచారం ప్రకారం 22 మంది వలస ప్రజలు మరణించారు. డ్రైవరు నిద్రావస్థలోకి వెళ్ళడంతో లారీ పక్కనే ఉన్న గోతిలో పడిపోయింది. 2023లో లక్షలాదిమంది ఆఫ్గానిస్థానీయులు పాకిస్థాన్, ఇరాన్ దేశాల నుండి వలసవచ్చారు. వారు రోజు గడవక జీవన పోరాటం చేస్తున్నారు. అదేవిధంగా నూరిస్థాన్‌లో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో కారు నదిలో పడిపోవడతో డ్రైవరు గాయపడగా, అందులో ప్రయాణం చేస్తున్న నలుగురు జాడ తెలియకుండా పోయారు. వారి మృతదేహాలకోసం వెతుకుతున్నారు.

## లెబనాన్‌పై విస్తరించిన ఇజ్రాయెల్ దాడులు

**బీరూట్** కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన దాడులను విస్తృతం చేసింది. కొత్తగా దక్షిణ లెబనాన్‌లో ఏడు గ్రామాలను ఖాళీ చేయాలని ఐడిఎఫ్ ఆదేశించింది. దీంతో దక్షిణ లెబనాన్‌లో అధిక భాగాన్ని ఇజ్రాయెల్ తన అధీనంలోకి తెచ్చుకున్నట్లయింది. ఏప్రిల్ 17 నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమలలో ఉన్నప్పటికీ, ఒకవైపు చర్చలు జరుగుతున్నప్పటికీ లెబనాన్‌లో హింసాకాండను ఇజ్రాయెల్ మానుకోలేదు. దీంతో హెజ్బొల్లా సైనికులు కూడా శనివారంనాడు తూర్పు ఇజ్రాయెల్‌లోకి పది ప్రొజెక్టైల్స్‌ను ప్రయోగించారు. మరో వైపు ఇజ్రాయెల్ దళాలు దిబ్బిన్ గ్రామంలోకి ప్రవేశించాయి. గగనతల దాడుల్లో కూడా ఆరుగురు మరణించారు. ఇదిలా ఉండగా శుక్రవారం నాడు అమెరికాలో ఆరుగురు సభ్యుల ఇజ్రాయెలీ సైనిక అధికారులు నేరుగా లెబనాన్ సైనిక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే దాడులు ఉద్ధృతంగా కొనసాగాయి.



# ఎన్నికల్లో పోటీ చేయం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని, కేంద్ర ప్రభుత్వం కేవలం ఎంఎస్‌పి ప్రకటించి వదిలిపెట్టడం కాదని, తాము కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రం కొనాలని రేవంత్‌రెడ్డి అన్నారు. అలా చేయకపోతే ధాన్యాన్ని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి నేతల ఇళ్ళ ముందు పోస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ(ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి)లోని బోధి సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిజర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

**దేశంలోనే మొదటి రైతు డిస్కామ్**

ఒకప్పుడు దేశంలోని 56 డిస్కమ్‌లలో తెలంగాణకు చెందిన సదరన్ డిస్కమ్, నార్తర్న్ డిస్కమ్‌లు 3,6 స్థానాలలో ఉండేవని, ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చిన తొలినాళ్ళలో కూడా అలాగే ఉండేదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి డబ్బులు కట్టకపోవడంతో డిస్కమ్‌లకు బకాయిలు పేరుకుపోయి, బ్యాంకుల నుంచి అధిక వడ్డీలకు రుణాలు తీసుకువచ్చి విద్యుత్‌కొనుగోలు చేసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా మన డిస్కమ్‌లు ఒకప్పుడు ముందువరుసలో 3,6 స్థానాలలో ఉంటే, గత ప్రభుత్వ హయాంలో కింద వరుసలో 52,54 స్థానాలలో ఉందని తెలిపారు. డిస్కమ్‌లు సైతం బిల్లులు చెల్లించని అన్ని బకాయిలను వ్యవసాయ విద్యుత్ కిందనే చూపించి, యూనిట్‌కు రూ.10 చొప్పున విధించిందని, గత ప్రభుత్వం బకాయిలు పేరుకుపోయి, తాము అధికారంలోకి వచ్చే నాటికి రూ.69,70 కోట్ల బకాయిలతో కుప్పకూలే పరిస్థితి నెలకొందన్నారు. డిస్కమ్‌లు జెన్‌కోకు డబ్బులు చెల్లించకపోవడంతో, జెన్‌కో సింగరేణి నుంచి కూడా బొగ్గు కొనుగోలు చేసినందుకు డబ్బులు చెల్లించక బకాయిలు పేరుకుపోయి సింగరేణి కూడా కుప్పకూలే పరిస్థితి నెలకొందన్నారు. అందుకే ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో భాగంగా రెండు డిస్కమ్‌ల నుంచి ప్రభుత్వం, ప్రభుత్వం రంగ సంస్థల నుంచి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించే కనెక్షన్‌లు వేరు చేసి వ్యవసాయ డిస్కమ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇలాంటి ఆలోచన దేశంలోనే మొదటిసారి అని, రైతు డిస్కామ్ ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని తెలిపారు.

ప్రభుత్వం నుంచి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చే కనెక్షన్‌లు, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ ప్రభుత్వ రంగ సంస్థలైన మెట్రో వాటర్ వర్క్స్, రూరల్ వాటర్ వర్క్స్ కనెక్షన్‌లను రైతు డిస్కామ్‌లో చేరుస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దీని ద్వారా అసలు రైతులకు ఎంత విద్యుత్ వెళ్తుందో తెలుస్తుందని, అలాగే బడ్జెట్‌లో ఉచిత విద్యుత్ పథకానికి తాము కేటాయించే క్రాస్ సబ్సిడీ నిధులను ఆయా విభాగాలు రైతు డిస్కమ్‌కు ప్రతి నెలా మొదటి తారీఖునే చెల్లించే విధంగా జవాబుదారీతనం వస్తుందన్నారు. ఇప్పటికే తమకు ఉన్న భూములలో సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకుంటామని మెట్రో వాటర్ వర్క్స్ బోర్డు ముందుకు వచ్చిందని, దాని వల్ల క్రాస్ సబ్సిడీ తగ్గుతుందన్నారు. ఫలితంగా మన డిస్కమ్‌లకు మళ్ళీ దేశంలో మొదటి స్థానాలలో ఉండే అవకాశం వస్తుందన్నారు. ఇప్పుడు పునరుత్పాదక విద్యుత్ (సౌర , పవన విద్యుత్) రావడంతో విద్యుత్ కూడా తక్కువ ధరకే లభిస్తోందని, గతంలో పీక్ సమయంలో రూ.18 వరకు యూనిట్‌కు వసూలు చేయగా, అది రూ.10గానే ఉంటోందని, కొన్ని సార్లు ఎక్కువ ఉత్పత్తి కావడంతో ఉచితంగా కూడా ఇస్తున్న పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. విద్యుత్ మీటర్లకు రైతు డిస్కమ్‌కు సంబంధమే లేదని, అసలు స్మార్ట్ మీటర్లు పెడతామని 2017 జూన్ 17ను బిఆర్‌ఎస్ ప్రభుత్వమే ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

**ఎంఎస్‌పి ప్రకటించే కేంద్రం ధాన్యం ఎందుకు కొనదు?**

మక్కలు, జొన్నలకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పి ప్రకటించిందే తప్ప ఒక్క గింజైనా కొన్నదా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. కేవలం ఎంఎస్‌పి ప్రకటిస్తే, సరిపోదని పంటలను కొనాలని అన్నారు. ఎంఎస్‌పి ప్రకటించిన పంటలలో కేంద్రం తెలంగాణ నుంచి 38 శాతం, పంజాబ్ నుంచి 85 శాతం, ఛత్తీస్‌ఘడ్ నుంచి 65 శాతం, హర్యానా నుంచి 65 శాతం కొనుగోలు చేస్తోందన్నారు. ఎంఎస్‌పి ప్రకటించటమే కాదని, వరి, మొక్కజొన్న, జొన్నలను కొనాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యం సహా ధాన్యం పూర్తి కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్న కూడా కొనుగోలు చేస్తుందన్నారు. జూన్ 12న గ్రామ సభలు పూర్తయ్యాక మోదీ, బిజెపి నేతల సంగతి చూస్తామని, రాష్ట్రం కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రం కొనకపోతే, వాళ్ళ ఇళ్ళముందు పోస్తామని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# హరీశ్‌రావు బిఆర్‌ఎస్‌లో ఉండరు

- కల్వకుంట్ల కుటుంబం అరెస్టు మోదీ చేతిలోనే ఉంది
- నేను, మహేశ్‌గౌడ్ కాంబినేషన్‌లోనే 2029ఎన్నికలకు పోతాం
- సిబిఎస్‌ఇ ఫలితాలపై కెటిఆర్ ఎందుకు మాట్లాడడం లేదు
- గ్లోబరీనా కెటిఆర్ బినామీ కాబట్టే మౌనం

**ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చే ఎన్నికల్లో హరీశ్‌రావు బిఆర్‌ఎస్ నుంచి పోటీ చేయబోరని తాను నిస్సందేహంగా చెబుతున్నానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠి సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. హరీశ్‌రావు ఎవరెవరిని కలుస్తున్నారో, ఎవరివరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసునని, నైతికంగా సరైంది సరికాదనే వారి పేర్లు బైటపెట్టడం లేదన్నారు. హరీశ్‌రావుకు దమ్ముంటే కెసిఆర్‌పై ఒట్టేసి తాను బిఆర్‌ఎస్ లోనే ఉంటానని చెప్పగలరా అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ నేతల విచారణలు జరిపినా ప్రభుత్వం ఎందుకు వారిని అరెస్టు చేయడం లేదనే ప్రశ్నకు సమాధానమిస్తూ, తమ ప్రభుత్వం విచారణలు పూర్తి చేసి కల్వకుంట్ల కుటుంబం జుట్టును మోదీకి అందించామని, కాబట్టి ఆయనే సమాధానం చెప్పాలన్నారు. సిబిఎస్‌సి ఫలితాలలో తప్పులపై బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ ఎందుకు మాట్లాడడం లేదని, తప్పులకు కారణమైన గ్లోబరీనా సంస్థపై చర్య తీసుకోవాలని ఎందుకు మోదీకి లేఖ రాయడం లేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. గ్లోబరీనా కెటిఆర్ బినామీ సంస్థ అని, ఆ సంస్థ గతంలో తెలంగాణలో ఇంటర్ ఫలితాలలో కూడా అవకతవకలు చేయడంతో 36 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. తనది, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ది విజయవంతమైన కలయిక అని, 2029లో కూడా తాను సిఎంగా, ఆయన పిసిసి అధ్యక్షుడిగానే ఎన్నికలు పోతామని పునరుద్ఘాటించారు. ఆయనను మంత్రివర్గంలో తీసుకుంటారా? అని ప్రశ్నించగా, ఆ విషయం చర్చకు రాలేదని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే ఆయనే కేంద్ర మంత్రి అవుతారేమోనని అన్నారు. 2029లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే తన లక్ష్యమని, 2034లో కేంద్ర రాజకీయాలకు వెళ్ళేంత వరకు ఇక్కడే ఉంటానన్నారు. ఒక ఎంఎల్‌సిని అడ్డుపెట్టుకొని బిఆర్‌ఎస్ ముఖ్యులు క్రషింగ్ కంపెనీలతో నెలకు రూ.50 లక్షలు ఇస్తే వారి గురించి మాట్లాడబోమని బేరసారాలు చేసారని అన్నారు. జైసల్మేర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటుపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలు ప్రస్తావించగా, ఇక్కడ ఎకరా రూ.కోటి ఉంటుందని, అక్కడైతే రూ.2–3 లక్షలేనని, అందుకే అక్కడ సౌర విద్యుత్ కోసం వెళ్ళామని చెప్పారు. ఇప్పటి వరకు పైసా ఖర్చు పెట్టలేదని, అయినా రూ.500 కోట్లు వృథా అయ్యాయని హరీశ్‌రావు అంటున్నారని చెప్పారు. జైసల్మేర్ పాకిస్థాన్ సరిహద్దులో ఉంటుందని, యుద్ధం వస్తే వాటి పరిస్థితి ఏమిటని హరీశ్‌రావు అంటున్నారని, అసలు 75 ఏళ్లలో అక్కడ పాకిస్థాన్‌తో ఎన్ని యుద్ధాలు వచ్చాయన్నారు.

**ఎన్‌టిఆర్ కులం, ప్రాంతాలకు అతీతం**

తాను హైదరాబాద్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం పెడితే సెటిలర్ల ఓట్ల కోసమని అనడం తప్పు అని, ఎన్‌టిఆర్ కులం, ప్రాంతం, మతంతో పోల్చేవాళ్ళు బుద్ధితక్కువోళ్ళని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్‌టిఆర్ విగ్రహం పెట్టడంపై బిఆర్‌ఎస్ నేతలు తప్పుబట్టటంపై ప్రశ్నించగా, గతంలో ఖమ్మంలో బిఆర్‌ఎస్ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎన్‌టిఆర్ విగ్రహం పెట్టలేదా? ఆ ప్రభుత్వం కమ్మ సంఘానికి భూమి కేటాయించలేదా? అని అన్నారు.అందుకు అభ్యంతరముంటే కెటిఆర్ తన పేరులో తారక రామారావు అని తీసేయలేదని నిలదీశారు. గతంలో కెటిఆర్ భీమవరం నుంచి పోటీ చేస్తానన్న సంగతి మరిచిపోయారా? అని అన్నారు.

## సిపిఐ రాష్ట్ర కార్యాలయానికి మాజీ మావోయిస్టు అగ్రనేతలు

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలపడం జరిందన్నారు. ప్రస్తుతం తమ మధ్య మర్యాదపూర్వక సమావేశం జరిగిందని రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు జరిపి, వారి భవిష్యత్తు ఏమిటి అనే దానిపై చర్చిస్తామని తమ ఆలోచనలను వారితో పంచుకుని, తెలంగాణకి, దేశానికి మంచి జరిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

తద్వారా దేశంలో మతోన్మాద, ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా బలంగా నిలబడగల శక్తి కమ్యూనిస్టు ఉద్యమానిదేనని అభిప్రాయపడ్డారు. త్వరలో అందరూ కలిసి మారిసారి సమావేశమై తమ రాజకీయ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడిస్తారని కూనంనేని సాంబశివ రావు చెప్పారు.

దేవ్‌జీ మాట్లాడుతూ సిపిఐ నేతలను తాము కేవలం మర్యాదపూర్వకంగా కలిసేందుకు మాత్రమే వచ్చామని వెల్లడించారు.

## పరీక్షలో సాంకేతిక లోపం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నామని ఎన్‌టిఎ పేర్కొంది. దీనిపై కాంగ్రెస్ స్పందిస్తూ దేశంలో ఏ పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతున్నారని బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌పై విమర్శలు చేసింది. కాగా, తమ వైపున తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా శనివారం కొన్ని కేంద్రాలలో సియుఇటి(యుజి)– 2026 పరీక్ష ప్రారంభం ఆలస్యమైందని టిసిఎస్ నివేదించింది. ఈ సమస్యను పరిష్కరించామని, ఏ అభ్యర్థికీ నష్టం జరగకుండా ఉండేందుకు పూర్తి అదనపు సమయంతో పరీక్ష నిర్వహిస్తున్నామని ఎన్‌టిఎ తెలిపింది. మధ్యాహ్నం సెషన్ సమయాలు (సవరించినవి): మధ్యాహ్నం 2:30 గంటల నుండి రిపోర్టింగ్/ప్రవేశం; పరీక్ష మధ్యాహ్నం 3:00 గంటలకు బదులుగా సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమైనట్లు ఎన్‌టిఎ తెలిపింది. ఉదయం సెషన్ అభ్యర్థులకు పేపర్‌కు కేటాయించిన పూర్తి సమయం ఇచ్చామని, పరీక్ష పూర్తయిన తర్వాత మాత్రమే బయటకు వెళ్లేందుకు అనుమతించామని పేర్కొంది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు కలిగిన అసౌకర్యానికి ఎన్‌టిఎ మనస్ఫూర్తిగా చింతిస్తోందని ఆ ఏజెన్సీ తెలిపింది. ఏదైనా సహాయం కోసం ఎన్‌టిఎ హెల్ప్‌లైన్ నంబర్ – +9111 40759000 – ఇ–మెయిల్ సపోర్ట్ – cuetug@nta.ac.in – ను కూడా అందించింది. పరీక్ష ఆలస్యంపై పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు 10వ తరగతిలో ఫిర్యాదు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సమాచార లోపం ఉందని ఆరోపించారు. 'సాంకేతిక లోపాల కారణంగా సియుఇటి(యుజి)– 2026 విద్యార్థులు 34 గంటలు వేచి ఉండవలసి వస్తోంది. సరైన సమాచారం లేదు, ఏర్పాట్లు లేవు, విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రమైన ఎండలో ఇబ్బంది పడుతున్నారు. జాతీయ స్థాయి పరీక్షకు ఇది ఆమోదయోగ్యం కాదు' అని ఒక ఎక్స్ యూజర్ పోస్ట్ చేశారు.

## బాల్క సుమన్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే తరహాలో వేధిస్తోందని అన్నారు. సింగరేణిలో వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని ఆరోపించారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెబుతూనే, నేతలను విచారణ పేరుతో వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. తాను ఎక్కడకూ పారిపోలేదని, పార్టీ కార్యక్రమంలోనే ఉన్నానని తెలిపారు.

**బిఆర్‌ఎస్ డ్రామాలో బాల్క సుమన్ బలిపశువు: అద్దంకి దయాకర్**

బిఆర్‌ఎస్ పొలిటికల్ డ్రామాలో బాల్క సుమన్ బలయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల బిఆర్‌ఎస్ నేతలు వాడుతున్న భాష, అగ్రనాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ శైలిపై తీవ్రంగా మండిపడ్డారు. రైలు పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడంముమ్మాటికి కెసిఆర్ నైజమని దయాకర్ విమర్శిం చారు.

**పిడి యాక్ట్ పెట్టాలి:ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్**

బాల్క సుమన్ అరెస్టుపై ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు.సుమన్ వ్యాఖ్యల వెనుక బిఆర్‌ఎస్ నేతల కుట్ర ఉందని అన్నారు. "మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి, సామన్య పేద ప్రజలు ప్రయాణించే రైళ్లపై మీకెందుకు అంత అక్కసు, మీకు ఓట్లేయలేదని కక్షతోనే పేదలపై ఇంటి కుట్రలు చేస్తున్నా రా" అని ఆయన ప్రశ్నించారు. సుమన్‌పై పిడి యాక్ట్ పెంటాలని డిమాండ్ చేశారు.

## పట్టపగలే చిమ్మచీకట్లు!

(మొదటి పేజీ తరువాయి)

రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపై కొద్ది మీటర్ల దూరం కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనాలు హెడ్‌లైట్ల సాయంతో మెల్లగా కదిలాయి. ఇసుక తుపానుకు స్థానిక మార్కెట్లలో గందరగోళం నెలకొంది. బలమైన గాలులు, ఇసుక తుపాన్ నుంచి రక్షించుకునేందుకు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఈ భీకర గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. దట్టమైన ఇసుక తుఫాను, భారీ వర్షం కారణంగా స్థానికుల రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సర్దార్‌షహర్ ప్రాంతంలో ధూళి మేఘాల తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఆకాశాన్ని ఇసుక మేఘాలు పూర్తిగా కమ్మేయడంతో, పట్టపగలే దట్టమైన చీకట్లు అలుముకున్న దృశ్యాలు చూపరులను భయాందోళనలకు గురిచేశాయి.

# రహస్య డీల్..!

(మొదటి పేజీ తరువాయి)

పొగుడుతూ ఓ పోస్టు కూడా పెట్టాడు, వాళ్ల ఫోటోలు కూడా పెట్టాడు.అందులో భారతదేశం తదుపరి ఐదు సంవత్సరాల్లో యుఎస్ గూడ్స్‌ని 500 బిలియన్ డాలర్లు అంటే రూ. 47,75,000 కోట్ల విలువైన వస్తువులను భారత్ కొనబోతున్నది అనేది ఆయన స్పష్టంగా చెప్పాడు. అంటే సంవత్సరానికి రూ.9,50,000 కోట్లు వస్తువులు అమెరికా నుంచి మనం కొనబోతున్నాం. అమెరికా ఉత్పత్తుల ధరలు మన ఉత్పత్తుల ధరలకంటే చాలా తక్కువగా ఉంటాయి.అలాంటప్పుడు మన రైతులు, పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులు ఎవరు కొంటారు, ఎవరు కొనరు. రాబోయే కాలంలో అచ్చం ఇదే జరగబోతుంది.

భారత ప్రజల ప్రయోజనాలను పూర్తిగా అమెరికా ముందు తాకట్టు పెట్టిన ఒప్పందం ఇది అని రాహుల్ గాంధీ స్పష్టంగానే మాట్లాడాడు.అనేక మంది నిపుణులు భారతదేశంలో ఆర్థిక నిపుణులు కావచ్చు కార్యకర్తలు కావచ్చు ఇతర రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ విషయం స్పష్టంగా మాట్లాడుతున్నారు. అయినా బిజెపి దాని మీద మౌనంగా ఉంది. అసలు అట్లాంటి ఒప్పందం అవగాహన కుదిరినట్లు ప్రకటించను కూడా లేదు.

**ఆ వస్తువుల దిగుమతి మనకు అవసరమా..?**

మనకు అవసరమైనది దిగుమతి చేసుకుంటే తప్పేముంది, తప్పేమి లేదు. అయితే మన దగ్గర జరిగే ఉత్పత్తులను సైతం అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడం విడ్డూరంగా ఉంది. ఇది అవసరమా, దీని వల్ల మన దేశమే నష్టపోతుంది. ఇది మనం అర్థం చేసుకోవాల్సిన అంశం. ఆయిల్, నేచురల్ గ్యాస్ కావచ్చు, క్రూడ్ ఆయిల్, కోల్ కావచ్చు ఇతర ఎనర్జీ ప్రొడక్ట్ కావచ్చు మనము తప్పక అమెరికా నుంచే కొనాల్సి వస్తుంది. ఇప్పుడు అమెరికా కంటే తక్కువ ధరలకే మన దేశానికి చాలా దగ్గరగా ఉండే దేశాల నుంచి ఇరాన్ నుంచి కూడా వీటిని కొనవచ్చు అరబ్ కంట్రీస్ నుంచి కొనొచ్చు, రష్యా నుంచి కొనోచ్చు తక్కువ ధరకి ఇవ్వడానికి రెడీగా ఉన్నాయి. అవి ఇప్పటికీ తక్కువ ధరకి ఇస్తున్నాయి. ఇరాన్ అయితే మనకు చాలా కాలంగా చాలా తక్కువ ధరకి ఇచ్చింది. అవి కొనకుండా ఎక్కువ ధర ఇచ్చి అమెరి కా నుంచి కొనబోతున్నాం మనం. ఇప్పటికే కొంటూ ఉన్నాం. కొంత భాగం ఇంకా కొనబోతున్నాం రాబోయే ఐదేళ్లలో చచ్చినట్టు కొని తీరాల్సిందే. ఒప్పందం చేసు కొని వచ్చాం. అది బయట పెట్టట్లేదు. ఇవాళ అమెరికా బయట పెట్టింది.తక్కువ ధరకు ఇచ్చేది పక్కన పెట్టేసి ఎక్కువ ధరకు ఇచ్చేదాన్ని మనం కొనబోతున్నా.

**ఇవి మన దగ్గర పండవా..?**

గోధుమలు, మక్కజొన్న, సోయాబీన్,పప్పులు, ఆపిల్, బాదాం,ఇటువంటివి మనం అమెరికా నుంచి దిగుమతి చేసుకోబోతున్నాం. ఇవి మన దగ్గర ఉండవా, పండిస్తున్న రైతులు పరిస్థితి ఏంటీ? ఇదీ అసలు సమస్య. అమెరికా నుంచి మన మార్కెట్లోకి దిగుమతి అయ్యే వాటితో ఇక్కడ రైతులు పోటీ పడగలుగుతారా లేదా అనేది మరొక పెద్ద సమస్య. డైరీ ప్రొడక్ట్ , పౌల్ట్రీ ఇవి కూడా మన మార్కెట్‌లోకి ప్రవేశించబోతున్నాయి. అమెరికాలో సబ్సిడీల వల్ల భారీ మెకనైజేషన్ వల్ల చాలా తక్కువ ధరకే వాళ్లు అమ్మగలుగుతారు. అంత తక్కువ ధరకు మన రైతులు అమ్మలేరు. ఎందుకంటే వాళ్ల ఉత్పత్తి ఖర్చులు తక్కువ, మన ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ . దీని వల్ల ఏమవుతుందంటే మక్కజొన్న, గోధుమ, సోయాబీను, పప్పులు, ఆపిల్, బాదం ఇట్లాంటివన్ని కూడా మన దగ్గర పండించే రైతులు అమెరికా వస్తువుల పోటీని తట్టుకోలేరు. దీంతో మనవాళ్లు క్రమక్రమంగా వ్యవసాయం నుంచి దూరమయ్యే పరిస్థితి వస్తుంది. ఒక సంవత్సరం రెండు సంవత్సరాలు కాదు, ఐదు సంవత్సరాలు కంపల్సరీ. ఐదు సంవత్సరాలు తాము పండించిన పంట అమ్ముడు పోకపోతే రైతు ఏం చేస్తాడు. తన వృత్తిని మానేసుకోక తప్పదు. ఇప్పటికే చాలా చోట్ల ఎంఎస్‌పిలు ఇవ్వట్లేదు.అమెరికా ఒత్తిడి వల్ల, ఎంఎస్‌పి ఇవ్వని పరిస్థితుల్లో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులతో పోటీ పడలేరు.రైతులు పోటీ పడలేరు.వాళ్లు పంటలు పండించే పరిస్థితి పోతది, రైతుల ఆత్మహత్యలు మరింత పెరుగుతాయి.

**డైయిరీలు సైతం..**

అమెరికా నుంచి వచ్చే పాలతో పాటు వాటి ఉప్పత్తుల ధరలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో మన పాల ఉత్పత్తిదారులు ఈ పోటీని తట్టుకోలేక బర్రెలను, గేదెలను, ఆవులను పెంచుకోలేరు. డైయిరీలు మూసి వేసుకుంటారు. ఫలితంగా ఈ రంగంపై పత్యక్షంగా పరోక్షంగా ఆధారపడిన దానా సరఫరా దారులు, దానా పండించే వాళ్లు రోడ్డున పడతారు.

**విత్తనాలు సైతం...**

ఈ వాణిజ్య ఒప్పందంలో భాగం విత్తనాలు. ఇప్పటికే మనకు మన దేశంలో విత్తన వ్యాపారం మొత్తం కార్పొరేట్ ఆధిపత్యంతో నడుస్తున్నది. ఎంత దారుణంగా తయారయిందంటే మన వ్యవసాయ పరిస్థితి ఒకప్పుడు వడ్లు పండిస్తే నెక్ట్ మళ్లీ వడ్లు పండించడం కోసం ధాన్యం విత్తనాలు దాచుకునేవాళ్లు. ఇప్పుడు షాప్ కెళ్లి విత్తనాలు కొనుక్కోవడం తప్ప వేరే మార్గం లేదు. ఆ విత్తనాలు ఎవరు తయారు చేస్తారు? అమెరికా వారు తయారు చేస్తారు. ఇప్పుడు ఒప్పందంలో కంపల్సరీ వాటిని కొనా లి. వాణిజ్య ఒప్పదం జరిగిందా లేదా ఇప్పటికీ ప్రభుత్వం చెప్పకపోవచ్చు కానీ అమెరికా స్టేట్ సెక్రటరీ మార్క్ రోబియో స్వయంగా తన ట్విట్టర్ పోస్ట్ ద్వారా చెప్పేసాడు. మన భారతదేశం రాబోయే కాలంలో మరింతగా అమెరికా చేతుల్లోకి పోబోతుంది. ఇప్పటికే మోదీ మన దేశాన్ని తీసుకెళ్లి ట్రంప్ చేతుల్లో పెట్టాడు. ఇక రాబోయే కాలంలో అమెరికాయే మన ఆర్థిక వ్యవస్థను కంట్రోల్ చేస్తుంది. మోదీ ఇటువంటి ఒప్పందాలు ఎందుకు చేసుకున్నాడు అనేది అసలు ప్రశ్న.

# ఫైనల్‌లో గెలిచేదెవరో?

**నేడు ఆర్‌సిబి, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య టైటిల్ పోరు**

ఐపిఎల్ 2026 మెగా ఫైనల్‌కు సమయం ఆసన్నమైంది. నేడు(మే 31) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆర్‌సిబి, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్ 1లో గుజరాత్ టైటాన్స్ జట్టును 92 పరుగుల తేడాతో ఓడించి ఆర్‌సిబి నేరుగా ఫైనల్ చేరగా.. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్2లో రాజస్థాన్ రాయల్స్ జట్టుపై 7 వికెట్ల తేడాతో గెలిచి గుజరాత్ టైటాన్స్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్లు ఆరోన్ ఫించ్, అంబటి రాయుడులతో పాటు లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ డైరెక్టర్ టామ్ మూడీ ఈ తుది పోరులో ఎవరు గెలుస్తారనే దానిపై తమ అంచనాలను పంచుకున్నారు. క్వాలిఫయర్2 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్ టికెట్ సాధించింది. రాజస్థాన్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులు చేసి రాజస్థాన్‌ను 200 పరుగుల మార్కు దాటించినప్పటికీ.. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వీరోచిత సెంచరీ(104), సాయి సుదర్శన్ (58) రాణించడంతో గుజరాత్ చాలా సులువుగా లక్ష్యాన్ని ఛేదించింది. ఐదేళ్ల ఐపిఎల్ చరిత్ర కలిగిన గుజరాత్ ఫ్రాంచైజీకి ఇది మూడో ఫైనల్ కావడం విశేషం. ఈ ఫైనల్ మ్యాచ్‌పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ మాట్లాడుతూ, ఇరు జట్లకు గెలిచే అవకాశాలు



సమానంగా (50–50) ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. గుజరాత్ టైటాన్స్ హోమ్ గ్రౌండ్‌లో ఆడుతుండటం వారికి లభించే అతిపెద్ద అడ్వాంటేజ్ అని, వారి టాపార్డర్ చాలా బలంగా ఉందని చెప్పాడు. అయితే ఆన్ పేపర్ చూస్తే మాత్రం ఆర్‌సిబి అన్ని విభాగాల్లో సమతూకంగా కనిపిస్తోందని, ముఖ్యంగా మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్‌ల ఫామ్ ఆర్‌సిబికి ప్లస్ అవుతుందని ఆరోన్ ఫించ్ విశ్లేషించాడు. టీమిండియా మాజీ ప్లేయర్ అంబటి రాయుడు తనదైన స్టైల్లో చాలా సూటిగా.. ఒక్క ముక్కలో తేల్చేశాడు. అహ్మదాబాద్ పిచ్ స్వభావాన్ని బట్టి విజేత ఎవరనేది మారుతుందని రాయుడు చెప్పాడు. ఫైనల్ మ్యాచ్ జరిగే పిచ్ గనుక 'ఎర్ర నేల' పిచ్ అయితే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలుస్తుందని, ఒకవేళ అది 'నల్ల నేల' పిచ్ అయితే గుజరాత్ టైటాన్స్ విజయం సాధిస్తుంద ని అంబటి రాయుడు జోస్యం చెప్పాడు. మరోవైపు టామ్ మూడీ మాత్రం ఈ ఫైనల్లో బెంగళూరు జట్టుకే స్వల్ప ఆధిక్యం ఉందని ఓటింగ్ వేశాడు. ఆర్‌సిబి సమతూకమైన జట్టు కావడమే కాకుండా, గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు తీవ్రమైన ప్రయాణాల వల్ల అలసిపో యి ఉంటారని మూడీ గుర్తుచేశాడు. గుజరాత్ జట్టు మంగళవారం ధర్మశాలలో, శుక్రవారం ముల్లాన్‌పూర్‌లో మ్యాచ్‌లు ఆడి, ఇప్పుడు ఆదివారం అహ్మదాబాద్‌లో ఫైనల్ ఆడబోతోంద ని.. ఈ నిరంతర ప్రయాణాల ఒత్తిడి వారిపై శారీరకంగా, మానసికంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి ఆర్‌సిబికే గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని మూడీ పేర్కొన్నాడు.

## ఏషియన్ గేమ్స్ రేసు నుంచి వినేశ్ ఔట్

**న్యూఢిల్లీ :** 2026 ఆసియా క్రీడల్లో పాల్గొనాలన్న రెజ్లర్ వినేశ్ ఫోగాట్ ఆశలు ఆవిరయ్యాయి. శనివారం ఏషియన్ గేమ్స్ కోసం జరుగుతోన్న సెలెక్షన్ ట్రయల్స్‌లో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె ఓడిపోయారు. 53 కేజీల విభాగంలో మీనాక్షి గోయత్ చేతిలో 4–6 తేడాతో పరాజయం చవిచూశారు. హోరాహోరీగా సాగిన పోరులో వినేశ్, మీనాక్షి చాలాసేపు పోటీపడ్డారు. చివరికి విజయం మాత్రం మీనాక్షికి దక్కడంతో ఆమె ఫైనల్‌కు చేరుకున్నారు. వినేశ్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడారు. ఆ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతులు పొందారు. ఇక, ట్రయల్స్‌లో ఓటమి అనంతరం వినేశ్



స్పందించారు. 'నేను ఓడిపోలేదు. నేను వ్యవస్థతో పోరాడుతున్నాను. నేను ఒంటరి పోరాటం చేస్తున్నాను. నేను ప్రతిదాని కోసం పోరాడాల్సి వచ్చింది. నాకు న్యాయం జరగలేదు. నేను మళ్లీ తిరిగొస్తా' అని వ్యాఖ్యానించింది. అయితే తర్వాత తన పోటీ ఎక్కడ ఉంటుందో మాత్రం వెల్లడించలేదు. 2018లో జరిగిన ఏషియన్ గేమ్స్ ఆమె బంగారు పతకాన్ని సాధించారు.

## సెమీస్‌లో సాత్విక్–చిరాగ్.. సింధు, లక్ష్యసేన్ ఓటమి

**సింగపూర్ :** సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత జోడీలు సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో సెమీస్ చేరాయి. సింగిల్స్‌లో పీవీ సింధు, లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోయారు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ సాత్విక్‌చిరాగ్ ద్వయం 19–21, 21–17, 21–13తో మలేషియాకు చెందిన కాంగ్ ఖై క్సింగ్‌ఆరోన్ తాయ్‌పై విజయం సాధించింది. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జోడీ తొలి గేమ్‌లో 16–18తో నిలిచిన దశలో ప్రత్యర్థి చెన్ టాంగ్ జీ తొయి వీ (మలేసియా) గాయం కారణంగా తప్పుకోవడంతో భారత జంటకు వాకోవర్ విజయం లభించింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 19–21, 21–15, 15–21 తేడాతో వాతనాబే (జపాన్) చేతిలో ఓడగా.. మహిళల క్వార్టర్స్‌లో సింధు 17–21, 14–21తో ప్రపంచ నం.1 అన్ సే యంగ్ (కొరియా) చేతిలో ఓడింది.

# బిజినెస్

## ఎల్‌ఐసి నుంచి మరో రెండు 'కొత్త పాలసీలు

దేశంలో ఉన్న అనేక బీమా సంస్థలు తన కస్టమర్ల కోసం వివిధ రకాల పాలసీలను ప్రవేశపెడుతుంటాయి. అందులో భాగంగానే ప్రముఖ బీమా రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్‌ఐసి) కూడా సామాన్యులను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు కొత్త కొత్త పథకాలను తీసుకొస్తుంది. ప్రజల నమ్మకాన్ని చూరగొన్న ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసి తాజాగా మరో రెండు కొత్త పాలసీలను తీసుకొచ్చింది. భార్యాభర్తలిద్దరికీ బీమా అందించేలా వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఒకప్పుడు ఇంట్లో పురుషులకు మాత్రమే బీమా పాలసీ తీసుకునేవారు. అయితే, ప్రస్తుతం చాలా ఫ్యామిలీల్లో మహిళలూ కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నారు. అలాంటి సందర్భాల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ భార్యాభర్తలిద్దరూ కలిపి ఒకే పాలసీ తీసుకోవాలని అనుకునే వారి కోసం రెండు సరికొత్త జాయింట్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్‌ను డిజైన్ చేసింది జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసి. అవే, 'న్యూ జీవన్ సాథీ సింగిల్ ప్రీమియం', 'న్యూ జీవన్ సాథీ లిమిటెడ్ ప్రీమియం'. బీమా + పొదుపు మిళితంగా ఎల్‌ఐసి ఆవిష్కరించిన ఈ పాలసీలు జూన్ 1 నుంచి కొనుగోలుకు అందుబాటులోకి రానున్నాయి. ఈ పాలసీలు తీసుకున్నవారికి బీమా హామీతో పాటు కట్టిన డబ్బుకు గ్యారెంటీడ్ అడిషన్ (జిఎ) కింద కొంత మొత్తం అదనంగా చెల్లిస్తారు. అలాగే, వీటిల్లో మెచ్యూరిటీ బెన్‌ఫిట్ కూడా పొందవచ్చు.




## సుకన్య సమృద్ధి స్కీమ్ ద్వారా రూ.50 లక్షలు ఎలా పొందాలి?

కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చింది. అందులో 'సుకన్య సమృద్ధి యోజన' ఒకటి. అత్యధిక వడ్డీ, ఎలాంటి పన్నూ లేని ఈ పథకం ఆడపిల్లల భవిష్యత్ అవసరాల కోసం పెద్ద మొత్తంలో నిధి కూడబెట్టాలనుకునే తల్లిదండ్రులకు ఓ వరం అని చెప్పొచ్చు.



చక్రవడ్డీ ప్రయోజనమే దీనికి కారణం. ఆడపిల్లల సంక్షేమం కోసం 2015లో కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 'బేటీ బచావో.. బేటీ పడావో' ఇనిషియేటివ్‌లో భాగంగా దీనిని ప్రవేశపెట్టింది. ఆడపిల్లలపై చదువులు, వివాహానికి అయ్యే ఖర్చులు తీర్చే ఉద్దేశంతో.. వారి తల్లిదండ్రులు పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించడమే ఈ స్కీమ్ లక్ష్యం. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 10 సంవత్సరాల లోపు వయసు గల బాలికల పేరు మీద ఎప్పుడైనా ఈ స్కీమ్ కింద అకౌంట్ ఓపెన్ చేయవచ్చు. ఒక కుటుంబంలోని ఇద్దరు బాలికలకు ఈ పథకం వర్తిస్తుంది. అయితే ఒకే కాన్పులో ఇద్దరూ లేదా ముగ్గురు పిల్లలు పుట్టినప్పుడు మినహాయింపు లభిస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.250 నుంచి రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టొచ్చు. అకౌంట్ ఓపెన్ చేసినప్పటి నుంచీ 15 ఏళ్ల వరకు డబ్బులు చెల్లించాలి. ఆ తర్వాత ఆరేళ్లపాటు ఎలాంటి డబ్బులు కట్టనవసరం లేదు. కానీ మీరు పెట్టిన పెట్టుబడిపై వడ్డీ వస్తుంది. బాలిక వయసు 18 పూర్తైన తర్వాత ఉన్నత చదువుల కోసం 50 శాతం విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ స్కీమ్‌లో పెట్టుబడులు పెట్టి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత అసలు+ వడ్డీ మొత్తాన్ని తీసుకోవచ్చు. ఎంత పెట్టుబడి పెడితే ఎంత లభిస్తుంది: ఈ పథకంపై ప్రస్తుతం 8.2 శాతం వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎఫ్‌డీ, ఇతర ప్రభుత్వ స్కీమ్స్‌తో పోలిస్తే ఇందులోనే అత్యధిక వడ్డీ లభిస్తోంది. పథకంలో చేరినప్పటి నుంచే ప్రతి సంవత్సరం గరిష్ఠ పరిమితి ప్రకారం రూ.1.50 లక్షలు చొప్పున 15 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేస్తే 21 సంవత్సరాలకు రూ.70 లక్షలు అవుతుంది. ఇందులో కట్టేది కేవలం రూ.22.5 లక్షలు మాత్రమే. మిగిలిన రూ.40 లక్షలు వడ్డీ రూపంలోనే లభిస్తుంది.

### మీ లక్ష్యానికి అనుగుణంగా

ప్రతి సంవత్సరం రూ.లక్షన్నర చెల్లించలేని వారు వీలును బట్టి పెట్టుబడులు చేసుకుంటూ వెళ్లడం మంచిది. నెల లేదా ఏడాదికోసారి ఈ అమౌంట్‌ను అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. భవిష్యత్ అవసరాలకు ఎంత నిధి కావాలో అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టాలి. ఉదాహరణకు మీ పాప పేరు మీద రూ.10 లక్షల నిధి కూడబెట్టాలనుకుంటే మొదటి నుంచే నెలకు రూ.1800 లేదా ఏడాదికి రూ.20వేల చొప్పున ఇన్వెస్ట్ చేయాలి. ఒకవేళ రూ.25 లక్షలు కావాలనుకుంటే నెలకు రూ.4,500 లేదా ఏడాదికి రూ.52 వేలు జమ చేయాలి.

### రూ.50 లక్షలు పొందడం ఎలా

రూ.50 లక్షలు రావాలంటే ప్రస్తుతం ఉన్న 8.2% వడ్డీ రేటు ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు రూ.1 లక్షా 10 వేల వరకు చెల్లించాలి. అంటే నెలకు రూ.9,200చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ స్కీమ్‌లో వడ్డీ రేట్లు అనేవి ప్రతి 3 నెలలకు ఓసారి మారుతుంటాయి. పైన చెప్పిన లెక్కలు మొత్తం ప్రస్తుత వడ్డీ రేటును అనుసరించి లెక్కించినవే. వడ్డీ రేట్లలో మార్పులుంటే లెక్కల్లో మార్పు వస్తుందనే విషయం గమనించాలి.

### కావాల్సిన డాక్యుమెంట్స్

అమ్మాయి బర్త్ సర్టిఫికెట్
తల్లిదండ్రులు/సంరక్షకుల గుర్తింపు కార్డు, పాన్ కార్డు
బాలిక, తల్లిదండ్రుల పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు

### అకౌంట్ ఎలా ఓపెన్ చేయాలి?

ఈ ఖాతాను సమీపంలోని పోస్టాఫీసు లేదా ప్రభుత్వ/ ప్రైవేటు బ్యాంకుల్లో ఓపెన్ చేయవచ్చు. అప్లికేషన్‌తో పాటు కనీస డిపాజిట్ రూ.250 చెల్లించాలి. ఈ పథకంలో పొదుపు చేయడం ద్వారా ప్రతి సంవత్సరం రూ. లక్షన్నర వరకు పన్ను మినహాయింపు పొందొచ్చు.

## మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి కృషి

**యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కోసం జూన్‌లో యాజమాన్యంతో జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో మైనింగ్ స్టాఫ్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కారానికి ఎఐటియుసి కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య వెల్లడించారు. శుక్రవారం రాత్రి గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన రామగుండం రీజియన్ మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో 2016–2017 బ్యాచ్‌కు చెందిన మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ల అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, సింగరేణి వ్యాప్తంగా మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించిన అనంతరం, జూన్‌లో యాజమాన్యంతో జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో అగ్రిమెంట్ చేసుకుంటామని ఆయన తెలిపారు.గత పదేళ్లుగా మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు రాకపోవడంతో చాలా మంది ఆందోళనలో ఉన్నారని, జూన్ సమావేశాల్లో ప్రమోషన్ల విధానం,క్రమశిక్షణ చర్యల వల్ల ఇంక్రిమెంట్లు, పని భారం వంటి అంశాలపై యాజమాన్యంతో చర్చించి పరిష్కారం చేస్తామని సీతారామయ్య అన్నారు. మైనింగ్ స్టాఫ్ నాయకులు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి. రావు, నాయకులు రంగు శ్రీను,గందం సాంబశివరావు, పల్లె క్రాంతి కుమార్, ఎస్. వెంకట్ రెడ్డి,వినయ్,పెర్క మహేందర్, పి. రవితో పాటు రామగుండం రీజియన్‌కు చెందిన మైనింగ్ స్టాఫ్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జూన్ 2న డిపెండెంట్ ఉద్యోగం పొందిన కార్మికులకు నియామక పత్రాలు అందజేయాలి

- కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 2వ వారంలో సమ్మెకు పిలుపు
- కారుణ్య నియామకాలలో పాత విధానాన్ని కొనసాగించాలి
- రూ.56 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి
- 3న అన్ని జిఎం కార్యాలయాల ముందు ధర్నా
- ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున మెడికల్ అన్ ఫిట్ పొందిన 400 మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగ పత్రాలు అందజేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఈ నెల 25న కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో డిప్యూటీ సిఎంతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు రకాల డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచడం జరిగిందని, అందులో ముఖ్యంగా జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో గతంలో డిపెండెంట్ ద్వార ఉద్యోగం పొందిన పిల్లలకు నియామక పత్రాలు అందజేయాలని కోరడం జరిగిందన్నారు. లేదంటే జూన్ 3న అన్ని జిఎం కార్యాలయాల ముందు డిపెండెంట్ కార్మికులతో ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే జూన్ రెండవ వారంలో సమ్మెకు పిలుపునివ్వడం జరుగుతుందని చెప్పారు.అట్లాగే కారుణ్య నియామకాలను పాత విధానంలో కొనసాగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. కార్మికుల సొంతింటి పథకం అమలు, మారుపేరు సమస్యను ఉపముఖ్యమంత్రికి వివరించడం జరిగిందని, 1982–83లో కొంతమంది ఉద్యోగులను ఎంప్లాయ్మెంట్ కార్డు మీద మారుపేరులతో ఉద్యోగం పొందడం జరిగిందని ప్రస్తుతం వారి యొక్క మారుపేరు సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరడం జరిగిందని అయన స్పష్టం చేశారు. పెరుక్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలని, సింగరేణికి ప్రభుత్వం చెల్లించవలసిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. గతంలో గోల్డెన్ స్కీమ్ ద్వారా రిటైర్మెంట్ పొందిన కార్మికులకు వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ వస్తుందని వారికి ప్రభుత్వం ఆసరా పింఛన్, ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని యాజమాన్యాన్ని కోరడం జరిగిందన్నారు.
అనేకసార్లు గుర్తింపు సంఘంగా కార్మిక సమస్యలపై ప్రభుత్వం, యాజమాన్యానికి వివరించిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం జాప్యం జరుగుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని లేదంటే దశల వారి ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రాజ్ కుమార్ హెచ్చరించారు. జూన్ 3న జరిగే జిఎం కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి డిపెండెంట్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల ని ఈ సందర్భంగా ఆయన కార్మికులకు పిలుపునిచ్చా రు. ఈ సమావేశంలో ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురుజేపెల్లి సుధాకర్ రెడ్డి, ఆసిఫ్ పాషా, తోట రామ్ చందర్, రవి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచి, పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం కుత్బుల్లాపూర్ జోన్ కార్యాలయం ముందు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హై స్కిల్డ్ కార్మికులకు రూ.39వేలు వేతనం చెల్లించాలని కోరారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం అయిన మున్సిపాలిటీల కార్మికులకు జిహెచ్‌ఎంసి కార్మికులతో సమాన వేతనాలు, ఒకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2016లో ఇచ్చిన హామీ మేరకు క్యాజువల్ లీవులు, జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేసియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో జిల్లా మున్సిపల్ సంఘం గౌరవ అధ్యక్షుడు డి.రాములు, హరినాథ్‌రావు, బాబు, యాదయ్య, దస్తగిరి, ప్రకాష్, కమలమ్మ, నీలమ్మ, హసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.




## ఎంజి నరేగా పునరుద్ధరణ కోసం దేశ వ్యాప్త పోరాట కార్యాచరణ

**బికెఎంయు జాతీయ సమితి సమావేశాలలో వెంకట్రాములు పిలుపు**

**ఒంగోలు:** దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని కోట్లాది మంది శ్రమజీవులైన వ్యవసాయ కార్మికులకు ఉపాధి కలిగించేందుకు యుపిఎ ప్రభుత్వ హయాంలో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబిజి రామ్ జి తెచ్చి పేదల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని, వెంటనే దాన్ని రద్దుచేసి ఎం జి నరేగాను పునరుద్ధరించాలని దేశ వ్యాప్తంగా పోరాటాలు నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో మూడు రోజులపాటు జరుగుతున్న ఈ సమావేశాలకు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ సమితి సమావేశాలకు జాతీయ అధ్యక్షుడు పెరిన్ స్వామి అధ్యక్షత వహించగా శనివారం వెంకట్రాములు ప్రసంగిస్తూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరించి అమలు జరపాలని, సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు రూ.700లు ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీసం మౌలిక సదుపాయాలు కలిగించాలని, భూమి సమస్య, సాంఘిక సమానత్వం తదితర సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి బడుగు బలహీన వర్గాలపై, మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు వ్యవసా య కార్మికులకు చేసిన వాగ్దానాలను రెండున్నర సంవత్సరాలైనా అమలుకు నోచుకోలేదన్నారు. ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి సంవత్సరానికి రూ.12000 ఇస్తామని, ప్రతి మహిళకు నెలకు రూ.2500, సామాజిక ఫ్లి నెలకు రూ.4000, వికలాంగులకు రూ.6000 పెన్షన్, చేతి వృత్తి దారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామన్న వాగ్దానాలు అమలు జరపాలని, అర్హులైన వారందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాల నిర్మాణం కోసం, కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు నిర్వహిస్తున్నదని, వాటన్నింటినీ సాధించే వరకు అంకితభావంతో పోరాటాలు నిర్వహిస్తామని వెంకట్రాములు తెలియజేశారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, జాతీయ నాయకులు వీ.ఎస్.నిర్మల్ ,జానకి పాశ్వాన్, ఆవుల శేఖర్, తెలంగాణ నుండి జాతీయ సమితి సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, అక్కపెల్లి బాపు, తోటపల్లి శంకర్, సిలువేరు విజయ, దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన సమితి సభ్యులు,ఆహ్వానితులు పాల్గొన్నారు.




## కళ్లాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి గోదాంలకు తరలించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి**




**ప్రజాపక్షం/ జనగామ :** జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి గోదాంలకు తరలించాలని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో కావటి యాదగిరి అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ నేటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదని, పెద్ద ఎత్తున కల్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి గోదాంలకు తరలించి రైతులకు ఊరట కల్పించాలని, వారు దుక్కులు దున్ని వానాకాలం పంటకు సిద్ధం అయ్యే వెసులుబాటు కల్పించాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం మూలంగానే భారీగా ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని, ప్రభుత్వం ఐకెపి, పిఎసిఎస్ ద్వారా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గోనెసంచులు అందించే విషయంలో, తూకం వేసే విషయంలో సరుకు తరలించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. సకాలంలో గోనె సంచులు అందించి కొనుగోలు చేస్తే సమస్య ఉండేది కాదన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు ఇప్పటికి డబ్బులు ఇవ్వడం లేదన్నారు. జనగామ కలెక్టర్ వెంటనే స్పందించి, అధికారులతో సమీక్షించి కళ్లాల్లో ఉన్న సరుకు పూర్తి స్థాయిలో ఖాళీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, రైతులు తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అన్ని విషయాలు సమీక్షించి వెంటనే రైతు బరోసా డబ్బులు విడుదల చేసి వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు చొప్పరి సోమయ్య, జువారి రమేష్, రావుల సదానందం, మోటే శ్రీశైలం, చామకూర యాకుబ్, తోట రమేష్, ఎండి యూనస్, పండగ నిర్మల, విజయ, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతు వ్యతిరేక నియంత్రణ ఉత్తర్వు

## ఉపసంహరణ ఎఐకెఎస్ చారిత్రక విజయం

### మళ్ళీ అవే నిబంధనలు తెస్తే దేశవ్యాప్త ఆందోళన
### రాజన్ క్షీరసాగర్,రావుల వెంకయ్య తీవ్ర హెచ్చరిక

**న్యూఢిల్లీ:** చెరకు రైతుల వ్యతిరేక నియంత్రణ ఉత్తర్వు–2026ను కేంద్ర ప్రభుత్వం ఆకస్మికంగా ఉపసంహరించుకోవడంఅఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) సాధించిన చారిత్రక విజయంగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిల్లు యజమానులకు అనుకూలంగా రైతులను శాశ్వతస్థాయిలో దోపిడీ చేసేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన ఈ ముసాయిదా ఉత్తర్వు జారీ చేసిన మొదటి రోజు నుండీ ఎఐకెఎస్ తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమం ప్రారంభించిందని, రైతులకు అనుకూలంగా ప్రభుత్వంపై ఈ ఒత్తిడి తీసుకురాకపోయి ఉంటే కేంద్రం ఈ ఉత్తర్వును రద్దు చేసి ఉండేదేకాదని, ఈ ఉత్తర్వు ఉపసంహరణ కోసం ఎఐకెఎస్ ఎంతో గొప్ప కృషి చేసిందని, ఈ ఉపసంహరణ ఘనత ఎఐకెఎస్‌కే దక్కుతుందని వారు పేర్కొన్నారు. ఐతే కేంద్ర ప్రభుత్వం ఈ ముసాయిదా ఉత్తర్వును ఉపసంహరించుకున్నంత మాత్రాన పోరాటం ముగిసిపోలేదని, ప్రభుత్వం మళ్ళీ చెరకు రైతులను దోపిడీ చేసేందుకు తిరిగి అవే నిబంధనలను మరోరూపంలో ఉత్తర్వుల ద్వారా జారీ చేసే అవకాశం ఉందని దేశంలో చెరకు రైతులకు హెచ్చరిక చేసింది. ప్రభుత్వం గనుక మరోసారి రైతులను దగా చేసేందుకు రద్దు చేసిన ముసాయిదా ఉత్తర్వులోని నిబంధనలను తిరిగి జారీ చేస్తే దేశవ్యాప్తంగా రైతులు భారీస్థాయిలో ఆందోళన చేపడతారని కూడా హెచ్చరించింది. ఈ మేరకు రైతులు అప్రమత్తంగా ఉంటూ ఆందోళనకు సిద్ధంగా ఉండాలని రాజన్ క్షీరసాగర్,రావుల వెంకయ్య తమ ప్రకటనలో పిలుపు ఇచ్చారు. ఈ రైతు వ్యతిరేక ముసాయిదా ఉత్తర్వును పూర్తిస్థాయిలో రద్దుచేయాలని, ఇందులో ఏ అంశాన్ని తిరిగి కొత్త ఉత్తర్వులలో మోసపూరితంగా జోడించకూడదని కోరారు. ప్రభుత్వం తన ప్రతిష్టను,ముఖవిలువను కాపాడుకోవడానికి చేసే ఎత్తుగడగా ఈ ఉత్తర్వు ఉపసంహరణను ఉపయోగిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ గడచిన ఐదు వారాలుగా అఖిలభారత కిసాన్ సభ ఉత్తర ప్రదేశ్,తమిళనాడు,బీహార్,హర్యానా,ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలోని అనేక ప్రాంతాలలో సదస్సులు, నిరసన ప్రదర్శనలు, రైతు సమావేశాలు నిర్వహించిందని, ఈ సమావేశాలు,నిరసన ప్రదర్శనలలో వేలాదిమంది రైతులు పాల్గొని తమ ఆవేదనను, వ్యతిరేకతను తెలియజేశారని, ఈ విధంగా ఈ ఉత్తర్వుకు వ్యతిరేకంగా స్పందించి ప్రతిఘటించిన మొదటి రాజకీయ,రైతు సంఘంగా తాము చేపట్టిన నిరసనల కారణంగానే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చిందని గుర్తుచేశారు.
చెరకు మిల్లుల యజమానులు రైతులకు న్యాయబద్ధమైన,గిట్టుబాటు ధరలు (ఎఫ్ఆర్‌పి) ఉద్దేశించిన 1966 నాటి ఉత్తర్వులు ఇంకా ఉన్నాయని, ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా రైతులను దోపిడీ చేసేందుకు ప్రయత్నం చేస్తే సహించేదిలేదని, రైతులకు అనుకూలంగా, రైతుమిత్ర ఉత్తర్వులు సాధించే వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని వారు హెచ్చరించారు. కుటుంబ సమేతంగా పొలంలో రైతు చేసే కష్టంతో సహా అన్ని ఖర్చులతోపాటు అదనంగా క్వింటాలుకు కనీసం రూ.411 లు అంటే మొత్తం యాభైశాతం జతచేసిన న్యాయబద్ధమైన,చట్టబద్ధమైన గిట్టుబాటు ధర (ఎఫ్ఆర్‌పి) సి–2ను స్వామినాథన్ ఫార్ములా ప్రకారం చక్కెర మిల్లులు రైతులకు చెల్లించాలని, చక్కెర,ఇథనాల్,ఇథనాల్,జీవ ఎరువులు,అన్ని ఉప ఉత్పత్తుల నుండి 75శాతం మేరకు తప్పనిసరి ఆదాయ భాగస్వామ్యం ఇవ్వాలని, చక్కెర మిల్లుకు–చక్కెర మిల్లుకు మధ్య ఉన్న దూరాన్ని 15 కిలోమీటర్లు, అంతకంటే తక్కువస్థాయికి తగ్గించాలని, రైతులకు చేయాల్సిన చెల్లింపులను 14 రోజుల లోపే ఇవ్వాలని, అంతకంటే ఎక్కువ ఆలస్యమైతే క్రిమినల్ శిక్షలు విధించే చర్యలు తీసుకోవాలని అఖిల భారత కిసాన్‌సభ డిమాండ్ చేసింది. చెరకు నాణ్యత, రికవరీ పరీక్షల నిమిత్తం మూడోపక్షం భాగస్వామ్యాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, మూడోపక్షం జోక్యం,భాగస్వామ్యం,తనిఖీ లేకపోవడంవల్ల చక్కెర మిల్లులు ఇష్టానుసారంగా రైతులను దోపిడీచేస్తున్నాయని హెచ్చరించింది. అన్ని ఖండసారీ చక్కెర మిల్లులు, ఇథనాల్ ఉత్పత్తి చేసే మిల్లులను కూడా రైతులకు న్యాయబద్ధమైన, గిట్టుబాటు ధర చెల్లించే నిబంధనల పరిధిలోకి తీసుకురావాలని ఎఐకెఎస్ నాయకులు డిమాండ్.

## ముష్కిన్ చెరువు కబ్జాలకు
# 'హైడ్రా' ముకుతాడు

రూ.5,500 కోట్ల విలువైన భూమికి రక్షణ
అభివృద్ధి పేరిట సాగిన భూకబ్జాకు చెక్
పేదల పేరుతో భూకబ్జాలకు యత్నం
ఎఫ్‌టిఎల్ పరిధిలో భారీగా ఆక్రమణల తొలగింపు
ప్రజావాణి ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

ప్రజాపక్షం/హైదరాబాద్

చెరువుల ఆక్రమణలపై కఠిన వైఖరి అవలంబిస్తున్న హైడ్రా శనివారం మరో భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పలగూడ – నార్సింగ్ గ్రామాల పరిధిలో ఉన్న ముష్కిన్ చెరువులో ఎఫ్‌టిఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో జరిగిన ఆక్రమణలను తొలగించింది. చెరువు అభివృద్ధి పేరుతో భూముల స్వరూపాన్ని మార్చి నిర్మాణాలకు సిద్ధం చేస్తున్న చర్యలను గుర్తించిన హైడ్రా, సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో చెరువు హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అధికారుల అంచనా ప్రకారం, ఈ చర్యతో సుమారు 35.10 ఎకరాల ఎఫ్‌టిఎల్ భూమిని రక్షించడంతో పాటు రూ.5,500 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని కాపాడినట్లు అధికారులు భావిస్తున్నారు.
ప్రజావాణి ఫిర్యాదుతో వెలుగులోకి..
ముష్కిన్ చెరువులో మట్టిని నింపుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సిఎస్ఆర్) నిధులతో చెరువు అభివృద్ధి చేపడుతున్న పేరుతో చెరువు పరిధిని కుదించి ఆక్రమణలకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. చెరువు మధ్యలో కట్ట నిర్మించి ఎగువ ప్రాంతంలోని భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా చెత్తను సేకరించి వేరు చేసే ప్రక్రియలో వ్యర్థాలను చెరువులోకి వదలడం వల్ల చెరువు కలుషితమవుతోందని, పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు.

**విచారణలో వెలుగుచూసిన వివరాలు..**

ఫిర్యాదులపై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. గ్రామ రికార్డుల ప్రకారం ముష్కిన్ చెరువు విస్తీర్ణం 59.11 ఎకరాలు కాగా, హెచ్ఎండిఏ లెక్కల ప్రకారం ఎఫ్‌టిఎల్ పరిధి 52.20 ఎకరాలుగా నిర్ధారించారు. అలాగే సర్వే నంబర్ 259లో ప్రభుత్వానికి చెందిన 20.23 ఎకరాల శిఖం భూమి ఉన్నట్లు గుర్తించారు. చెరువు మొత్తం ఎఫ్‌టిఎల్ పరిధిని పరిరక్షించే లక్ష్యంతో హైడ్రా శనివారం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ పనులను పూర్తి చేసింది.




**పేదల పేరుతో భూకబ్జాలకు అడ్డుకట్ట..**

పేదల పేరుతో గుడిసెలు ఏర్పాటు చేసి భూములను ఆక్రమించేందుకు రియల్టర్లు ప్రయత్నిస్తున్నట్లు హైడ్రా గుర్తించింది. అక్కడ నివసిస్తున్న వారికి వాస్తవ పరిస్థితిని వివరించి, ఆక్రమణదారులు వారిని పావులుగా ఉపయోగిస్తున్నారని అవగాహన కల్పించింది. గత ఏడాది కాలంగా పరిస్థితిని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఖాళీ చేసేందుకు తగిన సమయం ఇచ్చారు. రెండు దఫాలుగా చర్చలు జరిపి రెండు నెలల గడువు కూడా కల్పించారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లగా, శనివారం ఉదయం మరికొందరు కూడా ప్రాంతాన్ని విడిచిపెట్టారు. అనంతరం హైడ్రా అధికారులు సుమారు 40 నుంచి 50 గుడిసెలతో పాటు చెత్త వేరు చేసే షెడ్‌లను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

**హైడ్రా చర్యలపై స్థానికుల హర్షం..**

ముష్కిన్ చెరువును ఆక్రమణల నుంచి కాపాడిన హైడ్రా చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. చెరువును పరిరక్షించాలంటూ వివిధ శాఖలకు వినతిపత్రాలు సమర్పించడం, సంతకాల సేకరణతో చేపట్టిన ఉద్యమం ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఐటి కారిడార్‌కు సమీపంలో ఉండి వేలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తున్న ఈ చెరువును రక్షించడంలో హైడ్రా చూపిన చొరవను ప్రశంసించారు. చెరువులో అక్రమంగా పోసిన మట్టిని కూడా పూర్తిగా తొలగించి, దీనిని ఆదర్శవంతమైన జలాశయంగా అభివృద్ధి చేయాలని




స్థానికులు కోరుతున్నారు.

**సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలు..**

సర్వే నెంబర్ 259 – 20.23 ఎకరాలు (ప్రభుత్వ శిఖం భూమి)
సర్వే నెంబర్ 258 – 13.34 ఎకరాలు (ఎఫ్‌టిఎల్ పరిధి)
సర్వే నెంబర్ 260 – 8.19 ఎకరాలు (ఎఫ్‌టిఎల్ పరిధి)
సర్వే నెంబర్ 376 – 12.80 ఎకరాలు (ఎఫ్‌టిఎల్ పరిధి)
సర్వే నెంబర్ 379 – 29 గుంటలు (ఎఫ్‌టిఎల్ పరిధి).



## ఎంతో మంది త్యాగధనులను అందించిన ఘనచరిత్ర ఎఐఎస్‌ఎఫ్ ది

### ''ఎగసిన ఉద్యమ తరంగం ఎఐఎస్ఎఫ్ '' పుస్తకావిష్కరణలో పలువురు నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంతో మంది త్యాగధనులను ఈ దేశానికి అందించిన గొప్ప చరిత్ర అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్)దని పలువురు వ్యక్తులు అన్నారు. విద్యార్థుల హక్కుల కోసం తృణ ప్రాయంగా తమ ప్రాణాలను అర్పించినఆ త్యాగధనుల విలువలను, వారి ఆలోచనలను, సత్యం పట్ల వారికి ఉన్న నిబద్ధత తరతరాలకు అందించాల్సి అవసరముందని పేర్కొన్నారు. శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పి.శ్రీనివాస్ నాయుడు తన దశాబ్ద కాల స్వీయ అనుభావాలతో రాసిన ''ఎగసిన ఉద్యమ తరంగం ఎఐఎస్ఎఫ్ '' అనే పుస్తకాన్ని సభ జరిగింది. ఈ పుస్తకాన్ని కేరళం సిపిఐ కార్యదర్శి, మాజీ మంత్రి బినయ్ విశ్వం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ల పల్లి శ్రీనివాస్ రావు, సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ సీనియర్ నాయకులు కందిమల్ల ప్రతాపరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపి బి.వినోద్ కుమార్,ఎఐటియుసి సీనియర్ నాయకురాలు బి.వి.విజయలక్ష్మి ,ఎఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల వలరాజు, ప్రధాన కార్యదర్శి నాసర్జీ పుస్తక రచయిత పి. శ్రీనివాసు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బినయ్ విశ్వం మాట్లాడుతూ ఈ దేశంలో విద్య, జ్ఞానం కంటే డబ్బుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని, ఇది మన పూర్వీకులు పోరాడిన భారతదేశం కాదనిఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, జ్ఞానం వంటి విలువలే మన భవిష్యత్తుకు పునాది అని ఆ విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎఐఎస్ఎఫ్ విలువలు తరతరాలకు కొనసాగుతాయని విశ్వసిస్తున్నన్నారు. వివిధ ప్రాంతాల నుంచి, వివిధ వృత్తుల నుంచి వచ్చిన మనమందరినీ ఒకే బంధం కలుపుతోందని, అది ఎఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ1936 ఆగస్టులో ఆవిర్భావించిన ఎఐఎస్ఎఫ్ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమేకాకుండా ఎంతో మంది గొప్ప గొప్ప వ్యక్తులను అందించిన ఘన చరిత్ర ఉందన్నారు. విద్యా వ్యవస్థ, విద్యార్థి సంఘాలు ప్రగతిశీలంగా ఉన్నప్పుడే దేశంలో మేధావంతులతో కూడిన దేశంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అయితే పాలకులు విద్యార్థి సంఘాలను ఎన్నికలు నిర్వహించకుండా కుట్రలు పన్నారని విమర్శించారు.
గతంలో తరహాలో మిలిటెండ్ ఉద్యమాలకు సిపిఐ సన్నద్ధం అవుతోందని పేర్కొన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పుస్తక రచయిత శ్రీనివాస్ నాయుడు అనంతపురం జిల్లా నుంచి విద్యార్థి నాయకుడుగా వచ్చి రంగరెడ్డి జిల్లాలో రాజకీయ నాయకుడికి ఎదిగరని పేర్కొన్నారు. ఉద్యమం ఎక్కడా ప్రారంభించాలో, దానిని ఎప్పుడు ముగించాలో బాగా తెలిసిన నాయకుడని ప్రశంసించారు. బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు కొత్త రకం సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి ప్రగతిశీల భావాలు కల్గిన నేతలందరూ ఆలోచనలు చేయాల్సి అవసరముందని పేర్కొన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ ఎంతో మంది నాయకులకు భవిష్యత్తును ఇచ్చిందన్నారు. పుస్తక రచయిత శ్రీనివాస్ నాయుడు గాని, తను కానిరోజు ఈ స్థాయిలో ఉండడానికి ఎఐఎస్ఎఫ్ అని తెలిపారు. అజీజ్ పాషా మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ కోసం ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. నాడు ఎఐఎస్ఎఫ్ నాయకులు చేసిన పోరాటాలను ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పాల్గొన్నారు.

## ఎడ్‌సెట్ -2026 ఫలితాలు విడుదల

### 96.95 శాతం ఉత్తీర్ణత
### తొలి ర్యాంకు బానోత్ అజిత్ సాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఎడ్‌సెట్ 2026 ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్రెడ్డి శనివారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీక్షకు 35,600 మంది దరఖాస్తు చేసుకోగా 29,342 మంది హాజరయ్యారు. వీరిలో 28,446 మంది అర్హత సాధించారు. కొత్తగూడెంకు చెందిన బానోత్ అజిత్ సాయి 124.651311 మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించారు. తొలి పది ర్యాంకులన్ని పురుష అభ్యర్థులే కైవసం చేసుకోవడం విశేషం. పురుషుల ఉత్తీర్ణత శాతం 98.85గా నమోదైంది. హాజరైన 4,858 మందిలో 4,802 మంది అర్హత సాధించారు. మహిళల్లో 24,482 మంది హాజరు కాగా 23,642 మంది ఉత్తీర్ణులై 96.57 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. పరీక్షకు హాజరైన ఇద్దరు ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు కూడా అర్హత సాధించారు. ఎస్‌సి, ఎస్‌టి విభాగాల్లో పురుషులు, మహిళలు, బిసిసి విభాగంలో పురుషులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, మైనారిటీల్లో సిక్కులు, ఇతర మైనారిటీ వర్గాల అభ్యర్థులు కూడా శాతం వంద ఫలితాన్ని నమోదు చేశారు. తెలంగాణకు చెందిన స్థానిక అభ్యర్థుల్లో 96.93 శాతం, అన్‌రిజర్వ్‌డ్ విభాగంలో 97.90 శాతం మంది అర్హత సాధించారు. మే 12న రాష్ట్రంలోని 16 ప్రాంతీయ కేంద్రాల పరిధిలోని 59 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్‌లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు.

## ఓపెన్ ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాలు విడుదల

### పదో తరగతిలో 72 శాతం, ఇంటర్‌లో 68.70 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించిన ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ శనివారం విడుదల చేశారు. పదో తరగతి పరీక్షలకు 36,863 మంది హాజరుకాగా 26,542 మంది ఉత్తీర్ణులై 72 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఇంటర్మీడియట్‌లో 54,679 మంది హాజరుకాగా 37,562 మంది ఉత్తీర్ణులై 68.70 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో పురుషుల ఉత్తీర్ణత 66.41 శాతం, మహిళల ఉత్తీర్ణత 77.88 శాతంగా నమోదైంది. ఇంటర్మీడియట్‌లో పురుషులు 63.90 శాతం, మహిళలు 73.76 శాతం ఉత్తీర్ణులయ్యారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే పదో తరగతిలో 94.63 శాతం ఉత్తీర్ణతతో వనపర్తి జిల్లా అగ్రస్థానంలో నిలవగా, 13.93 శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా చివరి స్థానంలో నిలిచింది. ఇంటర్మీడియట్లో 81.61 శాతంతో యాదాద్రిభువనగిరి జిల్లా మొదటి స్థానంలో నిలవగా, 47.44 శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా చివరి స్థానంలో నిలిచింది. అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. జూన్ 4 నుంచి మార్కుల మెమోలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జూన్ 2 నుంచి 7 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు.

## దోస్త్ రెండో దశలో 52,302 మందికి సీట్ల కేటాయింపు

### ఫేజ్-3 నమోదు మే 31 నుంచి ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్2026 రెండో దశ సీట్ల కేటాయింపు ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కళాశాల విద్యా శాఖ కమిషనర్ శనివారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా మూడో దశ (ఫేజ్3) షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. రెండో దశలో మొత్తం 60,439 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమో దు చేసుకోగా, 52,302 మందికి సీట్లు కేటాయించారు. వీరిలో 31,445 మంది మొదటి ప్రాధాన్యత ఆధారంగా సీట్లు పొందగా, మరో 20,857 మంది రెండో, ఇతర ప్రాధాన్యతల ద్వారా సీట్లు పొందారు. ఫ్యాకల్టీ వారీగా చూస్తే కామర్స్‌లో అత్యధికంగా 21,431 మంది, ఫిజికల్ సైన్సెస్‌లో 15,245 మంది, లైఫ్ సైన్సెస్‌లో 9,664 మంది, ఆర్ట్స్‌లో 5,955 మంది, ఇతర కోర్సుల్లో ఏడుగురికి సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థులు తమ అవసరాన్ని బట్టి రూ.500 లేదా రూ.1,000 చెల్లించి మే 31 నుంచి జూన్ 5 వరకు ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసి సీటును రిజర్వ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయ కళాశాలలకు కేటాయింపులు పొందిన ఈపాస్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఫేజ్3 రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్‌ల నమోదు మే 31 నుంచి జూన్ 16 వరకు కొనసాగుతాయని, జూన్ 20న సీట్ల కేటాయింపు చేపడతామని వెల్లడించారు.

## మీనాక్షి నటరాజన్‌తో భేటీకి రాజకీయ ప్రాధాన్యత లేదు : జగ్గారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో జరిగిన సమావేశంపై వస్తున్న ఊహాగానాలకు కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి క్లారిటీ ఇచ్చారు. దాదాపు ఆరు నుంచి ఏడు నెలల తర్వాత మర్యాదపూర్వకంగానే ఆమెను కలిశానని, ఈ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు. తానే స్వయంగా అపాయింట్‌మెంట్ కోరగా సమయం ఇచ్చారని, సుమారు పది నిమిషాల పాటు మాత్రమే సమావేశం జరిగిందన్నారు. ఎలాంటి ఫిర్యాదులు చేయడానికి గానీ, నిర్ణయాల కోసం గానీ వెళ్లలేదని తెలిపారు. పార్టీ గ్రామ స్థాయి నుంచి హైదరాబాద్ వరకు నాయకులు, కార్యకర్తలందరినీ ఒకే టీమ్‌గా సమన్వయం చేయాల్సిన అవసరంపై చర్చించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు చేపడుతున్న కార్యక్రమాలకు మరింత బలం చేకూర్చేలా పని చేయాలని సూచించినట్లు తెలిపారు. రాబోయే ఆరు నెలల నుంచి ఏడాది కాలం పార్టీకి కీలకమని, ఎన్నికల సమయం దగ్గరపడుతున్నందున ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పార్టీలో ఇంకా గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలు, నాయకులను వ్యవస్థలో కలుపుకుపోవాల్సిన అవసరం ఉందని మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయితే ఎవరిపైనా వ్యక్తిగత ఫిర్యాదులు చేయలేదని, ఎలాంటి పేర్లు కూడా ప్రస్తావించలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చర్చలు, విభేదాలు, భిన్నాభిప్రాయాలు సహజమని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, తమ వర్గాల ప్రతినిధిత్వం కోసం నాయకులు మాట్లాడటం కాంగ్రెస్ పార్టీ సంస్కృతిలో భాగమని చెప్పారు. తన భేటీకి అనవసర రాజకీయ అర్థాలు తీయవద్దని మీడియాకు సూచించారు.

## తెలంగాణ పోలీసు శాఖలో భారీ సంస్కరణలకు శ్రీకారం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిజిపి సివి ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అత్యున్నత స్థాయి బాధ్యతాయుత సేవలు అందించాలంటే పోలీసింగ్ విధానాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎఫెక్టివ్ పోలీసింగ్ స్టాండర్డ్స్ అమలు అంశంపై రాష్ట్రవ్యాప్తంగా కమిషనర్లు,ఎస్‌పిలు,డిఎస్‌పిలు, ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు, కమాండెంట్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మారుతున్న సామాజిక పరిస్థితులు, కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖ పనితీరు మారాలని ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు డిజిపి తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, క్రమశిక్షణ లోపాలు, అవినీతి వంటి ప్రతికూల ధోరణులను అరికట్టాలని సూచించారు. పాత విధానాలను విడిచిపెట్టి ప్రజా సేవల్లో గణనీయమైన మార్పు తీసుకురావాలని అధికారులకు పిలుపునిచ్చారు. గత మూడు దశాబ్దాలుగా మావోయిస్టు, నక్సలిజం నిర్మూలనపై పోలీసు శాఖ దృష్టి కేంద్రీకృతమైందని, అయితే గత 15 ఏళ్లుగా నక్సల్ ప్రభావం గణనీయంగా తగ్గిపోయిన నేపథ్యంలో గ్రేహౌండ్స్, ఎస్ఐడీ వంటి ప్రత్యేక విభాగాల అవసరాన్ని పునఃసమీక్షించి పునర్వ్యవస్థీకరణపై ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి అధికారి చురుకుగా పనిచేయాలని డిజిపి ఆదేశించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత ప్రమాణాలను మెరుగుపరచేందుకు త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆహార కల్తీ నివారణ కోసం ప్రత్యేక ఫుడ్ అడల్టరేషన్ వింగ్, ప్రభుత్వ ఆదాయాలకు జరిగే లీకేజీల నియంత్రణ కోసం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల భద్రత, చిన్నారుల అక్రమ రవాణా నివారణ అంశాల్లో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేసిన డిజిపి, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో సిసిటిఎన్ఎస్ 2.0 అమలు సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, యువ ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక డిజిపి టెక్ టీమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. హాక్ ఐ అల్ట్రా, టిజికాప్ అల్ట్రా వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజా సేవలను మెరుగుపరచనున్నట్లు చెప్పారు. ప్రతి నెల 15వ తేదీకి ముందు క్రైమ్ రివ్యూ సమావేశాలు నిర్వహించి, 20వ తేదీలోగా నివేదికలను డిజిపి కార్యాలయం, సిఐడికి పంపాలని అన్ని యూనిట్ అధికారులను ఆదేశించారు. జిల్లాల పనితీరును పర్యవేక్షించేందుకు నలుగురు ప్రత్యేక డీఐజీలను నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రతి యూనిట్ అధికారి నెలకు కనీసం రెండు సడెన్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించాలని, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పిటిషనర్ల కోసం ప్రత్యేక సమయం కేటాయించాలని అన్ని పోలీసు యూనిట్లకు ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న డిజిపి, పెండింగ్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం సుమారు రూ.6,000 కోట్లలో ఇప్పటికే రూ.2,000 కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన మొత్తాన్ని వచ్చే 100 రోజుల్లో దశలవారీగా విడుదల చేస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో డిజిలు మహేష్‌భగవత్, స్వాతి లక్రా,చారుసిన్హా,వివి శ్రీనివాస్‌తో పాటు ఐజిలు రమేష్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## డిఇఇసెట్-2026 ఫలితాలు విడుదల

### 84.36 శాతం మంది అర్హత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డిఈఈసెట్)2026 ఫలితాలను విడుదల చేసినట్లు సెట్ కన్వీనర్, ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ జి. రమేశ్ తెలిపారు. మొత్తం 25,054 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 21,137 మంది అర్హత సాధించారు. దీంతో మొత్తం ఉత్తీర్ణత శాతం 84.36గా నమోదైంది. పురుష అభ్యర్థుల్లో 90.84 శాతం, మహిళా అభ్యర్థుల్లో 82.92 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మీడియం వారీగా పరిశీలిస్తే ఇంగ్లీష్ మీడియంలో అత్యధికంగా 88.69 శాతం, తెలుగు మీడియంలో 82.37 శాతం, ఉర్దూ మీడియంలో 42.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. డిఈఈసెట్ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.



## పలు గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/మోత్కూర్** : మోత్కూరు మండలంలో పలు గ్రామాల్లో హెచ్చరిక బోర్డులను వేయించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుకి వినతి పత్రం అందజేశారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుకి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ వలిగొండ నుండి తిరుమలగిరి ప్రధాన హైవే రోడ్డులో మోత్కూరు మండలానికి సంబంధించిన పలు గ్రామాలు అంటే పాలడుగు, దత్తప్పగూడెం, అనాజిపురం, పాటిమట్ల మెయిన్ రోడ్‌లో ట్రాన్స్పోర్ట్ మరియు గూడ్స్ లారీలు మరియు హెవీ వెహికల్స్ రావడం వలన గ్రామాల్లో ఉన్నటువంటి వ్యక్తులు రోడ్డు క్రాస్ చేసే క్రమంలో హైవే రోడ్డు కావడం వలన వచ్చేటువంటి వెహికల్స్ స్పీడ్‌లో రావడం జరుగుతుంది. అటువంటి గ్రామంలో ప్రజలు మరియు గ్రామస్తులు యాక్సిడెంట్లకు గురవుతూ ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. కావున పాలడుగు, దత్తప్పగూడెం, అనాజిపురం, పాటిమట్ల గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు నాటి ప్రజలను అప్రమత్తం చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నామని అదేవిధంగా మోత్కూర్ నుండి రాయగిరి రోడ్లో రాజన్న గూడెం గ్రామంలో రోడ్డు రిపేర్ ఉన్నందున వచ్చేటువంటి వెహికల్స్ బైక్ పై నుండి కింద పడడం జరుగుతుంది. కావున ఇట్టి విషయాలపై అతి తొందర్లో స్పందించి సంబంధిత అధికారులకు పంపి ప్రజలకు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్టా గౌతమ్, కర్ణాకర్, రమేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వకు బయో డీజిల్ గోదాం

### అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఆదేశాలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : రైతులు విక్రయించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ ఉంచేందుకు ఏర్పాటుచేసిన బయో డీజిల్ గోదామును అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పరిశీలించారు. ధాన్యం నిల్వ సామర్థ్యం, గోదాంలో ఉన్న మౌలిక సదుపాయాలు, భద్రత చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాంలో నిల్వ చేస్తున్న ధాన్యం తేమకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ప్రతి గింజను సక్రమంగా నిలువ చేసి నాణ్యతను కాపాడాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోదాంలో అవసరమైన సౌకర్యాలు కల్పనతో పాటు భద్రత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ధాన్యం నిల్వలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ జుబేరుద్దీన్, జిపిఓ వెంకన్న, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 3న నకిరేకల్‌లో టియుడబ్ల్యుజె మహాసభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్( టియుడబ్ల్యుజె) ఐజేయు అనుబంధ సంఘం జూన్ 3న నకిరేకల్‌లో నిర్వహించే నల్లగొండ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమెల నాగయ్యలు అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్ఎస్పీ అతిథిగృహంలో సంఘం సమావేశం నిర్వహించగా వారు మాట్లాడుతూ జిల్లా మహాసభకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు. మహాసభకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు హక్కుల కోసం టియుడబ్ల్యుజె కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డులు అందిస్తామని ఇందుకోసం టియుడబ్ల్యుజె యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లా మాజీ కార్యదర్శి ఎండి.అస్లాం, సీనియర్ నాయకులు పుప్పాల యాదగిరి, రంగా శ్రీనివాస్, నాగాచారి, బాలాజీ రావు, శ్రీనివాస్, నాగచారి, వెంకన్న, రమేష్, సునీల్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

### దూళిపాళ ధనుంజయనాయుడు




**ప్రజాపక్షం/నేరేడుచర్ల**: కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని బోడల్‌దిన్నె గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర కేవలం 72 రూపాయలు మాత్రమే పెంచడాన్ని నిరసిస్తూ వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జీవో కాపీలను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2026/27 వరి పంటలకు కనీస మద్దతు ధరలను నామమాత్రంగా పెంచి, రైతులకు అవసరమైన అడుగు మందుల రేట్లు, బస్తా ఒక్కింటికి వేయి రూపాయలు పెంచి రైతులను మోసం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల ఎకరాలలో వరి పండకుండా చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఎరువులు, పరుగు మందులు, పెట్రోల్, డీజిల్, విద్యుత్, నీరు వరిసాగు పెట్టుబడి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో తక్షణమే క్వింటా వరి ధాన్యానికి 3500 మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, పరికె భరత్‌కుమార్‌రెడ్డి, రాజసింహరెడ్డి, దుర్గం, కళింగం, రాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జూన్ 2 కల్లా కళ్ళాల్లో ధాన్యం ఖాళీ

### ధాన్యం కొనుగోలు పనుల్లో మరింత వేగం పెంచాలి

### సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులకు హెచ్చరిక



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం నుండి తుర్కపల్లి మండల కేంద్రం వరకు సైకిల్ యాత్ర చేపట్టిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సైకిల్ యాత్ర చేపట్టి తుర్కపల్లి మండలంలో ధాన్యం కేంద్రాలను సందర్శించి, జూన్ రెండు వరకు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను హెచ్చరించారు.జూన్ రెండు తర్వాత ఏ ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు ఉన్న సంబంధిత అధికారులపై వేటు తప్పదని, వెంటనే కొనుగోలు పనులు స్పీడప్ చేయాలని సూచించారు. సైకిల్ యాత్ర చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సైకిల్ యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మండలం పరిధిలోని మల్లాపూర్, దత్తాయిపల్లి, వెంకటాపురం గ్రామాల మీదుగా తుర్కపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. విషయాన్ని పరిశీలించారు. కేంద్రాల్లో వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే హమాలీ కార్మికులను ఇతర ప్రాంతాల నుండి తుర్కపల్లి మండలానికి తరలించి ధాన్యం లోడింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్లైన్కు నాలుగు నుండి ఐదు చోట్ల లీకేజీలు ఉన్న విషయాన్ని గుర్తించారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కతో ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, వృధా అవుతున్న నీటిని అరికట్టేందుకు, వెంటనే మరమ్మతుల పనులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్క తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా పర్యటన సందర్భంగా ప్రజలు తమ గ్రామాలలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## వరి కొయ్యలను కాల్చొద్దు

### పర్యావరణాన్ని పాడు చేయకండి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్** : రైతులు వరి పంట కోసిన తర్వాత పొలంపై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన సూర్యాపేట మండలం కాసారబాద్ గ్రామంలో వరి కొయ్యలను తగలబెట్టవద్దని రైతులకు అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పి కె.నర్సింహాతో కలిసి పాల్గొన్నారు. వరి కొయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. సాంద్రత పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని ఆ భారం కూడా రైతుల పైన పడుతుందని తెలిపారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు, పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి కొయ్యలను తగలబెట్ట వద్దన్నారు. రైతులు వరి కొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకు గానూ వ్యవసాయశాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పి కె.నర్సింహా మాట్లాడుతూ వరి కొయ్యలను పొలంపైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమేకాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు. ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాలు సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎడిఎ జ్ఞానేశ్వరి, ఎఓ కృష్ణ, సందిప్ పాల్గొన్నారు.

## సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తాం : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో వయోవృద్ధులు,దివ్యాంగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రతి నెలా చివరి శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వారి నుంచి సమస్యల పరిష్కారానికి సమర్పించిన దరఖాస్తులను స్వీకరించారు.ఈ ప్రత్యేక ప్రజావాణికి 64 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు హాజరై దరఖాస్తులు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఒక్కో ఫిర్యాదుదారు సమర్పించిన దరఖాస్తులను చదివి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు.పెన్షన్లు, సదరం సర్టిఫికెట్లు, పిల్లలు తల్లిదండ్రులను చూడని కేసులు, భూములు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్,జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ,మునుగోడు సీడీపీవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**పరిశ్రమలు సామాజిక బాధ్యతతో సహకారం అందించాలి**

పరిశ్రమలు సామాజిక బాధ్యతగా ప్రజల సంక్షేమానికి తమవంతు సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.శనివారం వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతకార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.30 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది.ఈ సందర్భంగా వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ తరపున హెచ్ఆర్ హెడ్ మోహన్, ప్లాంట్ హెడ్ కొడాలి అచ్యుత, భాస్కర్ రావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సతీష్ కలిసి, ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధించిన సిఎస్ఆర్ చెక్కును జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా అందజేశారు.

## మూడవ డిస్కం ఏర్పాటు రైతు మెడకు ఉరితాడు

### మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రైతాంగం పాలిట ఉరితాడుగా మారనున్న మూడవ డిస్కం ఏర్పాటును బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఈ విషయంలో రైతుల పక్షాన బిఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్టంలో కెసిఆర్ చేసిన రైతు అనుకూల కార్యక్రమాలు రైతు బంధు, ఉచిత విద్యుత్, ధాన్యానికి ధర ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తుందన్నారు. మూడవ డిస్కం తీసుకొస్తామని ఎలక్ట్రిసిటి రెగ్యులేటరి కమిషన్ ముందు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టక తప్పదనడం రైతులను నిలువున మోసం చేసే ప్రయత్నమే అన్నారు. రైతుల కరెంట్ ఎంత వాడుతున్నారో తెలియడం లేదని, రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం తప్పదని, మూడవ డిస్కం పెడతామనడం సిగ్గుచేటు అన్నారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కెసిఆర్ 24 గంటల రైతుకు ఉచిత కరెంట్ అందజేశారని, రైతుల మోటార్లు మీటర్లు పెడితే నాటి బిజెపి ప్రభుత్వం 30వేల కోట్ల సబ్సీడీ ఇస్తామన్న లొంగలేదన్నారు. నిన్న జరిగిన ఎలక్ట్రిసిటి రెగ్యులేటరి కమిషన్ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని మూడు గంటలు ఉంటే చాలని మాట్లాడటం రైతులను ఆగ్రహానికి గురి చేస్తుందన్నారు. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలకు 54వేల కోట్లరుణం ఉందని అవే కష్ట కష్టంగా నడుస్తున్నాయని అది చాలదు అన్నట్లు కొత్త డిస్కం ఏర్పాటుతో ఉచిత విద్యుత్‌ను రద్దు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయానికి వస్తే 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారంలో కొనుగోలు కేంద్రాలను మూసివేస్తామని అంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు,మాజీ జిల్లా గ్రందాలయ అధ్యక్షులు నిమ్మల శ్రీనివాసగౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఉప్పల అనంద్ పాల్గొన్నారు.

## గరిడేపల్లిలో ప్రభుత్వ ఉద్యోగులు డిష్యుం... డిష్యుం!

### సీనియర్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి మధ్య వివాదం

### సీనియర్ అసిస్టెంట్‌ను వెల్లనివ్వకుండా అడ్డుకున్న కార్యదర్శి

### కార్యదర్శిపై చేయిచేసుకున్న సీనియర్ అసిస్టెంట్

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రమైన గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇద్దరు ఉద్యోగస్తుల మధ్య వివాదం చోటు చేసుకుంది. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉద్యోగిని తన పని చేయకుండా వెళ్లవద్దు అంటూ కారును మండలంలోని గిరిజనతండాలో పనిచేస్తున్న కార్యదర్శి అడ్డుకోవడంతో సదరు కార్యదర్శిని సీనియర్ అసిస్టెంట్ చేయి చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ తీవ్రంగా జరిగింది. అక్కడ ఉన్న సహ ఉద్యోగులు కొంతమంది గొడవను అడ్డుకున్నారు. ఇదంత మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అందరూ చూస్తుండగానే జరిగింది. మండలంలోని ఒక గిరిజన తండాలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి తన సర్వీస్ బుక్‌లో మండలంలో తాళ్లమల్కాపురం గ్రామ పంచాయతీకి సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను, ఎంపిడివో ఇచ్చిన జాయినింగ్ అర్డర్‌ను లక్షతండా జాయినింగ్ అర్డర్‌ను ఎంట్రీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గత మూడు సంవత్సరాల నుంచి నా సర్వీస్ బుక్‌లో ఎంట్రి చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి ఆరోపించారు. సర్వీస్ బుక్‌లో నమోదు చేసేందుకు లంచం అడిగాడని, ఆ డబ్బులు కూడా ఇస్తానని ఒప్పందం చేసుకున్నానని అయినా నా సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా గరిడేపల్లి నుంచి జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో నా సర్వీస్ బుక్ లో వివరాలు నమోదు చేసి వెళ్లాలని సీనియర్ అసిస్టెంట్ వెళ్తున్న కారును మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి అడ్డుకున్నాడు. సర్వీస్ బుక్‌లో వివరాలను నమోదు చేయకుండా ఉంటే భవిష్యత్‌లో ప్రమోషన్లు సీనియారిటి రాదని కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు.



## గిన్నిస్ వరల్డ్ రికార్డు పోటీల్లో ప్రతిభ చాటిన తల్లీ కూతురు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** 22దేశాల నుండి 2వేల మంది కీబోర్డు కళాకారుల ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో జిల్లా కేంద్రానికి చెందిన తల్లి కూతుర్లు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో గల విక్టరీ ఆడిటోరియంలో గిన్నిస్ అచీవర్స్ మీట్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డులో పోటీలు ప్రతిభ కనబర్చిన పట్టణానికి చెందిన ఆదిముల్ల సంధ్య ఆమె చిన్న కూతురు జెస్సికాకు ఆ సంస్థ వ్యవస్థాపకులు ఆగస్టిన్ దండండి చేతుల మీదుగా ప్రశాంస పత్రాలు, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా జెస్సికా, సంధ్యలను పట్టణ ప్రముఖులు, ప్రతి ఒక్కరూ అభినందనలు తెలిపారు.

## వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి : ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/మునుగోడు** : మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి వీరమల్ల సాలమ్మ ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన ఘటన అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సాలమ్మను శనివారం ఆయన పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా వైద్యులతో మాట్లాడిన ఎమ్మెల్సీ బాధితురాలికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు.ప్రమాదంలో గాయపడిన సాలమ్మ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే కార్మికుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పని సమయంలో ప్రమాదాలకు గురైన కార్మికులకు తక్షణ వైద్య సహాయం,నష్టపరిహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

## పెట్రో ధరల పెంపును ఉపసంహరించుకోవాలి



### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :కేంద్ర ప్రభుత్వం రోజు రోజుకు పెంచుతున్న పెట్రోల్,డీజిల్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. సిపిఐ నల్లగొండ పట్టణ సమావేశం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించగా, సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరల వల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతోందన్నారు. అదేవిధంగా నల్లగొండ పట్టణంలో జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నివసిస్తున్న అర్హులైన నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వానికి వినతిపత్రాలు, ధర్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే,జూన్ 2 నుంచి ప్రభుత్వం అందిస్తామన్న ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోసిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి,సహాయ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్,సీనియర్ నాయకులు ముండ్ల ముత్యాలు, ఎం.నందం, బాసాని వెంకటయ్య, విరయ్య ఎల్లయ్య, కౌంసల్య, జె.విజయ,చిత్రం రజిత,సైదమ్మపాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం విఫలం

### మునుగోడులో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/మునుగోడు:** కేంద్ర ప్రభుత్వం రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం,సిపిఎం రైతు సంఘం నాయకుడు బండ శ్రీశైలం అన్నారు.శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) పిలుపు మేరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా జీవో కాపీలను దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా తప్పుడు జీవోను తీసుకువచ్చారని విమర్శించారు. పార్లమెంటులో రైతులు పండించిన పంటకు మద్దతు ధరలపై చట్టం చేయాలని,స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి,చలిమెడ సర్పంచ్ బండమీది యాదయ్య,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, సిపిఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేశం, దుబ్బ వెంకన్న,బండారు శంకర్,కురుమర్తి ముత్తయ్య,యాట యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## నామ బ్రదర్స్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్




**ప్రజాపక్షం/నల్లగొండటౌన్:** మిర్యాలగూడకు చెందిన నామ జాషువ, వసంత కుమారులు నామ క్లెమెంట్, నామ క్లెమ్మి గిన్నిస్ వరల్ రికార్డులో చోటు సంపాదించారు. శుక్రవారం గచ్చిబౌలి, హైదరాబాద్ లో విక్టరీ ఆడిటోరియం ప్రాంగణం లో గిన్నిస్ 'అచీవర్స్ మీట్' నిర్వహించారు. ఈ సందర్భంగా హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి నామ క్లెమెంట్, నామ క్లెమ్మి లకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఏడాది ఫిబ్రవరి 2న గిన్నిస్ వరల్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 22 దేశాల నుండి 2,000 మంది విద్యార్థులు గంటపాటు కీబోర్డ్ ఆగకుండా వాయించారు. ఇందులో 777 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇందులో క్లెమెంట్, నామ క్లెమ్మి ఉండడం పట్ల తల్లిదండ్రులు, బంధుమిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు.

రీల్

# జూలై 31న వస్తున్న 'సిగ్మా'



లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ నిర్మిస్తున్న 'సిగ్మా' చిత్రం ప్రపంచవ్యాప్తంగా జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. టీజర్ ఇప్పటికే 20 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సినిమాపై అంచనాలను పెంచింది.లైకా ప్రొడక్షన్స్ హెడ్ జి.కె.ఎం తమిళ్ కుమరన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 31న 'సిగ్మా'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు ఇది ఒక కొత్త సినీ అనుభూతిని అందిస్తుందని నమ్ముతున్నాం. దర్శకుడిగా తొలి చిత్రానికే జేసన్ సంజయ్ మంచి స్పష్టత, అంకితభావం, నమ్మకంతో పనిచేశారు. ఈ విజన్‌ను సాకారం చేయడానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో కష్టపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు 'సిగ్మా'ను తీసుకురావడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అన్నారు.దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ సిగ్మా నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన ప్రయాణం. నా విజన్‌ను నమ్మి, ప్రతి దశలోనూ అండగా నిలిచిన లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ చిత్రానికి పనిచేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో నిబద్ధతతో పని చేశారు. వారందరికీ నా ధన్యవాదాలు. జూలై 31న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాం. త్వరలో మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను పంచుకోబోతున్నాం అన్నారు.ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. హరిహరసుతన్ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. చిత్ర ఆడియో హక్కులను సరేగమా సొంతం చేసుకోగా, డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. త్వరలో ఆడియో లాంచ్, ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించనున్నారు.

# 'హాయ్ రే' పాటను ఆవిష్కరించిన నాని



డైరెక్టర్ వెంకీ కుడుముల తన సొంత నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, మహేష్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలోని హాయ్ రే అనే పాటను హీరో నాని ఆవిష్కరించారు. థమన్ ఈ పాటను స్ట్రాంగ్ బీట్స్‌తో రిథమ్ నంబర్‌గా కంపోజ్ చేశారు. ట్రెండీ రిథమ్స్‌తో పాటు క్లాసికల్ టచ్, బ్రైట్ ఇన్‌స్ట్రుమెంటేషన్ పాటకు మోడ్రన్ ఫీల్ తీసుకొచ్చాయి.అనిరుధ్ రవిచందర్ తన ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంజన ఆలపించిన కర్ణాటిక్ టచ్ నోట్స్, హర్ష వర్ధన్ ర్యాప్ సెగ్మెంట్ పాటకు కొత్త లేయర్స్‌ను జోడించాయి. కళ్యాణ్ చక్రవర్తి రాసిన సాహిత్యం సింపుల్‌గా, హార్ట్‌ఫుల్‌గా ఉండి హీరోయిన్‌ను దూరం నుంచి ప్రేమించే హీరో భావాలను అందంగా వ్యక్తపరిచింది.

# 'రోమాంచకం' టైటిల్ పోస్టర్ రిలీజ్




అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి పాన్ ఇండియా సినిమాలు రూపొందించిన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ పై తన సోదరుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ప్రతి చిత్రాన్ని నిర్మిస్తున్నారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా. తాజాగా 'రోమాంచకం' సినిమాను నిర్మిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ ద్వారా నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు.'రోమాంచకం' సినిమా టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ మన సుకు హత్తుకునే ఫీల్‌తో యూత్ ఫుల్ వైబ్స్ తో ఆకట్టుకుంటోంది. ఈ సినిమా లవ్, ఫన్, బ్యూటిఫుల్ ఎమోషన్స్ ఉన్న ఒక ఫ్రెష్ ఎంటర్‌టైనర్ అనే ఇంప్రెషన్ టైటిల్ పోస్టర్‌తో కలుగుతోంది. ఈ చిత్రానికి పెట్టిన ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్ లైన్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సరికొత్త కథకు సుమంత్ ప్రభాస్, అనంతిక జంట మరింత ఫ్రెష్‌నెస్ తీసుకొస్తున్నారు. ఎంతోమంది యంగ్ టాలెంటెడ్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్న 'రోమాంచకం' సినిమా ఒక ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ మేకర్స్ వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి డిఓపి పవన్ పప్పుల, మ్యూజిక్ వాసుకి వైభవ్.

# క్రైమ్ థ్రిల్లర్‌గా 'హిట్ అండ్ రన్'



సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో త్వరలో రానున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్ రెడ్డి అల్లం ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీలక్ష్మి నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్‌ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు.ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్‌ను ఫినిష్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. 'హిట్ అండ్ రన్' సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. త్వరలోనే 'హిట్ అండ్ రన్' టీజర్‌ను విడుదల చేయబోతోన్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సంజయ్ రావ్, నటాషా సింగ్, కిరీటి, మురళీధర్ గౌడ్ లిరీషా కునపరెడ్డి, రవి ప్రకాష్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరామెన్ : విజయ్ భాస్కర్ సద్దాల, ఎల్ గంగాధర్.



# 'చెన్నై లవ్ స్టోరీ' పాటలకు విశేష ఆదరణ

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన సాంగ్స్ మ్యూజిక్ లవర్స్ ఆదరణతో ఛాట్ బస్టర్స్‌గా మారుతున్నాయి. ఫస్ట్ సింగిల్ 'తొలి ప్రేమం తోపు కాదే..' ఇప్పటికే హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకోగా, రీసెంట్‌గా రిలీజ్ చేసిన సెకండ్ సింగిల్ 'వదలనే..' పాట కూడా సక్సెస్ అయ్యింది. ఇలా రిలీజ్ చేసిన ప్రతి పాట ప్రేక్షకుల ఆదరణ పొందుతూ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా మ్యూజికల్‌గా బ్లాక్ బస్టర్ జర్నీ చేస్తోంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి. జూలైలో ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.ఈచిత్రానికి ఆర్ట్ భాస్కర్ ముదావత్, ఎడిటర్ సంతోష్ నాయుడు, డిఓపి విశ్వాస్ డేనియల్, లిరిక్స్ అనంత్ శ్రీరామ్, మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విశాల దాట్ల, లైన్ ప్రొడ్యూసర్ శ్యామ్ ప్రసాద్ మేక, కో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని.

# జూన్ 21న 'టిఎఫ్‌సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ 2026 అవార్డ్స్'

జూన్ 13 వరకు ఉచితంగా ఎంట్రీలు
చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్

చిత్ర పరిశ్రమలో కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టిఎఫ్‌సిసి) ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'టిఎఫ్‌సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ – 2026' ను టిఎఫ్‌సిసి ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదు. 5 నిమిషాల నుంచి 25 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలింలను ఔత్సాహిక దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు పంపవచ్చు. ఎంట్రీలను జూన్ 13వ తేదీ వరకు స్వీకరిస్తారు. జ్యూరీ ఎంపిక చేసిన విజేతలకు జూన్ 21న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నామని, ఇకపై ప్రతి ఏడాది దీన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన పలువురు హీరోలు, దర్శకులు షార్ట్ ఫిలిమ్‌ల నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో ఉత్తమ కథ , ఉత్తమ దర్శకుడు , ఉత్తమ నటుడు , ఉత్తమ నటి , ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సినిమాటోగ్రాఫర్, ఉత్తమ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ నిర్మాత, జ్యూరీ అవార్డు లతో పాటు ఉత్తమ జర్నలిస్ట్ (ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా),ఉత్తమ ఫోటో జర్నలిస్ట్, ఉత్తమ కెమెరామెన్ తదితర దాదాపు 20 విభాగాల్లో అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఫెస్టివల్ నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. టిఎఫ్‌సిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్బాఖాన్ మాట్లాడుతూ, షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ద్వారా ఎంతోమందికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తోందని చెప్పారు. ఇప్పటికే ఎంట్రీలు రావడం ప్రారంభమైందని, జూన్ 13లోపు తమ చిత్రాలను పంపాలని కోరారు.ఈ ప్రెస్ మీట్‌లో టిఎఫ్‌సిసి వైస్ ఛైర్మన్ అల్లా భక్షు, టిఎఫ్‌సిసి కోఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు.



## గోధుమల సేకరణ గడువును పొడిగించాలని

# రోడ్డెక్కిన రైతులు

### రైల్వే ట్రాక్‌పై బైఠాయింపు, రాకపోకలకు అంతరాయం
### గోధుమల సేకరణ లక్ష్యాన్ని పెంచాలని డిమాండ్

**జైపూర్ :** రాజస్థాన్‌లో జైపూర్‌లో రైతులు రోడ్డెక్కారు. గోధుమల సేకరణ గడువును పొడిగించాలని, సేకరణ లక్ష్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ వంద లాది మంది రైతులు శనివారం హనుమాన్‌గఢ్ జిల్లాలోని పిలిబంగా పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు రైల్వే ట్రాక్‌ను కొద్దిసేపు దిగ్బంధించారని అధికారులు తెలిపారు. నిరసనకారులు బికనీర్–హనుమాన్‌గఢ్ రైలు పట్టాలపై దాదాపు గంటసేపు బైఠాయించి రాకపోకలకు అంతరాయం కలిగించారని, అయితే ట్రాక్‌ను ఖాళీ చేసి నిరసన ప్రదేశానికి తిరిగి వెళ్లాలని అధికారులు వారిని ఒప్పించారని వారు చెప్పారు. ఉదయం సమావేశమైన రైతులు, తమ నాయకుల విజ్ఞప్తి మేరకు రోడ్డు దాటి సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని, అక్కడ బైఠాయింపు చేపట్టారు. గోధుమల సేకరణ గడువును పొడిగించాలని, సేకరణ లక్ష్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ రైతులు గత రెండు రోజులుగా ఎస్‌డిఎం కార్యాలయం వెలుపల నిరసన తెలుపుతున్నారు. అధికారులతో చర్చలు కొనసాగుతున్నాయని, అయితే కొను గోలు తేదీల పొడిగింపు, లక్ష్యాల సవరణకు సంబంధించిన నిర్ణయాలు ప్రభుత్వ స్థాయిలో మాత్రమే తీసుకోగలమని రైతు నాయకుడు రఘువీర్ వర్మ అన్నారు. స్థానిక అధికారులు కేవలం హామీలు మాత్రమే ఇస్తున్నారు, కానీ రైతులకు తక్షణ నిర్ణయం కావాలని ఆయన అన్నారు. పంట మొత్తం కొనుగోలు జరిగేలా చూడటానికి, కొనుగోలు కాలాన్ని జూన్ 30 వరకు పొడిగించాలని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. గోనె సంచుల కొరత, గోధుమల తరలింపులో జాప్యం, కొనుగోలు కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌లో సమస్యలు వంటి అంశాలు పరిస్థితిని మరింత దిగజార్చాయని నిరసనకారులు పేర్కొన్నారు.

# కిశోర బాలికల సాధికారతే సమాజాభివృద్ధికి పునాది

### రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కిశోర బాలికల సాధికారతే సమాజాభివృద్ధికి పునాది విద్య, ఆరోగ్యం,సంస్కారం జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని రాష్ట్ర పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగ ంగా మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అమ్మ మాఅంగన్వాడీ బాటా కార్యక్రమంలో అంగన్వాడీ పిల్లలకు యునిఫామ్ లు విద్యారాంబ సర్టిఫికేట్ లను మంత్రి చిన్నారులకు అందజేశారు. మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మంత్రి మాట్లాడుతూ కిశోర బాలికల సాధికారత,విద్యా ప్రగతి,వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల బాలికలను చిన్న వయస్సు నుంచే గుర్తించి వారికి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా భవిష్యత్తులో వారు ఎమ్మెల్యేలు, ఎంపి లు, కలెక్టర్లు, ఎస్‌పి లు వంటి ఉన్నత స్థానాలను అధిరోహించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. విద్య జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధమని నెల్సన్ మండేలా చెప్పిన మాటలను గుర్తు చేస్తూ,బాలికలు విద్యతో పాటు సంస్కారం,క్రమశిక్షణ,పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు.

కలెక్టర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘా లు గత రెండు దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధి ,ఆర్థిక స్వావలంబనలో విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు.స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు బ్యాంకు రుణాలు పొంది వివి ధ జీవనోపాధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. సమాజంలో పెరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం,మారుతున్న జీవనశైలుల నేపథ్యంలో కిశోర బాలికలకు సరైన మార్గనిర్దేశం అవసరమని,స్నేహ గ్రూపులు మంచి పౌరులుగా ఎదగడానికి వేదికగా నిలుస్తాయని చెప్పారు. స్నేహ గ్రూపుల ద్వారా మంచి అలవాట్లు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని, రంగారెడ్డి జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపే విధంగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య,మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్,సెర్ప్ సిఇఒ దివ్యదేవరాజన్,మహిళా సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా,జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి,విమెన్ కమిషన్ మెం బర్ సదాలక్ష్మి,డిఆర్‌డిఎ పిడి ఎల్ శ్రీలత,జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, డిపిఓ వి సురేశ్ మోహన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

# ఇ-వేలంతో రూ.202 కోట్ల అదనపు ఆదాయం...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన కొత్త ఈవేలం విధానం మొక్కజొన్న విక్రయంలో భారీ లాభాలను తెచ్చిపెట్టింది. సరళమైన నిబంధనలు, దేశవ్యాప్తంగా బిడ్డర్ల భాగస్వామ్యంతో నిర్వహించిన తాజా ఈవేలంలో రాష్ట్ర ప్రభుత్వానికి గతంతో పోలిస్తే రూ.202.56 కోట్ల అదనపు విలువ లభించినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. వానాకాలం 202526 సీజన్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా 78,916 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 3,80,187 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న విక్రయానికి ప్రభుత్వం వినూత్న ఈవేలం విధానాన్ని అమలు చేసింది. గతంలో గోదాం వారీగా ఈవేలం, అనంతరం టూ బిడ్ సిస్టమ్ ద్వారా ఈటెండర్లు నిర్వహించే విధానం అమల్లో ఉండేది. అయితే ఏప్రిల్‌లో నిర్వహించిన టెండర్లలో మెట్రిక్ టన్నుకు రూ.14,010 నుంచి రూ.14,355 మాత్రమే ధర లభించింది.

దీంతో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశాల మేరకు పాత టెండర్‌ను రద్దు చేసి, రాష్ట్రంలోని గోదాములను భౌగోళిక ప్రాతిపదికన 25 లాట్లుగా విభజించి, నిబంధనలను సరళీకరించి కొత్త ఈవేలం నిర్వహించారు. ఈ నెల 29న జరిగిన తాజా ఈవేలంలో మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,337 ధర లభించింది. ఇది గత టెండర్‌తో పోలిస్తే టన్నుకు రూ.5,327 అధికం. గత టెండర్‌ను కొనసాగించి ఉంటే మొత్తం నిల్వలకు రూ.532.64 కోట్ల విలువ మాత్రమే వచ్చేదని, తాజా ఈవేలం ద్వారా రూ.735.20 కోట్ల ఆదాయం సమకూరనుండటంతో ప్రభుత్వానికి అదనంగా రూ.202.56 కోట్ల లాభం దక్కిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బిడ్డర్ల మధ్య పోటీ పెరిగేలా తీసుకున్న నిర్ణయాల వల్లే రైతుల పంటకు మెరుగైన ధర లభించింది. ప్రజాధనాన్ని పరిరక్షిస్తూ ప్రభుత్వానికి గరిష్ట ఆదాయం తీసుకురావడం మా ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.

# భారీగా బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

తిప్పర్తి యాదయ్య, ఎం. బాలకృష్ణ ప్రసాద్, జి. రామలింగం, శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, రవీందర్ సాగర్, ఎ. సంపత్ వంటి పలువురు అధికారులను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.

జిహెచ్ఎంసికి : రాజేందర్ రెడ్డి, ఎం. ఉమామహేశ్వర్ రావు, సయ్యద్ ముసాబ్, సమ్రీన్ నాజ్, బి. శ్రేయ, వి. స్వర్ణలత, కె. రజిని, కె. శ్రీహరి, మహేశ్వర్ రెడ్డి, జి. రాజు, ఎన్. వసంత, వెంకటయ్య, ఎన్. వెంకటేశ్వర్లు తదితరులను బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు :** జి. శ్రీనివాస్ (గ్రేడ్ II), హెచ్.ఎం. స్పందన, కె. కావ్య శ్రీ, ఆర్. లక్ష్మి ప్రసన్న, షేక్ జాని బాషా, పి. మధుసూదన్ రెడ్డి, లక్ష్మారెడ్డిలను సైబరాబాద్ కార్పొరేషన్‌కు కేటాయించారు.

**పలు మున్సిపాలిటీల కొత్త కమిషనర్లు..**

ఎస్. రాజయ్య : మఖ్తల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ.

ఎ. నరేష్ కుమార్ : ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్.

ఎం. రామచంద్రరావు : వైరా మున్సిపల్ కమిషనర్‌గా (డెప్యుటేషన్ పై).

రాజశేఖర్ చిమ్ముల : జంగ్గాం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ.

మొహమ్మద్ మున్వర్ అలీ : వనపర్తి మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

యాదగిరిగుట్టకు బి. శ్రీనివాస్: హుజూర్ నగర్ కమిషనర్‌గా ఉన్న బి. శ్రీనివాస్‌ను యాదగిరిగుట్టకు బదిలీ చేశారు.

**తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలు**

బదిలీ అయిన అధికారులందరినీ తక్షణమే విధులకు రిలీవ్ చేయాలని సంబంధిత కమిషనర్లు, అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అలాగే, ఈ బదిలీల వల్ల స్థానచలనం కలిగి, ఇంకా ఎలాంటి పోస్టింగ్ ఖరారు కాని మున్సిపల్ కమిషనర్లు అందరూ తదుపరి పోస్టింగ్ కోసం వెంటనే ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా ఉత్తర్వులలో స్పష్టం చేశారు.

# కర్నాటక సిఎల్‌పి నేతగా డికె

(మొదటి పేజీ తరువాయి)

సిఎల్‌పి సమావేశానికి ముందే డికె ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**మంత్రివర్గంలో సిద్ధరామయ్య కొడుకు?**

శివకుమార్ సిఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎందకంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది.



# భారీ ఉగ్రకుట్ర భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

(మాడ్యూల్)ను చాలా కాలంగా అత్యంత పకడ్బందీగా పెంచి పోషించింది. కాగా ఈ నెట్‌వర్క్‌లో భాగమైన ముష్కరుల్లో నేపాల్‌కు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ప్రాథమిక దర్యాప్తులో అరెస్టు అయిన ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతున్న హ్యాండర్లతో, అలాగే ముంబయి అండర్‌వరల్డ్ డాన్‌గా పేరొందిన దావూద్ ఇబ్రహీంతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఢిల్లీలోని అత్యంత కీలకమైన భద్రతా స్థావరాలు, రక్షణ సిబ్బంది, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేయాలని వీరికి నిర్దేశించినట్లు తెలిసింది. అయితే నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ పకడ్బందీగా ఆపరేషన్ నిర్వహించి ఉగ్రవాదుల మాడ్యూల్ నుంచి అత్యాధునిక ఆయుధాలు, పేలుడు పదార్థాలు, తుపాకులు, హ్యాండ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకుంది. దేశ రాజధానికి ఉన్న తక్షణ ముప్పును విజయవంతంగా నివారించగలిగింది. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఈ ఉగ్రముఠాకు నిధులు (ఫండింగ్ ఛానల్స్) ఎలా వస్తున్నాయ్? వాళ్ల రిక్రూట్‌మెంట్ పద్ధతులు, వాళ్లకు అందిన రవాణాసహాయక నెట్‌వర్క్‌పై దర్యాప్తు ప్రారంభించింది. అంతేకాదు ఈ ఉగ్రకుట్రలో పాల్గొన్న హ్యాండ్లర్లు ఎవరు? స్థానికుల సహకారం ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

**దావూతద్ అనుచరుడి అరెస్టు**

ఇదిలా ఉండగా, సరిగ్గా నెల రోజుల క్రితం పరారీలో ఉన్న అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు మహ్మద్ సలీం డోలాను తుర్కియే నుంచి భారతదేశానికి తీసుకురావడం జరిగింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఈ విధంగా డికంపెనీ నెట్‌వర్క్‌పై ఒక పెద్ద విజయాన్ని సాధించింది.

# ట్రంప్ ఊగిసలాట

(మొదటి పేజీ తరువాయి)

నాలుగోవంతు డబ్బుమార్పిడి జరగదని ట్రంప్ చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మరోచోట మాట్లాడుతూ, అమెరికా–ఇరాన్ ఒక ఒప్పందానికి చేరువలో ఉన్నాయిగానీ ఒప్పందం కుదరలేదన్నారు. ఒప్పందం కుదరకపోతే మళ్ళీ ఇరాన్‌పై దాడులకు సిద్ధంగా ఉన్నామని అమెరికా సెంట్‌కామ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ చెప్పగా, ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణకు అవకాశం ఉందని అమెరికా యుద్ధమంత్రి(రక్షణమంత్రి)పెట్ హెగ్సెత్ చెప్పారు. మరోవైపు ఇరాన్ విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి ఇస్మాయెల్ ఘాలిబాఫ్ ఎక్స్‌వేదికగా శనివారం ఒక ప్రకటన చేస్తూ, హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనాన్ని తొలగించిన తర్వాతే జలసంధిని నౌకల రాకపోకలకు తెరుస్తామని స్పష్టం చేశారు. యుద్ధం ముగించడంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని, శుద్ధి చేసిన యురేనియం,అణ్వాయుధ అంశంపై చర్చలు జరగలేదని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమం గురించి ఎంఓయు ముసాయిదాలో ఎలాంటి నిబంధనలనూ చేర్చలేదని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమం పౌర ప్రయోజనాలను ఉద్దేశించినదే, దీనిపై చర్చలకు తావు లేదు, తమ అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాలను ఉద్దేశించినదేగానీ, అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయడం కోసమని అమెరికా చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని ఘాలిబాఫ్ విమర్శించారు. ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు నిజాలు–అబద్ధాల సమ్మేళనం(సత్యాసత్యాల సమ్మేళనం) అని విమర్శించారని ఇరాన్ ఫార్స్ వార్తా సంస్థ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది. ఏ ఒప్పందంలోనైనా మరునాడు కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే నిజమైన యుద్ధవిజేతలు,నిజమైన కథానాయకులవుతారని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా మాటలపై తమకు ఎలాంటి విశ్వసనీయత లేదని, కేవలం ఆ దేశం అనుసరించే కార్యాచరణ మాత్రమే తమకు విశ్వాసం కలిగిస్తుందని చెప్పారు. "మేం సంభాషణల ద్వారా రాయితీలు సంపాదించుకోం, క్షిపణి దాడుల ద్వారా సంపాదించుకుంటాం" అన్నారు. అణు సమస్య ఇంకా అపరిష్కృతంగానే ఉందని పేర్కొన్నారు. అమెరికా నుండి నిత్యం పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని ఘాలిబాఫ్ విమర్శించారు. ఇరుపక్షాలు ఒక ఒప్పందానికి వచ్చాయని, 60 రోజుల కాల్పుల విరమణ అమలు చేస్తారని, ఇదే సమయంలో టెహ్రాన్ అణు కార్యక్రమంపై చర్చ జరుగుతుందని వైట్‌హౌస్ వర్గాలు మే 28వ తేదీన ధృవీకరించినట్లు ఆక్సియోస్ నివేదిక పేర్కొంది. కానీ అణు పదార్థంపై ఎలాంటి చర్చా జరగడంలేదని, ఎంఓయులో ఆ అంశం లేదని ఘాలిబాఫ్ చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com